ప్రతిపక్షం

www.prathipaksham.in

గురువారం 05.02.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 316 పేజీలు:12 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu



నేడే డబ్ల్యూపీఎల్ ఫైనల్ 12

'ఎవరికి నువ్వు జాతి పితవు... నీ జాతికి కావొచ్చు. మాకు కాదు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులను మొఖాలకు ముసుగు తొడిగి విచారణకు పోలీసులు తీసుకురావాల్సింది. జాతిపిత అయితే మీరు సంపాదించుకున్న ఆస్తులు తెలంగాణ ప్రజలకు ఇస్తారా..? సీఎం, మంత్రి, ఎమ్మెల్యే అన్ని పదవులు మీరే తీసుకున్నారు. తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మకు చిన్న పదవి కూడా ఇవ్వలేదు. తెలంగాణ కోసం సర్వం త్యాగం చేసిన ప్రొఫెసర్ జయశంకర్ జాతి పిత అవుతడు. ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టీ మొత్తం పోయినా తెలంగాణ ప్రజల ఆకాంక్షను నేరవేర్చిన సోనియమ్మ తెలంగాణ తల్లి అవుతుంది. తెలంగాణ ప్రజలకు మీరు క్షమాపణ చెప్పాలి.'

- సీఎం రేవంత్‌రెడ్డి



భార్యాభర్తల ఫోన్లు ఎవరైనా వింటారా?

ఎవరికి నువ్వు జాతి పితవు?

నీ జాతికి కావొచ్చు మాకు కాదు!

- వారికి ముసుగు తొడిగి విచారణకు తీసుకురావాల్సింది
- జాతిపిత అయితే మీ ఆస్తులు ప్రజలకు ఇస్తారా?
- బీఆర్ఎస్ పార్టీపై నిప్పులు చెరిగిన సీఎం రేవంత్
- మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తిరుగులేదు
- మహిళా శక్తి ముందు ఎవరు నిలువలేరు
- అన్నివర్గాల అభ్యున్నతికోసం ప్రభుత్వం పని చేస్తుంది
- ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టండి
- మిర్యాల గూడ సభలో సీఎం రేవంత్ రెడ్డి
- మున్సిపల్‌ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టిన సీఎం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 4: 'భార్యాభర్తలు మాట్లాడుకుంటే ఫోన్లు విన్నరు. జర్నలిస్టులు, సినిమా తారలు, జడ్జీలు ఎవరిని వదల లేదు.' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌కు సిట్ నోటీసులిస్తే జాతిపితకు నోటీసు ఇస్తారా? అని ఎదురు దాడికి దిగుతున్నారని, కొంత మంది జాతిపితను విచారిస్తారా అని అడుగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మిర్యాలగూడలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. 'ఎవరికి నువ్వు జాతి పితవు... నీ జాతికి కావొచ్చు. మాకు కాదు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులను మొఖాలకు ముసుగు తొడిగి విచారణకు పోలీసులు తీసుకు రావాల్సింది. జాతిపిత అయితే మీరు సంపాదించుకున్న ఆస్తులు తెలంగాణ ప్రజలకు ఇస్తారా..? సీఎం, మంత్రి, ఎమ్మెల్యే అన్ని పదవులు

...:: మిగతా 2లో

ఎమ్మెల్యే సంజయ్ అనర్హత పిటిషన్ కొట్టివేత

- ఆధారాలు చూపలేకపోయారన్న స్పీకర్
- కడియం, దానంపై విచారణను 19కి వాయిదా
- నేను బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేనే
- అభివృద్ధి కోసం ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నా
- అసెంబ్లీలో బీఆర్ఎస్ బిల్లులకు మద్దతు ఇస్తా
- ఎమ్మెల్యే సంజయ్ కుమార్



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 4: జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ పై దాఖలైన అనర్హత పిటిషన్‌ను స్పీకర్‌గడ్డం ప్రసాద్ కుమార్ కొట్టేశారు. సంజయ్‌పై అనర్హత కోరుతూ బీఆర్ఎస్ నేతలు పిటిషన్ వేశారు. దానిని కొట్టేస్తూ స్పీకర్ ఇవాళ తీర్పును వెలువరించారు. పార్టీ మారారనడానికి సరైన ఆధారాలు లేవని సభాపతి పేర్కొన్నారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల విచారణకు సంబంధించి ఈ నెల 6లోపు పురోగతిని సుప్రీంకోర్టుకు స్పీకర్ నివేదించాల్సి ఉంది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేలపై విచారణ జరపాలని సుప్రీంకోర్టు స్పీకర్‌ను ఆదేశించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా ఇప్పటికే 8మంది ఎమ్మెల్యేలకు సంబంధించి విచారణను స్పీకర్ పూర్తి చేశారు. ఇందులో సంజయ్ మినహా మిగతా ఏడుగురి పిటిషన్లను కొట్టేశారు. సంజయ్‌పిటిషన్ పై తీర్పును ఇవాళ ప్రకటించారు. కడియం శ్రీహరి, దానం నాగేందర్‌పై దాఖలైన పిటిషన్ల విచారణను ఫిబ్రవరి 19వ తేదీకి వాయిదా వేశారు.

నేను బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేనే : సంజయ్

స్పీకర్ ప్రసాద్ కుమార్ తీర్పుపై జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ స్పందించారు. తాను బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేనని ఆయన స్పష్టం చేశారు. తన జీతం నుంచి నెలకు రూ.5వేలు ఆ పార్టీకి కట్ అవుతున్నట్లుగా తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే అని అఫిడవిట్ ఇచ్చానని సంజయ్ తెలిపారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ బిల్లులు పెట్టి, విప్ జారీ చేస్తే మద్దతు ఇస్తానని స్పష్టం చేశారు. "నేనూ బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన. నేను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే. జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నా. నేను సీఎంను డిసెంబర్‌లో కలిసా. ఆరోజే సీఎంవో ఆఫీసు నుంచి లెటర్ కూడా వచ్చింది. తర్వాత కూడా కలిసి కొన్ని నిధుల విడుదలయ్యేందుకు కృషి చేశా. ఆ తర్వాత జూన్‌లో సీఎంను కలవడానికి పోతే ఎలాంటి అధికారిక సమాచారం లేకుండా నాకు కండువా కప్పారు. అయితే బీఆర్ఎస్‌నాయకులు వచ్చి నా హస్పిటల్ మీద దాడి చేశారు. వివరణ ఇవ్వడానికి నాకు ఒక్క అవకాశం కూడా ఇవ్వలేదు." అని తెలిపారు.



నరవణే పుస్తకం ప్రధానికి అందజేస్తా

మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ నరవణే రాసిన పుస్తకం వివాదం చెలరేగిన వేళ ప్రధాని నరేంద్ర మోదీకి స్వయంగా ఆ బుక్‌ను అందజేస్తానని కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ వెల్లడించారు.

11



ముఖ్యమంత్రిగా ఖేమ్‌చంద్ సింగ్ ప్రమాణం

మణిపూర్ నూతన ముఖ్యమంత్రిగా యుమ్నమ్ ఖేమ్‌చంద్ సింగ్ ప్రమాణస్వీకారం చేశారు. మాజీ మంత్రి, కుకీ నాయకురాలు నెమ్చా కిప్ గెన్, నాగాలకు చెందిన లోసి దిఖోలు కొత్త ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రులు ప్రమాణం చేశారు.

11

పెద్దపల్లి నుంచి అసెంబ్లీ బరిలోకి కవిత?



- రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చ
- మున్సపల్‌ఎన్నికల్లో ఫార్వర్డ్ బ్లాక్‌తో జతకట్టిన జాగృతి
- పెద్దపల్లి నుంచి పెద్ద సంఖ్యలో అనుచరులు బరిలోకి
- ఈ నేపథ్యంలో ఇక్కడి నుంచే కవిత పోటీలో ఉంటారని ఊహాగానాలు

ప్రతిపక్షం ప్రతినిధి, పెద్దపల్లి

ఫిబ్రవరి 4: రానున్న అసెంబ్లీ ఎన్నికలలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఎక్కడి నుంచి పోటీ చేయనున్నారు అన్న అంశం ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే సొంత పార్టీ రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తు చేసుకున్న

...:: మిగతా 2లో

బినామీ కంపెనీకి వేల కోట్లు



- 'కేఎల్ఎస్ఆర్' కు అర్హత లేకున్నా కాంట్రాక్టులు
- ఈ కంపెనీ వ్యవహారాలపై రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీం నోటీసులు
- విచారణ చేయించాలని కేంద్రానికి ఆదేశాలు
- ఈ నోటీసుల అంశాన్ని దాచడానికే రేవంత్ డ్రామాలు
- వెంటనే ఈ కంపెనీ పైన విచారణ ప్రారంభించాలి
- అప్పటిదాకా కంపెనీ కార్యకలాపాలను ఆపాలి
- కంపెనీని బ్లాక్ లిస్ట్ చేసి, కాంట్రాక్టులను రద్దు చేయాలి
- సీఎం రేవంత్ పై కేటీఆర్ సంచలన ఆరోపణలు


ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 4: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ, తన బినామీ కంపెనీకి దోచి పెడుతున్నారని బీఆర్ఎస్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కేఎల్ఎస్ఆర్ అనే కంపెనీ మొదటి నుంచి రేవంత్ రెడ్డికి బినామీ కంపెనీగా వ్యవహరిస్తున్నదని, ఈ కంపెనీకి రేవంత్ రెడ్డికి ఉన్న సంబంధాలు అందరికీ తెలిసిన విషయమే అన్నారు. అయితే తాజాగా ఈ కేఎల్ఎస్ఆర్ అనే కంపెనీ న్యాయమూర్తులను మేనేజ్ చేసే విషయం నుంచి మొదలుకొని, దివాలా తీసిన ఈ కంపెనీలో కొనసాగుతున్న వందల కోట్ల ఆర్థిక లావాదేవీల పైన నిగ్గుతేచాలని సుప్రీంకోర్టు వారం కింద తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చిందని అన్నారు. తన బినామీ కంపెనీ, తన అక్రమాలు బయటపడతాయనే ఉద్దేశంతోనే దావోస్లో ఉన్న రేవంత్ రెడ్డి సిట్ విచారణ పేరుతో డ్రామాలకు తెరలేపారని కేటీఆర్ ఆరోపించారు.

దివాళా తీసిన కంపెనీకి అడ్డగోలుగా కాంట్రాక్టులు

ఈ కేఎల్ఎస్ఆర్ కంపెనీపై 2018 లోనే ఈడీ,

...:: మిగతా 2లో



నువ్వు సీఎంవా.. వీధి రౌడీవా?

- అసభ్య పదజాలంతో బెదిరింపులా.?
- ఇదేనా కాంగ్రెస్ సంస్కారం
- మెదక్‌లో రేవంత్ రెడ్డిపై హరీష్ రావు ఫైర్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్

ఫిబ్రవరి 4: కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భాషా శైలి, పాలనా తీరుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మెదక్ మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో హరీష్ రావు మాట్లాడుతూ

...:: మిగతా 2లో



బలూచ్ రెబల్స్ దగ్గర ఆధునిక ఆయుధాలు

పాకిస్తాన్ సైన్యంకంటే బలూచ్ రెబల్స్ దగ్గరే ఆధునిక, ప్రభావవంతమైన ఆయుధాలున్నాయని పాక్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్ అన్నారు. బలూచ్ ప్రాంతంలో పాకిస్తాన్ ఆర్మీ క్రమంగా పట్టుకోల్పోతోందని ఆయన అభిప్రాయపడ్డారు.

11

'సనాతనం'పై దాడులను సహించం

- హిందువుల మనోభావాలు దెబ్బతీస్తున్నారు
- ఆలయ భూములు ఆక్రమిస్తున్నారు
- బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఆగ్రహం
- మహబూబ్‌నగర్‌లో బీజేపీ విజయ సంకల్ప సమ్మేళానికి హాజరు



ప్రతిపక్షం, మహబూబ్ నగర్

ఫిబ్రవరి 4 : తెలంగాణ రాష్ట్రంలో సనాతన ధర్మం మీద జరుగుతున్న దాడులను సహించమని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ హెచ్చరించారు. హిందూ దేవాలయాలపై దాడులు జరుగుతున్నా కాంగ్రెస్ సర్కారు నోరు మెదపట్లేదని, హిందువుల మనోభావాలు దెబ్బతీస్తూ ఆలయ భూములు ఆక్రమిస్తున్నారని

...:: మిగతా 5లో



ఎన్ఎస్పీ కాలువలకు పూర్తిస్థాయిలో మరమ్మతులు

- కృష్ణా జలాలలో రాష్ట్ర హక్కుల పరిరక్షణకు పోరాటం
- త్వరితగతిన ఎత్తిపోతల పథకాల పూర్తికి ప్రణాళికాలు
- మిర్యాలగూడ సభలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, నల్గొండ

ఫిబ్రవరి 4: నాగార్జున సాగర్ మెయిన్ కెనాల్ తో పాటు దానికి అనుబంధంగా ఉన్న మేజర్ కాలువలకు పూర్తి స్థాయిలో మరమ్మతులు నిర్వహిస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాకే కృష్ణా జలాశయాలలో పోరాటం చేసి తెలంగాణా హక్కులకు భంగం వాటిల్లకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం మిర్యాలగూడలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సభలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, సహచర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లతో కలసి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో ఈ ఎత్తిపోతల పథకాలన్నీ నిర్లక్ష్యానికి గురయ్యాయని, 2021 ఫిబ్రవరి 10న భారీ అట్టహాసంగా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన జరపడంతో పాటు సంవత్సరన్నర లో

...:: మిగతా 2లో

ఎంపీల సస్పెన్షన్‌పై లోక్‌సభలో రచ్చ

- మోడీని చుట్టుముట్టిన మహిళా ఎంపీలు
- ప్రసంగాన్ని రద్దు చేసుకున్న ప్రధాని
- లోక్‌సభలో ఉద్రిక్త వాతావరణం

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: ఎంపీల సస్పెన్షన్‌పై లోక్‌సభలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విపక్ష మహిళా ఎంపీలు లోక్‌సభలో ప్రధాని నరేంద్ర మోదీతోసహా అధికార పక్ష ఎంపీల సీట్లను అడ్డుగా నిలుచోవడంతో బుధవారం సభలో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మాట్లాడవలసి ఉన్న ప్రధాని మోదీ తన ప్రసంగాన్ని

...:: మిగతా 5లో





ఎస్ఐఆర్ వల్ల 150 మంది చనిపోయారు

కేంద్ర ఎన్నికల సంఘం పశ్చిమ బెంగాల్‌లో చేపట్టిన 'ఎస్ఐఆర్' వల్ల 150 మంది తమ రాష్ట్ర ప్రజలు ప్రాణాలు కోల్పోయారని సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు.

11

రాష్ట్రీయం

సీఐగా ప్రణీత్‌రావు డిమోషన్

- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం



ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కీలక నిందితుడు, ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న ప్రణీత్‌రావు డీఎస్పీ హోదాను రద్దు చేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డీఎస్పీగా పదోన్నతి పొందిన అనంతరం ప్రొబేషన్ కాలంలో విధుల దుర్వినియోగానికి పాల్పడిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా వెల్లడించింది. ఈ మేరకు హోంశాఖ ప్రధాన కార్యదర్శి సీవీ ఆనంద్ ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను జారీ చేశారు. దీంతో గతంలో ప్రణీత్‌రావుకు కల్పించిన యాక్సిలరేటెడ్ ప్రమోషన్ రద్దయినట్లయింది. ఇకపై ఆయన ఇన్‌స్పెక్టర్‌గానే కొనసాగనున్నారు. సాధారణంగా తీవ్రవాద, ఉగ్రవాద కార్యకలాపాల అణచివేతలో అసమాన ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులకు మాత్రమే యాక్సిలరేటెడ్ పదోన్నతి కల్పించే విధానం రాష్ట్రంలో అమల్లో ఉంది. అలాంటి కార్యకలాపాల్లో పనిచేయకపోయినప్పటికీ ప్రణీత్‌రావుకు డీఎస్పీగా పదోన్నతి కల్పించడం అప్పట్లో తీవ్ర కలకలం రేపింది. 2007 ఎస్సై బ్యాచ్‌లో దాదాపు 300 మంది ఉండగా ఒక్క ప్రణీత్‌రావుకు మాత్రమే డీఎస్పీగా పదోన్నతి కల్పించడం తీవ్ర చర్చనీయాంశమైంది. కేవలం ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినందుకే ప్రణీత్‌రావును అందలం ఎక్కించారనే విమర్శలు అప్పట్లో వచ్చాయి.



రాష్ట్ర అభివృద్ధిపై జాగృతి దృష్టి

- అధ్యయన కమిటీల నియామకం
- కమిటీలతో కవిత వరుస సమావేశాలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 4: తెలంగాణ జాగృతి అధ్యయన కమిటీలతో కల్వకుంట్ల కవిత బుధవారం వరుస సమావేశాలు ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రంలో సమగ్రాభివృద్ధి, సబ్బండ వర్గాల వికాసం, సామాజిక తెలంగాణ సాధన లక్ష్యంగా 50 అధ్యయన కమిటీలను ఏర్పాటు చేసిన తెలంగాణ జాగృతి, రాష్ట్ర సర్వసామాన్యాభివృద్ధి కోసం బ్లూ ప్రింట్ రూపకల్పనలో ప్రధాన పాత్ర పోషించనుంది. ఇప్పటికే పలు కమిటీలు నివేదికలు సమర్పించగా, మిగతా కమిటీల నివేదికలు త్వరలో అందించే ఏర్పాట్లు ఉన్నట్లు ప్రకటించారు. ఒక్కో కమిటీలో మూడు-నాలుగు మంది సభ్యులు నియమించారు. ఈ కమిటీల సభ్యులు సంబంధిత రంగాల నిపుణులు, ప్రముఖులు, క్షేత్రస్థాయి పరిశీలన ఆధారంగా నివేదికలు సిద్ధం చేస్తున్నారు. కమిటీ నివేదికల ఆధారంగా రాష్ట్ర అభివృద్ధి, వివిధ వర్గాల ప్రజల సాధికారత కోసం రూట్ మ్యాప్ రూపొందించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. తెలంగాణ జాగృతి ఈ ప్రయత్నాల ద్వారా సమగ్రాభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడంలో, పేద, మధ్యతరగతి, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ప్రత్యేక శ్రద్ధ చూపడంలో ముందడుగు వేస్తోంది. ఈ సమావేశంలో జాగృతి నాయకులు రూప్ సింగ్, రవిచంద్ర, ఇస్మాయిల్, నవీన్ చారి, భవానీ వేముల పాల్గొన్నారు.

పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా పోటీ చేశారని

కాంగ్రెస్ నుంచి ముగ్గురు సస్పెన్షన్

ప్రతిపక్షం ప్రతినిధి, సంగారెడ్డి, ఫిబ్రవరి 4: సంగారెడ్డి కాంగ్రెస్‌మున్సిపల్ ఎన్నికల కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. పార్టీ నిర్ణయాలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులపై స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్న ముగ్గురిని పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు కమిటీ ప్రకటించింది. 29వ వార్డులో కాంగ్రెస్ పార్టీ కండువా వేసుకుని ఇతర పార్టీలకు ఓట్లు వేయించే ప్రయత్నాలు చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న సునీల్ జై కుమార్, పార్టీ నిర్ణయించిన అభ్యర్థికి వ్యతిరేకంగా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయడంతో ఆయనను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. అలాగే 30వ వార్డులో పార్టీ అభ్యర్థికి వ్యతిరేకంగా స్వతంత్రంగా బరిలో దిగిన ఎక్స్ కౌన్సిలర్ నవాత్ నాగరాజును కూడా పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిపారు. 18వ వార్డులో పార్టీ నిర్ణయాన్ని విస్మరించి స్వతంత్ర అభ్యర్థిగా యూత్ కాంగ్రెస్‌కు చెందిన సల్మాన్ మాలిక్ పోటీ చేయడంతో, పార్టీకి నష్టం కలిగించే చర్యలకు పాల్పడ్డారనే కారణంతో ఆయన్ను యూత్ కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేశారు. ఈ ముగ్గురిపై సస్పెన్షన్ నిర్ణయం తీసుకున్నట్లు సంగారెడ్డి మున్సిపల్ ఎన్నికల కమిటీ సభ్యులు తోపాజి అనంత్ కిషన్, రఘు గౌడ్, జార్జ్, బొంగుల రవి వెల్లడించారు.

నువ్వు సీఎంవా.. వీధి రౌడీవా?

మొదటిపేజీ తరువాయి

రేవంత్ రెడ్డిని ఉద్దేశించి "నువ్వు ముఖ్యమంత్రివా? లేక వీధి రౌడీవా?" అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలన రౌడీయిజం, అబద్ధాలు, బెదిరింపుల మీదే నడుస్తోందని మండిపడ్డారు. అవ్వతాతలు పెన్షన్ అడిగితే, రైతులు రైతు బంధు అడిగితే, ఆడబిడ్డలు మహాలక్ష్మి పథకం గురించి ప్రశ్నిస్తే అసభ్య పదజాలంతో బెదిరింపులకు దిగడం ఇదేనా కాంగ్రెస్ సంస్కారం అని ఆయన నిలదీశారు. బాండ్ పేపర్లు రాసిచ్చి, హామీలు ఇచ్చి మోసం చేశారని ఆరోపించిన హరీష్ రావు, ప్రజల ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేక రేవంత్ రెడ్డి అహంకారంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఫిబ్రవరి 11వ తేదీలోగా రైతు బంధు పడకపోతే రైతులు తగిన రీతిలో స్పందిస్తారని హెచ్చరించారు. రుణమాఫీ పేరుతో దేవుళ్లనే మోసం చేసిన చరిత్ర కాంగ్రెస్‌దేనని, కాంగ్రెస్ అబద్ధాలను రైతులు ఇక నమ్మే పరిస్థితిలో లేరని స్పష్టం చేశారు. తెలంగాణ కోసం కేసీఆర్ చేసిన త్యాగాలను గుర్తు చేసిన హరీష్ రావు, డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే, ఎంపీ, కేంద్ర మంత్రి వంటి పదవులను గడ్డిపోచల్లా విసిరేసి తెలంగాణ సాధించారని అన్నారు. కేసీఆర్ ప్రాణ త్యాగానికి సిద్ధపడి రాష్ట్రాన్ని తెచ్చారు కాబట్టే ఈ రోజు రేవంత్ రెడ్డి సీఎం కుర్చీలో ఉన్నారని, లేకపోతే ఆంధ్రాలో మోచేతి నీళ్లు తాగుతూ బతికేవాడివని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఉద్యమకారులపై తుపాకీ గురిపెట్టిన ద్రోహ చరిత్ర కాంగ్రెస్‌దేనని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి గెలిచే సత్తా లేకపోవడంతో బీఆర్ఎస్ అభ్యర్థులను బెదిరించి, ప్రలోభపెట్టి పార్టీలు మారుస్తున్నారని ఆరోపించారు. పోలీసులను అడ్డం పెట్టుకుని బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎవరు అమ్ముడుపోతున్నారో, ఎవరు ఎందుకు ఎత్తుకుపోతున్నారో అన్నీ గుర్తుపెట్టుకుంటామని, సమయం వచ్చినప్పుడు వడ్డీతో సహా చెల్లిస్తామని హెచ్చరించారు. మెదక్ జిల్లాకు కలెక్టర్ కార్యాలయం, ఎస్పీ కార్యాలయం, రైల్వే, నాలుగు లైన్ల రోడ్లు, సాగునీటి వసతులు అన్నీ కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే వచ్చాయని చెప్పారు. ఘనపూర్ ఆయకట్టుకు నీళ్లు ఇచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, సిద్దిపేటతో సమానంగా మెదక్‌ను అభివృద్ధి చేశామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత జిల్లాలో ఒక్క రూపాయి అభివృద్ధి జరగలేదని, మెదక్‌లో ఓట్లు అడిగే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదని తేల్చి చెప్పారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు భరోసా ఇచ్చిన హరీష్ రావు, ఏ కార్యకర్తకు ఇబ్బంది వచ్చినా మీకు మీ హరీష్ అన్న ఉన్నాడని, తాను చూసుకుంటానని ధైర్యం చెప్పారు. బీజేపీకి ఎనిమిది ఎంపీ సీట్లు ఇస్తే బడ్జెట్‌లో గుండు సున్నా ఇచ్చారని విమర్శించిన ఆయన, కారు గుర్తుకే ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మెదక్ అభివృద్ధిని కొనసాగించాలంటే బీఆర్ఎస్‌కే ఓటు వేయాలని హరీష్ రావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు తిరుపతిరెడ్డి, శశిధర్ రెడ్డి, బట్టి జగపతి, తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి నాయకులు లావణ్య రెడ్డి, దేవేందర్ రెడ్డి, మల్లికార్జున్ గౌడ్, సురేందర్ గౌడ్, జీవన్ రావు, పోటీ చేసే మున్సిపల్ అభ్యర్థులు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

ఎన్ఎస్పీ కాలువలకు పూర్తి స్థాయిలో మరమ్మతులు

మొదటిపేజీ తరువాయి

పూర్తి చేస్తామని ప్రగల్భాలు పలికారని, ప్రభుత్వం పూర్తి అయ్యే నాటికి పట్టుమని 5%కుడా పూర్తి చేయలేకపోయారని ఆయన దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాకా కృష్ణానదిపై 25,000 ఎకరాల ఆయకట్టుతో నెల్లికల్లు, 8,000 ఎకరాలతో బొత్తలపాలెం, 2,500 ఎకరాల ఆయకట్టుతో వీర్లపాలెంలతో పాటు దున్నపోతుల గండి, తోపుచర్ల, కేశావాపురం ఎత్తిపోతల పథకాల పనులన్నీ వేగవంతంగా కొనసాగుతున్నాయన్నారు. పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. నాగార్జున సాగర్ ఆయకట్టు పరిధిలోని మిర్యాలగూడలో 90% రైతాంగం వరి పంట మీద ఆధారపడి ఉంటారని, ఇక్కడ అదే స్థాయిలో వెలిసిన రైస్ మిల్లుల పరిశ్రమ ఆసియా ఖండంలోనే అతి పెద్దదని ఆయన చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా కృష్ణా బేసిన్ లో ధాన్యం సేద్యంతో పాటు దిగుబడి, కొనుగోలు పెద్దమొత్తంలో పెరిగిందని ఆయన చెప్పారు. వ్యవసాయం పట్ల, రైతాంగం పట్ల కాంగ్రెస్ పార్టీ అనుసరించిన విధానాలతోటే ఈ అద్భుతమైన ఫలితాలు రాబట్టామని వివరించారు.



తాడేపల్లి నుంచి గుంటూరుకు ప్రయాణం 9 గంటల పాటు సాగదీయడం జగన్‌దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం. ఇలా మీరు రోడ్లపైకి వచ్చి అల్లర్లు సృష్టించాలని చూడటం సరికాదు. ప్రజాసమస్యలపై చిత్తశుద్ధి ఉంటే రోడ్లపై డ్రామాలు ఆపి ఈ నెల 11 నుంచి అసెంబ్లీ సమావేశాలకు రావాలి. దమ్ముంటే సభలో చర్చిద్దాం. ఇకనైనా అల్లర్ల రాజకీయాలకు స్వస్తి పలకాలి.
- ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు

ఎవరికి నువ్వు జాతి పితవు?



మొదటిపేజీ తరువాయి

మీరే తీసుకున్నారు.తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మకు చిన్న పదవి కూడా ఇవ్వలేదు. తెలంగాణ కోసం సర్వం త్యాగం చేసిన ప్రొఫెసర్ జయశంకర్ జాతి పిత అవుతడు. ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టీ మొత్తం పోయినా తెలంగాణ ప్రజల ఆకాంక్షను నేరవేర్చిన సోనియమ్మ తెలంగాణ తల్లి అవుతుంది. తెలంగాణ ప్రజలకు మీరు క్షమాపణ చెప్పాలి.' అని సీఎం రేవంత్‌రెడ్డి నిప్పులు చెరిగారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో మోసం చేశారంటూ సీఎం రేవంత్ ఫైర్ అయ్యారు. ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారు కానీ.. పేదలను పట్టించుకోలేదంటూ బీఆర్ఎస్ నేతల వైఖరిని రేవంత్ ఎండగట్టారు. నియోజకవర్గానికి 3,500 చొప్పున.. రూ.22,500 కోట్లతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. బీఆర్ఎస్ హయాంలో ఎస్ఎల్‌బీసీని నిర్లక్ష్యం చేశారని, కానీ తాము ఈ ఎస్ఎల్‌బీసీ పనులను రెండేళ్లలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. మామ, అల్లుడు, బామ్మర్ది కలిసి నల్గొండ జిల్లాపై విషం చిమ్మారని, బీఆర్ఎస్ నేతలకు ఓటు అడిగే హక్కు లేదన్నారు. గంజికి గతిలేనోళ్లు కూడా బెంజి కార్లు కొన్నారంటూ సీఎం రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌కు పట్టం కట్టండి...

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఎదురు లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మహిళా శక్తి ఎదుట ఎవరూ నిలువలేరన్నారు. అన్ని వర్గాల కోసం కాంగ్రెస్ పార్టీ పని చేస్తోందని ఆయన పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని ఈ సందర్భంగా ప్రజలను కోరారు. గతంలో ఒక్క కొత్త రేషన్ కార్డయినా ఇచ్చారా? అంటూ గత ప్రభుత్వాన్ని రేవంత్ ప్రశ్నించారు. తమ ప్రభుత్వం లక్షలాది మందికి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసిందని గుర్తు చేశారు. 3.15 కోట్ల మందికి సన్నబియ్యం ఇస్తున్నామని చెప్పారు సీఎం రేవంత్ రెడ్డి. 50 లక్షల పేద కుటుంబాలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని వివరించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాతే వరికి రూ.500 బోనస్ ఇస్తున్నామని తెలిపారు. గతంలో వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అన్నారని ఈ సందర్భంగా సీఎం గుర్తు చేశారు. రైతులకు రూ.21వేల కోట్ల మేర రుణమాఫీ చేశామని సీఎం రేవంత్ వివరించారు.

ఆడబిడ్డలంతా ఓటు వేస్తే..

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని, ఆడబిడ్డలంతా కాంగ్రెస్‌కు ఓటు వేస్తే.. ప్రతిపక్షాలు బీఆర్ఎస్, బీజేపీలకు డిపాజిట్లు కూడా రావన్నారు. తమ ప్రభుత్వం చేసిన పనులు చూసి ఓటు వేయాలని కోరుతున్నామని విజ్ఞప్తి చేశారు. రెండేళ్లలో పేదలు, గిరిజనుల సంక్షేమం కోసం ఎంతో చేశామని చెప్పుకొచ్చారు. తెలంగాణలో 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎదురే లేదని తమ విజయాన్ని అడ్డుకోలేరని చెప్పారు. అభివృద్ధిని చూసి మున్సిపల్ ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలని ప్రజలను కోరారు. రేషన్ కార్డుల కోసం గతంలో పదేళ్లపాటు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండేదన్న ఆయన రాష్ట్రంలో 3.17 కోట్ల మందికి 6 కిలోల సన్నబియ్యం ఇస్తున్నామన్నారు. సన్న బియ్యం వచ్చిన వారు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయండని పిలుపునిచ్చారు. వరి ఉత్పత్తిలో మిర్యాలగూడ ఆసియాలోనే ముందు వరుసలో ఉందన్నారు. ఈ సదస్సులో మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ పాల్గొన్నారు.

త్యాగం చేసినోళ్లు జాతిపిత అవుతారు..

దోపిడీ చేసిన దొంగలు జాతిపిత ఎలా అవుతారు? అంటూ వారిని సీఎం రేవంత్ సూటిగా ప్రశ్నించారు. వెయ్యి ఎకరాల్లో ఫామ్‌హౌస్ నిర్మించుకున్న మీలాంటోళ్లని జాతిపిత అంటే ఆత్మహత్య చేసుకుని చావాలని అన్నారు. తెలంగాణ కోసం సర్వం త్యాగం చేసినోళ్లు జాతిపిత అవుతారని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. ఇప్పటికైనా చేసిన తప్పులు ఒప్పుకుని నేలకు ముక్కు రాయాలని అన్నారు. రెండేళ్లే పూర్తయ్యాయి.. మరో 8 ఏళ్లు తామే అధికారంలో ఉంటామని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. నిరంతర అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్‌నే గెలిపించాలని ప్రజలకు ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

కొత్త బడ్జెట్‌లో పేదలకు ఇళ్లు..

రాష్ట్రంలోని అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్న సీఎం రేవంత్‌నియోజకవర్గానికి 4.5 లక్షల ఇళ్లను పేదలకు అందిస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్‌లో పెట్టబోయే కొత్త బడ్జెట్‌లో లక్షలాది ఇళ్లు పేదలకు ఇస్తామన్నారు. రైతుభరోసా కింద రూ.6 వేల చొప్పున రూ.9 వేల కోట్లు ఇచ్చామని, రేవంత్ మున్సిపల్ ఎన్నికలు ముగిశాక ఈ దఫా నిధులు జమచేస్తామని వెల్లడించారు. దేశంలో అత్యధికంగా రైతుల కోసం రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు చేశామని, సంక్షేమ పథకాల అమలులో ఎక్కడా వివక్ష చూపలేదన్నారు. బీఆర్ఎస్ శ్రేణులకూ ఆర్టీసీ బస్సులో ప్రయాణం, సన్నబియ్యం ఇస్తున్నామని చెప్పారు.

కాంగ్రెస్ కార్యకర్తలు ధైర్యంగా ఉండండి..

కాంగ్రెస్ అభ్యర్థులు నామినేషన్లు వాపసు తీసుకోవాలని భాస్కర్‌రావు బెదిరిస్తున్నారన్న సీఎం కాంగ్రెస్ కార్యకర్తలు ఎవరికీ భయపడాల్సిన పనిలేదని చెప్పారు. భాస్కర్ రావును నమ్మి ఎమ్మెల్యేను చేస్తే నాగార్జునసాగర్ ఉపఎన్నికలో జానారెడ్డి ఓటమికి పనిచేశారని రేవంత్ విమర్శించారు. రాష్ట్రంలో అన్ని మున్సిపాలిటీలు కాంగ్రెస్ గెలిచి తీరాలని నాయకులకు సూచించారు. రూ.వేల కోట్లు తీసుకువచ్చి మున్సిపాలిటీలు అభివృద్ధి చేస్తామని, ఎన్నికల తర్వాత సాగర్, నందికొండలోని ఇళ్ల పట్టాల సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

బినామీ కంపెనీకి వేల కోట్లు

మొదటిపేజీ తరువాయి

ఇన్‌కమ్ టాక్స్ దాడులు చేసిందని, అప్పుడే పీసీసీ ప్రెసిడెంట్‌గా ఉన్న రేవంత్ రెడ్డికి ఈ కంపెనీకి ఉన్న సంబంధాల గురించి మీడియా బయటపెట్టిందన్నారు. అయితే రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిగా దివాళా తీసి ఎన్‌సీఎల్టీలో దివాళా ప్రక్రియ కేసు నడుస్తున్న ఈ కంపెనీకి అడ్డగోలుగా కాంట్రాక్టులు కట్టబెట్టే ప్రయత్నాన్ని రేవంత్ రెడ్డి భుజాల మీదకు ఎత్తుకున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఈ కంపెనీపై 2018 సెప్టెంబర్ 27న రేవంత్ రెడ్డి బంధువుల పైన ఐటీ రైడ్స్ జరిగినాయి. సాయి మౌర్య ఎస్టేట్స్ అనే కంపెనీ మరియు కేఎల్ఎస్ఆర్ కంపెనీ మధ్య నిధులు చేతులు మారిన విషయాన్ని, టాక్స్ ఎగవేతలను ఈ దాడుల సందర్భంగా గుర్తించారు. భూపాల్ ఇన్ఫ్రా, సాయి మౌర్య కంపెనీల డబ్బులు ఖాతాల్లోకి వచ్చాయని కేటీఆర్ చెప్పారు. ఈ రెండు కంపెనీలు రేవంత్ రెడ్డి బంధువుల కంపెనీలని కేటీఆర్ తెలిపారు. అయితే కేఎల్ఎస్ఆర్ ఇన్ఫ్రా అనే కంపెనీ ఒక బినామీ కంపెనీ అని అందరికీ తెలుసు అన్నారు. 23 జూలై 2023న కేఎల్ఎస్ఆర్ కంపెనీ, ఏఎస్ఎంఈటీ అనే కంపెనీ మధ్య గొడవ జరిగిందని, వారిద్దరూ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌ను అప్రోచ్ అయ్యారని, ఆ తర్వాత కేసు నడుస్తున్నదని కేటీఆర్‌తెలిపారు. అయితే ఎన్‌సీఎల్టీ లో జరుగుతున్న ఈ కేసు విషయంలో ఒక ఉన్నత న్యాయస్థానానికి చెందిన జడ్జి ద్వారా జస్టిస్ శరత్ కుమార్ పైన ఒత్తిడి తీసుకురావడానికి ప్రయత్నం చేస్తే, ఆయన ఆ విషయాన్ని బయటపెట్టి ఆ కేసు నుంచి తప్పుకున్నారని కేటీఆర్ తెలిపారు. కేఎల్ఎస్ఆర్ కంపెనీలో రేవంత్ రెడ్డి అనేక పెట్టుబడులు పెట్టాడని, అందుకే రేవంత్ రెడ్డి బావమరిదికి సంబంధించిన సాయి మౌర్య అనే కంపెనీతో లావాదేవీలు నడిపిందన్నారు. కేఎల్ఎస్ఆర్ కంపెనీ ద్వారా సాయి మౌర్య కంపెనీలోకి డబ్బులు పంపి దాని నుంచి భారీగా భూములు కొనుగోలు చేసే పని చేసిందని కేటీఆర్ తెలిపారు. ఇంత దుర్మార్గమైన, నీచమైన చరిత్ర ఉన్న కేఎల్ఎస్ఆర్ కంపెనీకి రేవంత్ రెడ్డి హయాంలో 6,000 కోట్ల రూపాయల ప్రాజెక్టులు వచ్చాయని కేటీఆర్‌తెలిపారు. అమృత్ స్కీమ్, జల్ జీవన్ మిషన్, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్, తెలంగాణ సాగునీటి ప్రాజెక్ట్ పనులు, రహదారుల పనులు అన్నీ కలిపి సుమారు 6,000 కోట్ల రూపాయల కాంట్రాక్ట్ వర్కులను ఈ కేఎల్ఎస్ఆర్ కంపెనీ ఎలా పొందిందో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలన్నారు. అయితే 2023 నుంచే దివాళా తీసిన కంపెనీకి 2024-26 సంవత్సరాల్లో ఏ విధంగా తెలంగాణ ప్రభుత్వం కాంట్రాక్టులు ఇచ్చిందన్న విషయాన్ని స్పష్టం చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి బ్యాంకుల నుంచి అప్పులు తీసుకున్న కంపెనీ కాంట్రాక్టులకు సంబంధించిన వందల కోట్ల బ్యాంక్ గ్యారంటీలను ఏ విధంగా సబ్మిట్ చేస్తుంది అన్న విషయాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించిందని, ఆ మేరకు జడ్జిని ప్రభావితం చేసే అంశంతో పాటు ఈ కేఎల్ఎస్ఆర్ కంపెనీలోకి వచ్చిన వందల కోట్ల రూపాయల నిధుల విషయం పైన విచారణ జరపాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశించిందని కేటీఆర్ తెలిపారు.

ప్రజల దృష్టి మళ్లించడానికే నోటీసులు

అందులోనే భాగంగానే సీబీఐ, సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆర్గనైజేషన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ద్వారా విచారణ జరిపించాలని కేంద్రాన్ని కోరుతూ నోటీసు కూడా ఇచ్చిందని కేటీఆర్ తెలిపారు. అయితే ఈ నోటీసుల నుంచి ప్రజల దృష్టి మళ్లించడం కోసమే తనతో పాటు పార్టీ నేతలు హరీష్ రావు, సంతోష్ రావు, పార్టీ అధినేత కేసీఆర్ లకు టెలిఫోన్ ట్యాపింగ్ సిట్ నోటీసుల పేరిట డ్రామాలు ఆడారని అన్నారు. వెంటనే సుప్రీంకోర్టు ఆదేశించినట్లు రాష్ట్రంలో సీబీఐ తో ఈ అంశంలో ఎంక్వయిరీ నిష్పాక్షికంగా జరిపించాల్సిన అవసరం ఉందని కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అప్పటిదాకా రాష్ట్రాన్నికి రాష్ట్రంలో ఇచ్చిన ప్రతి కాంట్రాక్టును రద్దు చేయాలని, ప్రస్తుతం కొనసాగుతున్న కాంట్రాక్ట్ పనులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. దీంతోపాటు సుప్రీంకోర్టు విచారణ పూర్తి అయ్యేదాకా ఈ కంపెనీని బ్లాక్ లిస్టులో పెట్టి నూతన కాంట్రాక్టుల్లో పాల్గొనకుండా బ్లాక్ లిస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మొత్తం వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం చొరవ చూపి వెంటనే సిబిఐ, ఈడీ ద్వారా విచారణ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ మొత్తం వ్యవహారంలో కిషన్ రెడ్డి స్పందించి కేంద్రం పైన ఒత్తిడి తీసుకువచ్చి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కిషన్ రెడ్డి, బీజేపీ రేవంత్ రెడ్డిని కాపాడుతున్న మాట నిజం కాకపోతే ఈ విషయంలో తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.

స్పీకర్ తీరు రాజ్యాంగానికి గొడ్డలిపెట్టు: కేటీఆర్

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్లను స్పీకర్ వరుసగా తిరస్కరిస్తుండటం రాజ్యాంగానికే గొడ్డలిపెట్టుగా మారిందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి స్వయంగా జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్‌కు కండువా కప్పి కాంగ్రెస్‌లో చేర్చుకున్న ఫోటోలు, వీడియోలు అందరికీ కనిపిస్తున్నా 'ఆధారాలు లేవు' అంటూ అనర్హత పిటిషన్‌ను కొట్టివేయడం అర్థరహితమని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పులను, ప్రజాతీర్పును కాలరాస్తూ గోడదూకిన ఎమ్మెల్యేలపై రాజ్యాంగబద్ధమైన చర్యలు తీసుకోకుండా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు స్పీకర్ వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని మండిపడ్డారు. జగిత్యాలలో మున్సిపల్ ఎన్నికల వేళ అసలు కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డి స్వయంగా పార్టీపై తీవ్ర విమర్శలు చేస్తున్న సమయంలోనే ఫిరాయింపు ఎమ్మెల్యేకు క్లీన్ చిట్ ఇవ్వడం స్పీకర్ పదవిగౌరవాన్ని తీవ్రంగా దెబ్బతీసిందని కేటీఆర్ పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లోనూ ముఖ్యమంత్రి వైఫల్యాలు, మోసాలపై పట్టణ ప్రజల్లో వెల్లువెత్తుతున్న ఆగ్రహాన్ని చూసి రేవంత్ సర్కారు వణికిపోతోందని వ్యాఖ్యానించారు. ఫిరాయింపుల ద్వారా వచ్చే మూటలకు ఆశపడి మౌనం వహిస్తున్న రాహుల్ గాంధీకి ఇకపై రాజ్యాంగాన్ని పట్టుకుని తిరిగే నైతిక హక్కు లేదని అన్నారు.

పెద్దపల్లి నుంచి అసెంబ్లీ బరిలోకి కవిత?

మొదటిపేజీ తరువాయి

కవితపై, మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయాలనే ఒత్తిడి కార్యకర్తల నుంచి పెరుగుతోంది. ఈ క్రమంలో కార్యకర్తల ఆకాంక్ష మేరకు కవిత ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్‌తో జతకట్టి, ఎన్నికల్లో పోటీ చేయదలచిన తన అనుచరులకు రాష్ట్రవ్యాప్తంగా ఫార్వర్డ్ బ్లాక్ బీ-ఫారమ్‌లు ఇప్పిస్తున్నట్లు సమాచారం. అయితే రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే పెద్దపల్లి, సుల్తానాబాద్, రామగుండం ప్రాంతాల నుంచి ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థులు పెద్ద సంఖ్యలో బరిలోకి దిగేందుకు సిద్ధమవుతుండడం రాజకీయ వర్గాల్లో అనేక అనుమానాలకు తావిస్తోంది. అసలు పార్టీ అధికారికంగా ప్రకటించక ముందే, ఈ ప్రాంతంలోనే ఇంతమంది అభ్యర్థులు ఎందుకు సిద్ధమవుతున్నారు? అనే ప్రశ్న తెరపైకి వచ్చింది. దీనికి సమాధానం కవిత పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచే రాబోయే ఎన్నికల్లో పోటీ చేయనున్నారా? అన్న ఊహాగానాల రూపంలో వినిపిస్తోంది. ఈ ప్రశ్నకు రాజకీయ వర్గాల నుంచి అవుననే సమాధానాలే ఎక్కువగా వస్తుండడం విశేషం. పెద్దపల్లి నియోజకవర్గం భౌగోళికంగా గోదావరి, మానేరు నదుల పరివాహ ప్రాంతంగా ఉండడం, విస్తారమైన వ్యవసాయ భూములు, సింగరేణి బొగ్గు గనులు, ఎన్‌టీపీసీ వంటి పరిశ్రమలు ఉండడం ఈ ప్రాంతానికి ప్రత్యేకత. అంతేకాదు, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న పెద్దపల్లి-నిజామాబాద్ రైల్వే లైన్ పనులు కవిత నిజామాబాద్ ఎంపీగా ఎన్నికైన తర్వాత కేవలం మూడేళ్లలోనే కేంద్రంతో పోరాడి కోట్ల రూపాయల నిధులు తెచ్చి పూర్తి చేయించారన్నది స్థానిక ప్రజల్లో ఇప్పటికీ గుర్తుండిపోయిన అంశం. ఈ అభివృద్ధి ఆమెకు పెద్దపల్లిలో రాజకీయ బలం చేకూర్చిందన్న అభిప్రాయం బలంగా ఉంది. బీఆర్ఎస్‌లో ఉన్న సమయంలో తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షురాలిగా కవిత వ్యవహరించగా, అనంతరం ఆమెను ఆ పదవి నుంచి తొలగించడం, ఆపై పార్టీ నుంచి సస్పెండ్ చేయడం వేగంగా జరిగిపోయిన విషయం తెలిసిందే. ఈ పరిణామాల నేపథ్యంలోనే కవిత కొత్త పార్టీ ఏర్పాటుకు పూనుకున్నారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అయితే ఆమె పోటీ చేసే నియోజకవర్గం ఏదన్న దానిపై స్పష్టత లేకపోయినా, బోధన్, సిద్ధిపేట, మంచిర్యాల వంటి పేర్లతో పాటు పెద్దపల్లి పేరు బలంగా వినిపిస్తోంది. కేసీఆర్ గతంలో కామారెడ్డి నుంచి పోటీ చేసిన సందర్భంలో పెద్దపల్లి నుంచి పోటీ చేయాలనే డిమాండ్ వచ్చినప్పటికీ, దానిని పక్కనపెట్టి కామారెడ్డిని ఎంచుకోవడం, అక్కడ మాస్టర్ ప్లాన్ అంశంపై రైతుల వ్యతిరేకత ఎదురవడం, చివరకు ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సి రావడం వంటి పరిణామాలు రాజకీయంగా పెద్ద చర్చకు దారి తీశాయి. అప్పుడు కేసీఆర్ పెద్దపల్లి నుంచి పోటీ చేసి ఉంటే తప్పక గెలిచేవారని అప్పట్లోనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్రంతో, రాష్ట్రంతో పోరాడే సత్తా, పరిపాలనా అనుభవం, రాజకీయ చతురత కలిగిన డైనమిక్ నాయకురాలిగా పేరున్న కవిత పెద్దపల్లి నుంచి బరిలోకి దిగితే నియోజకవర్గానికి ఎంతో మేలు జరుగుతుందని ఆమె అనుచరులు బలంగా వాదిస్తున్నారు. కవిత పెద్దపల్లి నుంచే పోటీ చేస్తారా? అన్న ప్రశ్నకు సమాధానం రానున్న రోజుల్లో స్పష్టమయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం మాత్రం ఈ నియోజకవర్గం రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

రాష్ట్రీయం

నా కాంగ్రెస్ పార్టీలో చిచ్చు పెట్టకు

- నీ బీఆర్ఎస్ పార్టీలో నువ్వు కరెక్ట్‌గా ఉండు
- ఎమ్మెల్యే సంజయ్‌కి మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కౌంటర్



ప్రతిపక్షం, జగిత్యాల, ఫిబ్రవరి 4: జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ఎమ్మెల్యే సంజయ్ అనర్హత పిటిషన్‌పై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు జీవన్ రెడ్డి వెల్లడించారు. బుధవారం జీవన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. 'ఎమ్మెల్యే సంజయ్ అనర్హత పిటిషన్‌పై శాసనసభ స్పీకర్ ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నా. బీఆర్ఎస్ పార్టీలో ఉన్నా అని సంజయ్ చెప్పడాన్ని స్వాగతిస్తున్నా. సంజయ్ నీకు దొంగ బుద్ధి ఎందుకు?. స్పీకర్ తీర్పుతో పద్ధతిగా ఉండు. నా కాంగ్రెస్ పార్టీలో చిచ్చు పెట్టకు. నీ బీఆర్ఎస్ పార్టీలో నువ్వు కరెక్ట్‌గా ఉండు. నా పార్టీ అంతర్గత విషయాల్లో ఎందుకు వేలు పెడుతున్నావు?. అభివృద్ధి అంటే పక్కింట్లోకి కన్ను వేయడమా?. గడిచిన రెండు ఏళ్లలో సీఎం రేవంత్‌తో ఉండి నువ్వు చేసిన అభివృద్ధి ఏంటీ చెప్పు.. సంజయ్?' అని మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రశ్నించారు. మరోవైపు ఏడాదిన్నర కాలంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మధ్య విభేదాలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన సంజయ్‌కు పార్టీలో ప్రాధాన్యం ఇవ్వడంపై జీవన్ రెడ్డి గతంలోనూ ఘాటుగా విమర్శించారు. తాజాగా మున్సిపల్ ఎన్నికల వేళ టికెట్ల అంశంతో ఆ విభేదాలు మరింత ముదిరినట్టు తెలుస్తోంది. జగిత్యాల మున్సిపాలిటీలో మొత్తం 50 వార్డులు ఉండగా.. 29 టికెట్లు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గానికి, 21 టికెట్లు జీవన్ రెడ్డి వర్గానికి పార్టీ అధిష్ఠానం కేటాయించినట్లు సమాచారం. ఈ అంశం జీవన్ రెడ్డి వర్గంలో మరింత అసంతృప్తిని పెంచిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



ఘనంగా వన దేవతల తిరుగువారం పండుగ

- అమ్మవార్లను దర్శించుకున్న 5 లక్షల మంది భక్తులు
- 5 వేల మంది కార్మికులతో నిరంతరం పారిశుధ్య పనులు
- రాష్ట్ర మంత్రి అనసూయ సీతక్క

ప్రతిపక్షం, ములుగు, ఫిబ్రవరి4 : సమ్మక్క సారలమ్మ జాతర తిరుగువారం పండగ సందర్భంగా రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ లతో కలిసి బుధవారం అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మంత్రి సీతక్క జిల్లా కలెక్టర్ ఎస్పీ లతో కలిసి జాతర చుట్టూ పరిసర ప్రాంతాలను పరిశీలించి, నిరంతరం పారిశుధ్య పనులు చేపట్టాలని స్వచ్ఛమైన మేడారం గ్రామాన్ని గ్రామస్తులకు అందించే విధంగా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ బుధవారం మేడారం జాతర తిరువారం పండుగ ఘన నిర్వహించుకోవడం జరిగిందని సుమారు 5 లక్షల మంది భక్తులు వనదేవతలను దర్శించుకున్నారని తెలిపారు. ప్రధాన జాతర ముగిసిన అనంతరం కూడా భక్తుల రద్దీ కొనసాగుతున్న నేపథ్యం లో వారందరికీ ఎటువంటి ఇబ్బంది లేకుండా తాగునీరు, శానిటేషన్ గానీ రవాణా సౌకర్యం ఎటువంటి లోపం లేకుండా చర్యలు తీసుకున్నామని అన్నారు. 2026 మేడారం మహా జాతరకు సుమారు రెండు కోట్ల మందికి పైగా భక్తులు వచ్చారని ఇంకా వారం రోజులపాటు భక్తుల రద్దీ కొనసాగుతుందని పేర్కొన్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి, డీఎస్పీ, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల కులాల సేకరణలో జాప్యం వద్దు

- చదువుకు దూరంగా ఉంటున్న కులాలను ప్రోత్సహిద్దాం
- బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 4: ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుకుంటున్న విద్యార్థుల కులాల సేకరణలో ఎలాంటి జాప్యం ఉండకూడదని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ అధికారులను ఆదేశించారు. చదువుకు దూరంగా ఉన్న కులాలను గుర్తించి విద్యకు ప్రోత్సహిద్దామన్నారు. బుధవారం సమావేశమైన బీసీ కమిషన్ చైర్మన్, అధికారులు రాష్ట్రంలో విద్యార్థుల డేటా సేకరించడంలో తీవ్రమైన జాప్యం జరుగుతున్నందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం యొక్క ప్రాధాన్యతను గుర్తించి, సమాచారం సేకరించి, కమిషన్‌కు అందించాలని కోరారు. ఈ సమాచారం ఆధారంగా బీసీ విద్యార్థుల్లో ఏ కులానికి, ఏ వర్గానికి చెందినవారు విద్యకు దూరంగా ఉంటున్నారో గుర్తించి, వారిని ప్రోత్సహించే అవకాశం కలుగుతుందని వివరించి చెప్పడం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన అధికారులందరు వెంటనే ఈ సమాచారాన్ని సేకరించి కార్యక్రమానికి స్వీకారం చుడతారని, ఈ సంవత్సరం మార్చి లోపల వివరాలు అందిస్తామని చెప్పడం జరిగింది. సెక్రెటరి, స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ మాట్లాడుతూ ఈ సంవత్సరం నుండే అడ్మిషన్స్‌లోనూ రాబోయే విద్యా సంవత్సరం నుండి జరిగే ప్రవేశ పరిక్షలోను కుల సంబంధిత సమాచారాన్ని కూడా సేకరించబోతున్నామని స్పష్టం ఆయన స్పష్టం చేశారు.

ఆలయాలు, స్కూళ్లు, ఆస్పత్రుల దగ్గర

మాంసం విక్రయాలకు బ్రేక్!

- విధానాన్ని రూపొందించండి
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు సూచన

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 4: ఆలయాలు, విద్యా సంస్థలు, ఆస్పత్రుల నుంచి 100 మీటర్ల పరిధిలో మాంసం, నాన్‌వెజ్ ఆహార పదార్థాల విక్రయాన్ని నియంత్రించే విధానాన్ని రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు సూచించింది. భక్తుల మనోభావాలు, ప్రశాంతత, పరిశుభ్రత, శాంతిభద్రతలు, ట్రాఫిక్ సమస్యలను పరిగణనలోకి తీసుకొని స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలని మున్సిపల్, హోంశాఖ ముఖ్య కార్యదర్శులను ఆదేశించింది. మాంసం విక్రయ కేంద్రాల ప్రారంభానికి సంబంధిత పోలీస్ స్టేషన్ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) పొందే నిబంధనను విధానంలో చేర్చాలని హైకోర్టు సూచించింది. ఈ ప్రక్రియను నాలుగు వారాల్లో పూర్తి చేయాలని స్పష్టం చేసింది. హైదరాబాద్ రెడ్‌హిల్స్ ప్రాంతంలో తన మాంసం వ్యాపారాన్ని జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోన్ డిప్యూటీ కమిషనర్, నాంపల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ మహారాష్ట్రకు చెందిన బిపిన్ రాందాస్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బీ విజయ్ సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు.



మున్సిపల్ ప్రచారానికి పవన్ కల్యాణ్

- బీజేపీకి మద్దతు ప్రకటించిన జనసేనాని
- ఈనెల 7, 8 తేదీల్లో ప్రచారానికి ఏర్పాట్లు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 4 : తెలంగాణ పురపాలక ఎన్నికల్లో జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రచారం నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 7,9 తేదీల్లో బీజేపీ అభ్యర్థుల తరఫున మున్సిపాలిటీల్లో ప్రచారం చేసేందుకు ఆయన తెలంగాణ రానున్నారు. ఈ విషయాన్ని జనసేన కేంద్ర కార్యాలయం అధికారికంగా వెల్లడించింది. ఎన్నికల ప్రచారానికి సంబంధించిన రూట్‌మ్యాప్‌ను త్వరలో ప్రకటించనున్నారు. ఈ క్రమంలోనే ఏపీ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను తెలంగాణ బీజేపీ నేతలు కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సందర్భంగా వారి మధ్య పలు అంశాలు చర్చకు వచ్చినట్లుగా తెలిసింది.



ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధి మీడియా

- శాసనమండలి చైర్మన్‌గుత్తా

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 4: ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారాధి మీడియా ప్రతినిధులని, నిత్యం ప్రజల్లో ఉంటూ, సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడంలో జర్నలిస్టుల పాత్ర గొప్పదని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. తెలంగాణ మీడియా అకాడమీ కార్యాలయంలో, మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రముఖ పాత్రికేయుల చిరుపుస్తక (మోనోగ్రాఫ్) ఆవిష్కరణ , ఇటీవల మరణించిన ప్రముఖ పాత్రికేయుల కుటుంబాలకు లక్ష రూపాయల చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , అతిథిగా కె. కేశవరావు హాజరయ్యారు. ప్రముఖ జర్నలిస్టుల చిరుపుస్తకాల (మోనోగ్రాఫ్స్) పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. అలాగే మృతి చెందిన జర్నలిస్ట్ కుటుంబ సభ్యులకు లక్ష రూపాయల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అన్ని వ్యవస్థలో మార్పులు వచ్చిన విధంగా మీడియా వ్యవస్థలో చాలా మార్పు వచ్చిందని తెలిపారు. యూట్యూబ్, డిడిటల్ మీడియా సంస్థలు ఎక్కువగా పెరగడం వలన మంచి కన్నా, చేదు ఎక్కువగా దుష్ప్రచారం జరుగుతుందని ఆయన చెప్పారు. కొందరు నాయకులు, కొన్ని మీడియా సంస్థల్లో పని చేసేవారి బాష సరిగ్గాలేదని, వారిని కంట్రోల్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. భావి తరాలకు మంచి భవిష్యత్తు కల్పించే విధంగా జర్నలిస్టులు పని చేయాలని ఆయన ఆకాంక్షించారు.




రోడ్డు ప్రమాదంలో చిట్యాల నరసింహులు మృతి

- ఎమ్మార్పీఎస్ నేతల నివాళులు

ప్రతిపక్షం, సిద్దిపేట, ఫిబ్రవరి 4: నిరుపేద విద్యార్థుల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేసిన తెలంగాణ రెసిడెన్షియల్ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్యాల నరసింహులు (దుద్దెడ) మంగళవారం సాయంత్రం ప్రజ్ఞాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. బుధవారం వారి స్వగ్రామంలో నరసింహులు పార్థివ దేహానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నేత లింగంపల్లి శ్రీనివాస్ మాదిగ, నాయకులు ముక్కపల్లి రాజు, మల్లిగారి యాదగిరి, పెరిక పరశురాములు, ఎర్ర మహేందర్, సుంచు రమేష్, దబ్బెట శ్రీనివాస్, బయ్యారం యాదగిరి, నరేష్ తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ఎమ్మార్పీఎస్ , బిజెఆర్ సిద్దిపేట జిల్లా కమిటీ పక్షాన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆత్మీయ మిత్రుడు, సామాజిక ఉద్యమాల పట్ల నిబద్ధత కలిగి, సామాజిక సేవల ద్వారా ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని, ఆయన మృతి ఉద్యమాలకు తీరని లోటని ఈ సందర్భంగా నేతలు పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

- ప్రభుత్వ చీఫ్ విఫ్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి

ప్రతిపక్షం, మొయినాబాద్, ఫిబ్రవరి 4 : కాంగ్రెస్ పార్టీతో అభివృద్ధి సాధ్యమని ప్రభుత్వ చీఫ్ విఫ్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని నాగిరెడ్డిగూడలో మున్సిపల్ అభ్యర్థులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్నం మహేందర్ రెడ్డితో పాటు ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి, నియోజకవర్గం ఇంచార్జీ పామెన భీం భరత్ లు హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. నాయకులు, కార్యకర్తలు ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరంగా వివరించి గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దేవరంపల్లి మహేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కంజర్ల ప్రకాష్,అవురాం విక్రమ్ రెడ్డి, సురంగల్ జైపాల్ రెడ్డి, తూర్పు అమరేందర్ రెడ్డి, సురంల్ రాజు, ప్రియాంక రమేష్, కనగల శోభా రాజు, మైనారిటీ నాయకులు వజీర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొలం వద్ద మహిళా న్యాయవాది హత్య

- కుటుంబ కలహాలతో కత్తితో దాడి చేసిన సోదరుడు



ప్రతిపక్షం,మొయినాబాద్, ఫిబ్రవరి 4 : మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లి గ్రామంలో బుధవారం ఉదయం దారుణ హత్య చోటు చేసుకుంది. ఆస్తి పంపకాల్లో వివాదం కారణంగా లాయర్ స్వప్నను ఆమె సోదరుడు రాజు అతి కిరాతకంగా హత్య చేశాడు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. స్వప్న, ఆమె సోదరుడు రాజుకు మధ్య గత కొన్ని రోజులుగా భూ వివాదం తీవ్రంగా నడుస్తోందని పేర్కొన్నారు. 10 ఎకరాల భూమిని వారి తల్లి ఇద్దరికీ పంచిందని.. రాజుకు 6 ఎకరాలు.. స్వప్నకు 4 ఎకరాలు రాసి ఇచ్చినట్లు తెలిపారు. కానీ స్వప్నకు 4 ఎకరాలు ఇవ్వడం ఇష్టం లేని రాజు.. ఇటీవలి కాలంలో పదే పదే గొడవలకు దిగుతున్నాడు.ఇలాంటి పరిస్థితుల్లోనే తన సోదరుడు రాజుపై.. లాయర్ స్వప్న ఇప్పటికే రెండు సివిల్ కేసులను కూడా ఫైల్ చేసింది. ఈ కేసులో ప్రస్తుతం కోర్టు విచారణలో ఉన్నాయి. ఈ క్రమంలోనే తనకు తన తల్లి రాసిచ్చిన 4 ఎకరాల భూమిలో సర్వే పనులు చేయించేందుకు శనివారం ఉదయం స్వప్న అక్కడికి వెళ్లింది. ఇక అందులో ఒక ఎకరం భూమిని విక్రయించేందుకు ప్రయత్నాలు చేస్తున్న విషయం రాజుకు తెలిసింది. ఈ నేపథ్యంలోనే అక్కడికి చేరుకున్న రాజుకు, స్వప్నకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఇది తీవ్ర ఘర్షణకు దారితీయగా.. స్వప్నపై రాజు దాడి చేశాడు. తన వెంట తెచ్చుకున్న కత్తితో స్వప్నపై విచక్షణ రహితంగా దాడి చేశాడు. అంతటితో ఆగకుండా.. బండ రాయిని తీసుకొచ్చి ఆమెను కొట్టి అత్యంత దారుణంగా చంపినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ ఘటనపై స్పందించిన చేవెళ్ల డీసీపీ యోగేష్ గౌతం.. ఆస్తి వివాదం కారణంగానే హత్య చేసినట్లు తెలిపారు. రాజుతోపాటు.. అతడి డ్రైవర్ గణేష్ సహా మరో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నట్లు వెల్లడించారు. ఇక ఈ హత్య కేసు దర్యాప్తు కోసం 4 స్పెషల్ పోలీస్ టీమ్‌లను ఏర్పాటు చేశామని.. పరారీలో ఉన్న ఇంకో వ్యక్తిని త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. లాయర్ స్వప్నకు ఇంకా వివాహం జరగలేదని తెలిపారు. ఈ ఘటనపై స్పందించిన బాధితురాలి తల్లి వెంకటమ్మ.. తన కుమార్తెను చంపిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గత 3 ఏళ్లుగా స్వప్నను చంపేందుకు.. రాజు ప్లాన్ చేస్తున్నాడని పేర్కొన్నారు. ఇప్పటికే రెండుసార్లు హత్య చేసేందుకు ప్రయత్నం చేశాడని తెలిపారు..

ఫిలిం ఇండస్ట్రీకి కేంద్రంగా హైదరాబాద్

- ఆ ఆలోచనతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తుంది
- సమాజం కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహానుభావుడు గద్దర్
- గద్దర్ అవార్డుల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు
- గద్దర్ ఫిలీం అవార్డుల జ్యూరీ సభ్యుల సమావేశం



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 4: తెలుగు సినీ పరిశ్రమకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుంది, దేశ వ్యాప్తంగా ఫిలిం ఇండస్ట్రీకి హైదరాబాదును కేంద్రంగా చేయాలన్న ఆలోచనతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తుంది అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం సెక్రటేరియట్లో గద్దర్ సినిమా అవార్డుల జ్యూరీ సభ్యుల సమావేశంలో మాట్లాడారు. బాంబే, కలకత్తా, చెన్నై వంటి పట్టణాల్లో సినీ ఇండస్ట్రీ పెరగడానికి అంతగా అవకాశాలు లేవు కానీ దేశంలో ఉన్న అన్ని భాషల ఇండస్ట్రీ హైదరాబాద్ లో విస్తరించడానికి సానుకూల అంశాలు అనేకంగా ఉన్నాయని డిప్యూటీ సీఎం తెలిపారు. సకల భాషల సినీ ఇండస్ట్రీ, హైదరాబాద్ కు తరలి వస్తే రాష్ట్ర యువతకు, టెక్నీషియన్లు, రైటర్లు, డైరెక్టర్లకు ఉపాధి లభిస్తుంది. సినీ ప్రపంచ మార్కెట్ కు హైదరాబాద్ కేంద్రంగా మారుతుందని తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్లూ ప్రింట్ ప్రభుత్వం తయారు చేస్తుందని అన్నారు. గత ప్రభుత్వం కొన్ని దశాబ్ద కాలం పాటు సినిమా రంగానికి సంబంధించిన అవార్డుల విషయంలో నిర్లక్ష్యం వహించి వదిలేస్తే సమాజంలో అత్యంత ప్రభావం చూపే సామాజిక పరివర్తన తీసుకొచ్చే సినీ రంగాన్ని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అవార్డులు ఇచ్చి తిరిగి ప్రోత్సహించడం ప్రారంభించింది అని వివరించారు. సమాజం కోసం కళల ద్వారా తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప మహానుభావుడు గద్దర్ అని డిప్యూటీ సీఎం తెలిపారు. తెలంగాణ అంటే కళలు, విప్లవం, ప్రశ్నించడం, సున్నిత మనసుతో, ప్రేమానురాగాలతో కూడినదని, తెలంగాణ కళలు, సంస్కృతిని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి గద్దర్ అని తెలిపారు. అందుకే వారి పేరు మీద గత సంవత్సరం నుండి సినిమా అవార్డులు ఇవ్వడం ప్రారంభించి సినీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ప్రతిభ, పారదర్శకత లే ప్రమాణంగా సినిమా అవార్డుల ఎంపిక ఉంటుందని, గత సంవత్సరం జ్యూరీ సభ్యులు అవార్డుల ఎంపికను గొప్పగా నిర్వహించి అభినందనలు పొందిన విషయాన్ని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. సినీ రంగ ప్రముఖులకు ఉన్న అనుభవాన్ని, నిబద్ధతను, సినిమా రంగం పట్ల వారికున్న అభిమానాన్ని దృష్టిలో పెట్టుకొని ఎఫ్ డి సి ద్వారా అందరితో సంప్రదింపులు జరిపి జ్యూరీ సభ్యులుగా ఎంపిక చేశారని ప్రభుత్వ నుంచి కావలసిన సహకారాన్ని పూర్తిస్థాయిలో అందజేస్తామని తెలిపారు. ప్రతి పని సమాజానికి ఉపయోగపడాలి, ప్రజలకు జవాబుదారిగా ఉండాలన్న లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. గద్దర్ అవార్డుకు ఎంపిక చేసే సినిమాలో కమర్షియల్ అంశంతో పాటు సామాజిక సందేశం తప్పనిసరిగా ఉండేలా జాగ్రత్త తీసుకుంటే రాబోయే రోజుల్లో సమాజంలో మంచి సినిమాలను ప్రోత్సహించేందుకు అవకాశం ఉంటుందని డిప్యూటీ సీఎం తెలిపారు.

ఈనెల 6 నుంచి గద్దర్ సినిమా అవార్డుల స్క్రీనింగ్ కార్యక్రమం ప్రారంభమవుతుంది 19న ఉగాది పండుగ రోజు గద్దర్ అవార్డుల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుందని తెలిపారు. గద్దర్ అవార్డుల పంపిణీ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా, ప్రపంచవ్యాప్తంగా ఓ గొప్ప సందేశం ఇచ్చేలా గత సంవత్సరం నిర్వహించాం, ఈ సంవత్సరం కూడా అదే రీతిలో పెద్ద ఎత్తున గద్దర్ అవార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించేందుకు ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్, ఐపీఆర్‌శాఖలకు పూర్తి స్వాతంత్రం, అవసరమైన సహాయం రాష్ట్రప్రభుత్వం అందిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు, ఐపీఆర్‌కమిషనర్ ప్రియాంక, ఎఫ్డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిషోర్ బాబుతో పాటు సినీ ప్రముఖులు తనికెళ్ల భరణి, కేఎస్‌రామారావు, రోజా రమణి, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించి రూ.18వేల కోట్లు బకాయి పెట్టింది. వైసీపీ విధ్వంసంతో ఇరిగేషన్ శాఖ గాడి తప్పింది. పోలవరం, హంద్రీనీవా, వెలిగొండ, గాలేరునగరి, పోలవరం ఎడమ ప్రధాన కాలువ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ఖరీఫ్ ముగిసినా రిజర్వాయర్లలో నీరుందంటే చంద్రబాబు వాటర్ మేనేజ్‌మెంట్ వల్లే.
- ఏపీ మంత్రి రామానాయుడు

ఓపెన్ వాయిస్

అంతర్జాతీయ మార్కెట్‌లో భారత్ పైచేయి

భారత ఆర్థిక వ్యవస్థ అంతర్జాతీయ స్థాయిలో ఒక నూతన శకాన్ని ఆరంభించింది. ప్రపంచవ్యాప్తంగా అగ్రగామి దేశాలతో వరుసగా కుదుర్చుకుంటున్న వాణిజ్య ఒప్పందాలతో భారత్ తన ఆర్థిక వ్యూహాన్ని పూర్తిగా మార్చేస్తోంది. ముఖ్యంగా అమెరికాతో కుదిరిన తాజా చారిత్రక వాణిజ్య ఒప్పందం భారత్ ఆర్థిక చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోనుంది. ప్రపంచ స్థూల దేశీయ ఉత్పత్తిలో సగానికి పైగా వాటా కలిగిన దేశాలతో భారత్ ప్రస్తుతం వాణిజ్య బంధాలను కలిగి ఉండటం ఇక్కడ గుర్తించాల్సిన విషయం. కేవలం కొన్ని రోజుల వ్యవధిలోనే రెండు కీలకమైన అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలపై సంతకాలు చేయడం ద్వారా దేశం తన వ్యూహాత్మక దౌత్యాన్ని అనుసరిస్తోంది.భారత్, అమెరికా మధ్య ట్రేడ్ డీల్ కు అంగీకారం జరిగిన తరువాత రష్యా చమురు కొనుగోలు హాట్ టాపిక్ అవుతోంది. అయితే రష్యా ముడి చమురును కొనడం పూర్తిగా ఆపివేయడం వల్ల ఇండియాకు సమస్యలు ఏర్పడవచ్చు. రేటింగ్ ఏజెన్సీ మూడీస్ ఫిబ్రవరి 3 తన నివేదికలో, భారత్ ఇటీవల నెలల్లో రష్యా నుండి ముడి చమురును కొనడం క్రమంగా తగ్గించిందని పేర్కొంది. అందుకు అమెరికానే కారణం అని తెలిసిందే. అయితే పూర్తి కొనుగోళ్లను ఒక్కసారిగా నిలిపివేస్తే ఆర్థికాభివృద్ధికి చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. రష్యా నుంచి కాకుండా ఇతర దేశాల నుంచి చౌక ధరకు ముడి చమురు కొనడం సవాల్‌గా మారనుంది. ఇది ప్రపంచ వ్యాప్తంగా ధరల పెరుగుదలకు కారణం అవుతుందని, భారత్ వంటి అతిపెద్ద దిగుమతి చేసుకునే దేశంలో ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉందని మూడీస్ స్పష్టంగా పేర్కొంది. ఆర్థికాభివృద్ధిలో ఇబ్బందులను నివారించడానికి భారతదేశం వెంటనే అన్ని రష్యా నుంచి ముడి చమురు కొనుగోళ్లను ఆపివేసే అవకాశం లేదని ఏజెన్సీ తెలిపింది. అమెరికా భారత వస్తువులపై టారిఫ్ 50 శాతం నుండి 18 శాతానికి తగ్గించిన వాణిజ్య ఒప్పందం కోసం వచ్చింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత్ త్వరలో రష్యా చమురును కొనడం ఆపివేస్తుందన్నారు. ఇకనుంచి వెనిజులా నుండి ఎక్కువ చమురును కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. భారత్ అమెరికా నుండి 500 బిలియన్ డాలర్లకు పైగా ఉత్పత్తులను కొనుగోలు చేస్తుందని, ఇందులో ముడి చమురు కూడా ఉంటుందని ట్రంప్ అన్నారు. అయితే, ప్రధాని మోదీ మాత్రం టారిఫ్ తగ్గించడంపై మాత్రమే మాట్లాడారు. కానీ రష్యా చమురును ఆపివేయడం గురించి స్పష్టత ఇవ్వలేదు. రష్యా చమురు కొనుగోలు కారణంగా విధించిన అదనపు 25 శాతం పెనాల్టీ సుంకాన్ని తొలగించారని, అలాంటి కొనుగోళ్లను ఆపివేయడానికి భారత్ అంగీకరించిందని వైట్ హౌస్ అధికారి పేర్కొన్నారు. డీల్ ప్రకటన తర్వాత, స్టాక్ మార్కెట్లో జోరు కనిపించింది. నిఫ్టీ దాదాపు 3 శాతం పెరగగా, రూపాయి బలపడి డాలర్‌కు 90.40 వద్దకు చేరుకుంది. భారత్ వాణిజ్య శాఖ గడిచిన 12 నెలల్లో అత్యంత చురుగ్గా వ్యవహరించింది. అమెరికాతో కుదిరిన తాజా ఒప్పందానికి కొద్ది రోజుల ముందే భారత్, యూరోపియన్ యూనియన్‌తో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్‌పై సంతకాలు చేసింది. ఒకే సంవత్సరంలో ప్రపంచంలోని రెండు అతి పెద్ద ఆర్థిక శక్తులతో కుదుర్చుకోవడం భారత ఆర్థిక చరిత్రలో ఇదే తొలిసారి. వీటితోపాటు బ్రిటన్, ఓమన్, న్యూజిలాండ్‌తో కూడా భారత్ వాణిజ్య ఒప్పందాలను పూర్తి చేసుకుంది. ఈ ఐదు దేశాలు సహా భారత్‌కు చెందిన మొత్తం జీడీపీని లెక్కిస్తే అది ప్రపంచ మొత్తం జీడీపీలో సుమారు 50 నుంచి 55 శాతం వరకు ఉంటుంది. కేవలం భారత్, యూరోపియన్ యూనియన్ వాటానే ప్రపంచ జీడీపీలో 25 శాతంగా ఉంది. గణాంకాలు అంతర్జాతీయ మార్కెట్ లో భారత్ ఎదుగుతున్న శక్తిని స్పష్టం చేస్తున్నాయి. ఈ ఒప్పందం భారత్‌కు పొరుగు దేశాలైన బంగ్లాదేశ్ వియత్నాం, థాయ్‌లాండ్‌లతో పోలిస్తే గొప్ప పోటీతత్వాన్ని కల్పించనుంది. ప్రస్తుతం అమెరికా విధించిన కొత్త నిబంధనల ప్రకారం... బంగ్లాదేశ్‌పై 20 శాతం, వియత్నాం 20 శాతం, థాయిలాండ్‌పై 19 శాతం టారిఫ్‌లు ఉన్నాయి. కానీ భారత్‌కు ఇది కేవలం 18 శాతానికి తగ్గడం వల్ల అమెరికా మార్కెట్ లో భారతీయ వస్తువుల ధరలు తగ్గి గిరాకీ పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అమెరికా ప్రథమ స్థానంలో ఉండగా, యూరోపియన్ యూనియన్ ద్వితీయ స్థానంలో ఉంది. భారత్ ఇప్పటికే ప్రపంచంలో నాల్గో అతి పెద్ద ఆర్థికవ్యవస్థగా ఉంది. బ్రిట్ కూడా టాప్ 5 ఆర్థిక వ్యవస్థల జాబితాలో కొనసాగుతోంది. ఈ ప్రభావవంతమైన ఆర్థిక శక్తులన్నీ ఇప్పుడు భారత్‌తో దృఢమైన వాణిజ్య బంధాన్ని కలిగి ఉన్నాయి తాజా ఒప్పందాలతో భారత తయారీ రంగం సేవా రంగానికి అంతర్జాతీయ మార్కెట్లు భారీగా అందుబాటులోకి రానున్నాయి. భారత్ తన వాణిజ్య విధానాల్లో చూపిస్తున్న ఈ దూకుడు ప్రపంచ దేశాలను ఆశ్చర్యానికి గురి చేస్తోంది.

ప్రతిపక్షం
హైదరాబాద్
గురువారం
05.02.2026

ప్రభుత్వ పాఠశాలల పునరుజ్జీవనానికి హేతుబద్ధీకరణే మార్గమా?

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ నిర్ణయం విద్యా రంగంలో ఒక కీలక మలుపు. ఇది సక్రమంగా, పారదర్శకంగా అమలైతే ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుంది, విద్యా నాణ్యత మెరుగుపడుతుంది, ప్రభుత్వ వ్యయం సమర్థంగా వినియోగమవుతుంది. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ఈ ప్రక్రియ పూర్తవ్వడం ద్వారా విద్యార్థులకు ఎలాంటి అంతరాయం లేకుండా మార్పు సాధ్యమవుతుంది. అయితే దీనికి అవసరమైన రాజకీయ సంకల్పం, పరిపాలనా సామర్థ్యం, సామాజిక సమన్వయం అన్నీ సమపాళ్లలో కలిసినప్పుడే ఈ నిర్ణయం ఆశించిన ఫలితాలను ఇస్తుంది.



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ అనే అంశం ఇటీవలి కాలంలో రాష్ట్ర విద్యావిధానంలో అత్యంత కీలకమైన మలుపుగా మారింది. విద్యా వ్యవస్థలో అసమానతలు, వనరుల వృథా, ఉపాధ్యాయుల అసమతుల పంపిణీ వంటి దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారంగా ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి ఈ ప్రక్రియను పూర్తిగా అమలు చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ నిర్ణయానికి పూర్వాపరాలు, దానికి దారితీసిన సంఘటనలు, ప్రస్తుతం ఉన్న గణాంకాలు, భవిష్యత్‌పై దీని ప్రభావం అన్నిటినీ సమగ్రంగా పరిశీలిస్తే ఇది కేవలం పరిపాలనా సంస్కరణ మాత్రమే కాకుండా ప్రభుత్వ పాఠశాల విద్యా భవిష్యత్తును నిర్ణయించే కీలక చర్యగా కనిపిస్తుంది. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల వ్యవస్థ చరిత్రను పరిశీలిస్తే ఉపాధ్యాయుల నియామకాలు, బదిలీలు, పదోన్నతులు తరచూ రాజకీయ, ప్రాంతీయ ఒత్తిళ్లకు లోనవుతూనే వచ్చాయి. ఒక దశలో విద్యార్థుల సంఖ్యకు మించిన ఉపాధ్యాయులు కొన్ని పాఠశాలల్లో ఉండగా, మరికొన్ని గ్రామీణ, గిరిజన, మారుమూల ప్రాంతాల్లో కనీస అవసరానికి సరిపడా ఉపాధ్యాయులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న సందర్భాలు అనేకం. ఉదాహరణకు, గత దశాబ్దంలో నిర్వహించిన విద్యాశాఖ అంతర్గత సర్వేల్లో పట్టణ ప్రాంతాల్లోని కొన్ని ప్రాథమిక పాఠశాలల్లో 1:15 లేదా 1:18 ఉపాధ్యాయ-విద్యార్థి నిష్పత్తి ఉండగా, మారుమూల మండలాల్లో అదే నిష్పత్తి 1:60 లేదా అంతకంటే ఎక్కువగా నమోదైంది. ఈ అసమానతలు విద్యా నాణ్యతపై ప్రత్యక్ష ప్రభావం చూపడమే కాకుండా ప్రభుత్వ వ్యయాన్ని కూడా అనవసరంగా పెంచాయి. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ అనే భావన ముందుకు వచ్చింది. హేతుబద్ధీకరణ అంటే ఉద్యోగాలను తగ్గించడం కాదు, ఉన్న వనరులను సమర్థంగా, న్యాయంగా పంపిణీ చేయడం. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ పాఠశాలల సంఖ్య, వాటిలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల మొత్తం సంఖ్య, విద్యార్థుల నమోదు గణాంకాలను పరిశీలించి ఈ నిర్ణయం తీసుకున్నారు. తాజా అధికారిక లెక్కల ప్రకారం రాష్ట్రంలో సుమారు లక్షకు పైగా ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, వాటిలో దాదాపు నాలుగు లక్షల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. కానీ విద్యార్థుల మొత్తం సంఖ్య గత పది సంవత్సరాల్లో క్రమంగా తగ్గుతూ రావడం గమనార్హం. ప్రైవేట్ పాఠశాలల విస్తరణ, వలసలు, జనాభా ధోరణుల మార్పు వంటి కారణాల వల్ల కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు గణనీయంగా పడిపోయింది. ఈ గణాంకాలే హేతుబద్ధీకరణకు బలమైన ఆధారంగా మారాయి. ప్రభుత్వం విడుదల చేసిన నివేదికల ప్రకారం సుమారు 20 శాతం పాఠశాలల్లో అవసరానికి మించిన ఉపాధ్యాయులు ఉండగా, దాదాపు 30 శాతం పాఠశాలల్లో తీవ్ర కొరత ఉంది. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయుల బదిలీలు, పునర్వ్యవస్థీకరణ తప్పనిసరిగా మారింది. హేతుబద్ధీకరణను పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి ప్రతి తరగతికి సరిపడా ఉపాధ్యాయులు అందుబాటులో ఉండేలా ప్రణాళిక రూపొందించారు. అవసరానికి మించిన ఉపాధ్యాయులున్న పాఠశాలల్లో అదనపు తరగతులు లేకపోయినా వేతనాలు చెల్లించాల్సి వస్తుండేది. మరోవైపు ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల్లో విద్యా ఫలితాలు దెబ్బతింటున్నాయి. ఈ రెండు సమస్యలకు ఒకేసారి పరిష్కారం చూపే మార్గంగా హేతుబద్ధీకరణను ప్రభుత్వం చూస్తోంది. విద్యాశాఖ అంతర్గత అంచనాల ప్రకారం ఈ ప్రక్రియ పూర్తయితే ఉపాధ్యాయ-విద్యార్థి నిష్పత్తిలో 90 శాతం వరకు సమతులత సాధ్యమవుతుంది. సామాజికంగా కూడా ఈ నిర్ణయం ప్రాధాన్యత కలిగినదే. గ్రామీణ, పేద, వెనుకబడిన వర్గాల



పిల్లలు ఎక్కువగా ప్రభుత్వ పాఠశాలలపై ఆధారపడుతున్నారు. అక్కడ ఉపాధ్యాయుల కొరత ఉండటం అంటే నేరుగా ఆ వర్గాల భవిష్యత్తుపై ప్రభావం పడటమే. హేతుబద్ధీకరణ ద్వారా అటువంటి ప్రాంతాలకు ఎక్కువ మంది ఉపాధ్యాయులు అందుబాటులోకి రావడం విద్యలో సమాన అవకాశాలను పెంచుతుంది. కేవలం పరిపాలనా ఆదేశాలతో కాకుండా ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుంటూ ఈ సంస్కరణను అమలు చేయడం కీలకం. మొత్తంగా చూస్తే ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ నిర్ణయం విద్యా రంగంలో ఒక కీలక మలుపు. ఇది సక్రమంగా, పారదర్శకంగా అమలైతే ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుంది, విద్యా నాణ్యత మెరుగుపడుతుంది, ప్రభుత్వ వ్యయం సమర్థంగా వినియోగమవుతుంది. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ఈ ప్రక్రియ పూర్తవ్వడం ద్వారా విద్యార్థులకు ఎలాంటి అంతరాయం లేకుండా మార్పు సాధ్యమవుతుంది. అయితే దీనికి అవసరమైన రాజకీయ సంకల్పం, పరిపాలనా సామర్థ్యం, సామాజిక సమన్వయం అన్నీ సమపాళ్లలో కలిసినప్పుడే ఈ నిర్ణయం ఆశించిన ఫలితాలను ఇస్తుంది. ప్రభుత్వ పాఠశాలల భవిష్యత్తును కొత్త దిశగా మలిచే ఈ ప్రయత్నం విజయం సాధిస్తుందా లేదా అన్నది అమలు విధానంపైనే ఆధారపడి ఉంటుంది.

నిర్ణయానికి దారితీసిన సంఘటనల్లో మరో ముఖ్యమైన అంశం జాతీయ విద్యా విధానం సూచనలు. విద్యా నాణ్యత, ఉపాధ్యాయుల పాత్ర, విద్యార్థి-ఉపాధ్యాయ నిష్పత్తి వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రాథమిక స్థాయిలో 1:30, ప్రాథమికోన్నత స్థాయిలో 1:35 నిష్పత్తి సాధించాలన్న సూచనలను రాష్ట్రం పరిగణనలోకి తీసుకుంది. ఈ నిర్ణయం వెలువడిన వెంటనే ఉపాధ్యాయ సంఘాల నుంచి మిశ్రమ స్పందన వచ్చింది. కొందరు దీన్ని అవసరమైన సంస్కరణగా స్వాగతిస్తే, మరికొందరు ఉద్యోగ భద్రత, బలవంతపు బదిలీలు, కుటుంబ సమస్యలు వంటి అంశాలపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మాత్రం స్పష్టంగా ఒక విషయం చెబుతోంది హేతుబద్ధీకరణ వల్ల ఒక్క ఉపాధ్యాయుడి ఉద్యోగం కూడా పోదు, వేతనాలు తగ్గవు. కేవలం పాఠశాలల మధ్య సమతుల పంపిణీ మాత్రమే జరుగుతుంది. బదిలీల్లో పారదర్శకత కోసం ఆన్‌లైన్ విధానం, స్పష్టమైన పాయింట్ల వ్యవస్థను అమలు చేస్తామని ప్రకటించింది. సీనియారిటీ, మహిళా ఉపాధ్యాయుల సమస్యలు, అనారోగ్య కారణాలు వంటి అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చింది. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం వరకు ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్న లక్ష్యం వెనుక ఒక వ్యూహం ఉంది. విద్యా సంవత్సరం మధ్యలో ఉపాధ్యాయుల మార్పులు జరిగితే బోధనకు అంతరాయం కలుగుతుందన్న విమర్శలు గతంలో వచ్చాయి. అందుకే ఈసారి వేసవి సెలవుల కాలాన్ని వినియోగించి హేతుబద్ధీ-

(వ్యాస రచయిత
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్)


ప్రజల మనిషి వట్టికోట ఆళ్వారుస్వామి



సుధాకర్.ఏ.వి
9000674747

స్వసుఖం కోరని వాడు /వారం వారం మారని వాడు /రంగులు అద్దుకోలేనివాడు /అబద్ధాసురుని పాలిట తల్వార్ అల్వార్ అని దాశరధి చేత కీర్తించబడి 'వాడు చరిత్రకారుడు కాదు వాడే ఒక చరిత్ర' అంటూ కాళోజీ చే ప్రశంసలందుకున్న తెలంగాణ వైతాళిక దిగ్గజం, తెలంగాణ సాహితీ సరస్వతి కన్న మరో అక్షరం వట్టి కోట ఆళ్వారుస్వామి. రచయితగా, ప్రచురణకర్తగా, పత్రికా నిర్వాహకుడుగా, పౌరహక్కుల పరిరక్షణ కార్యకర్తగా, ఉద్యమకారునిగా తెలంగాణ ప్రజల మనస్సులో నిలిచిపోయిన శాశ్వత జీవి, ప్రజల మనిషి వట్టికోట ఆళ్వారుస్వామి. ఆళ్వారుస్వామి 1916 నవంబరు 1వ తేదీన నాటి నల్గొండ జిల్లా నకిరేకల్ సమీపంలోని చెరువు మాదారం గ్రామంలో జన్మించాడు. సింహాద్రమ్మ, రామచంద్రా చార్యులు ఆయన తల్లిదండ్రులు,వారిది సాంప్రదాయిక కుటుంబం పేదరికం వల్ల ఆ కుటుంబం ఎన్నో కష్టాలు పడింది. దానికితోడు చిన్నతనంలోనే తండ్రి చనిపోవడంతో అళ్వారుస్వామి ఎన్నో దుర్భర పరిస్థితులను ఎదుర్కోవలసి వచ్చింది.కుటుంబ పోషణకై పంటలు చేసేవాడు. పాఠశాల విద్యకు దూరమైనాడు. ఒక ఉపాధ్యాయునికి వంట చేసిపెడుతూ అతని వద్ద విద్యను అభ్యసించేవాడు.ఆ ఉపాధ్యాయుడు సూర్యాపేటకు బదిలీ కావడంతో ఆళ్వారుస్వామి అతనితో పాటు సూర్యాపేట చేరాడు. అక్కడ గ్రంథాలయంలోని పుస్తకాలను,పత్రికలను చదువుతూ పఠనాభివృద్ధిని పెంపొందించుకున్నాడు. లోకాన్ని అర్థం చేసుకున్నాడు. తరువాత విజయవాడకు చేరి అక్కడొక హోటల్లో సర్వరుగా పనిచేశాడు.వచ్చిన జీతంలో కొంత పుస్తకాల కొనుగోళ్ళకు ఖర్చుచేసేవాడు. మరికొంత డబ్బు ఖర్చు పెట్టి ఒక ఉపాధ్యాయుని దగ్గర ఇంగ్లీషు నేర్చుకున్నారు. మళ్ళీ సూర్యాపేటకు తిరిగివచ్చి వంటలు చేస్తుండేవాడు. అళ్వారుస్వామి స్వయంకృషితోనే తెలుగు, హిందీ, ఉర్దూ,ఇంగ్లీషు భాషలపై పట్టు సాధించాడు. గోల్కొండ పత్రికలో ప్రూఫ్ రీడర్ గా చేరాడు. క్రమక్రమంగా సాహితీవేత్తలతో, సంఘ సేవకులతో, ఇతర సంస్థలతో పరిచయాలు పెరిగాయి. సికింద్రాబాదులోని ఒక దేవాలయ ప్రధానార్చకుని మనుమరాలైన యశోదమ్మను పెండ్లి చేసుకున్నాడు.

పుస్తక పఠన ప్రయోజనాన్ని గుర్తించిన అళ్వారుస్వామి గ్రంథాలయాల ఆవశ్యకతను ప్రజలకు తెలియజేస్తూ వారిని చైతన్యవంతులను చేశాడు. గ్రంథాలయాల స్థాపనకై గ్రంథాలయోద్యమాన్ని నిర్వహించారు. తాను స్వయంగా దేశోద్ధారక గ్రంథమాలను స్థాపించి పుస్తకాలను ముద్రించి ఊరూరా తిరుగుతూ పుస్తకాల గొప్పతనాన్ని వివరిస్తూ వాటిని ఒక అణాకు అమ్మేవాడు. దానితో



దేశోద్ధారక గ్రంథమాల 'అణా గ్రంథమాల'గా ప్రసిద్ధి పొందింది. నాయకుడు ఎలా ఉండాలో ఆయన 'ప్రజల మనిషి' నవల తెలుపుతుంది. ఆయన రాసిన నవలలు ప్రజల్లో ఎంతో చైతన్యాన్ని తెచ్చాయి. 'గిర్దావరు' నవలికలో భారత్‌లో హైదరాబాద్ రాజ్యపు బలవంతపు విలీనం, దేశ స్వాతంత్ర్యానంతరం సమాజంలో పెరిగిన స్వార్థం, పతనమవుతున్న విలువలను సూటిగా, నిక్కచ్చిగా విమర్శించారు. తెలంగాణ మాండలికంలో, సహజ సుందరమైన శైలిలో వాస్తవిక జీవితాలకు అక్షర రూపమిచ్చిన సజీవ శిల్పాలుగా వట్టికోటవారి కథలు నిలిచిపోతాయి. కథకునిగా, నవలాకారునిగా, ప్రజా ఉద్యమ నాయకునిగా ఆళ్వారు స్వామి జీవితకాలమంతా చేసిన కృషి ఈనాటి రచయితలకీ, కవులకీ ఆదర్శప్రాయం. గుమస్తా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల సాధనకై గుమస్తాల సంఘం ఏర్పాటుచేసి వారి కొరకు గుమస్తా' అనే పత్రికను కూడా నడిపాడు. అళ్వారుస్వామి ఉద్యమ ఫలితంగా గుమస్తాలకు వారానికి ఒకరోజు సెలవు, ఇతర సౌకర్యాలు కల్పించ బడ్డాయి. నిజాం సర్కారు రిక్షాలను రద్దుచేయాలని ప్రయత్నించినప్పుడు రిక్షా కార్మిక సంఘాన్ని ఏర్పాటుచేసి పోరాటాలు చేశాడు. తత్ఫలితంగా సర్కారు తన ఆలోచన విరమించు కున్నది. నిజాం రైల్వేలో పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగుల సమస్యల సాధనకై ఉద్యమం చేశాడు. ఆంధ్ర మహాసభ అధ్యక్షుడుగా, అభ్యుదయ రచయితల సంఘం (అరసం) కార్యదర్శిగా పనిచేశాడు. వెట్టిచాకిరి భూస్వాముల దౌర్జన్యం, నిజాం నిరంకుశ పాలన, పౌరహక్కుల భంగం మొదలైన అంశాలపై ఉద్యమించాడు. ఆ క్రమంలో తెలుగుతల్లి' పత్రికను నిర్వహించాడు. మీజాన్ పత్రికలో ఎన్నో వ్యాసాలు, వార్తలు రాశాడు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. నిజాం సర్కారు అళ్వారును అరెస్టుచేసి జైల్లో పెట్టిన సందర్భంలో దాశరథి కృష్ణమాచార్యులతో కలిసి కొంతకాలం ఒక జైల్లో ఉన్నారు. దాశరథి పద్యాలను గోడలపై రాస్తుండేవాడు. ఖైదీల జీవితానుభవాలను, వారి కష్టసుఖాలను అధ్యయనంచేసి తన స్వీయానుభవాలతో జైలులోపల' అనే కథలను రాశాడు. తెలంగాణ ప్రజాజీవితం నేపథ్యంలో ప్రజల మనిషి', 'గంగు' అనే నవలలు రాశాడు. 'రామప్ప రభస' పేరుతో వ్యాసాలు కూడా రాశాడు. దొడ్డి కొమరయ్య మరణించినప్పుడు పౌరహక్కుల ఉల్లంఘనపై గళమెత్తారు. ఉద్యమాలే ఊపిరిగా, గ్రంథాలయ స్థాపన ధ్యేయంగా, ప్రజాహితం కోసం పనిచేసిన వట్టికోట ఆళ్వారుస్వామి 1961, ఫిబ్రవరి 5న మరణించాడు. బతికింది కొద్దికాలమే అయినా తన జీవిత కాలమంతా ఉద్యమాలతోనే గడిపాడు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఎర్రసూరీడై వెలుగొందాడు. ఎందరికో స్ఫూర్తినిచ్చాడు. ప్రజా వ్యతిరేక పాలకుల పాలిటీ తల్వార్ లా నిలిచాడు మన ఆళ్వారు.

(ఫిబ్రవరి 5 వట్టికోట ఆళ్వారు స్వామి వర్ధంతి)

వ్యాస రచయిత రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు
స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ



లేఖ

ఆదివాసీ ఉద్యమాలతో సంఘాల వ్యాపారం

ఏజెన్సీ లో ఆదివాసీ సంఘాలు నాయకులు అంటూ ఆదివాసీ సమాజాన్ని నిలువు నా మోసం చేస్తూ ఆదివాసీ ఉద్యమాన్ని ఒక ఉపాధి గా చేసుకొని జీవనం సాగిస్తున్నారు కొందరు. నకిలీ ఆదివాసీ సంఘాలు రోజు రోజుకు పుట్టగొడుగులుగా పుట్టుకు వస్తున్నాయి. పొద్దునే యల్ టి ఆర్ కేసు వేసి పొద్దు పోయిన తరువాత బేరసారాలు చేసే నకిలీ ఆదివాసీ సంఘాలు ఏజెన్సీ లో స్వైరవిహారం చేస్తూ ఆదివాసీ సమాజం ఆత్మ గౌరవాన్ని దెబ్బ తీస్తున్నాయి. విప్లవ పార్టీలకు సద్దులు మోస్తూ సంచులు మోస్తూ బూర్జువా పార్టీల బూట్లు నాకుతూ బ్యాంక్ బ్యాలెన్స్ పెంచుకుంటున్న పరిస్థితి నేడు ఏజెన్సీ లో ఉన్నది. ఎలక్షన్ వస్తే చాలు... ఆదివాసీ సంఘాలు నాయకుల దొంగల ముఠా మొత్తం ఒక్కసారిగా ఆదివాసీ సంఘాలు ఇంటి ముందు వాలుతుంది. కారణం స్పష్టం అక్కడ ఓట్ల కాసుల మూట ఉంటుంది. ఆదివాసీ ఓట్లు, ఆదివాసీ చావులు, ఆదివాసీ బాధలు అన్నీ రాజకీయ మార్కెట్లో అమ్ముకునే సరుకులుగా మారిపోయాయి. ఇక్కడ చూడాల్సింది ఆదివాసీ కన్నీళ్లు కాదు కాసుల మూట ఎంత పెద్దదన్నదే. ఆదివాసీ నాయకులమని చెప్పుకుంటూ తిరిగే కొందరు, ఆదివాసీల పై దౌర్జన్యాలు జరిగితే "మేమున్నాం" అంటూ మీడియా కెమెరాల ముందు గొంతెత్తుతారు. ఫోటోలు, వీడియోలు అయ్యాక... వెనక నుంచి బాధిత కుటుంబాల బాధను బేరంగా మార్చుకుని జేబులు నింపుకుని వెళ్లిపోతారు. ఇలాంటి నకిలీ ఆదివాసీ నాయకులే నేటి ఆదివాసీ సమాజానికి అసలైన శాపం.

ఆదివాసీ హక్కులు తుంగలో తొక్కబడుతున్నా, ఆదివాసీ ప్రాణాలు కోల్పోతున్నా.. న్యాయం కోసం పోరాడాల్సిన చోట రాజకీయ లాభాలు, డబ్బు వసూలే కొంతమంది ఆదివాసీ లీడర్ల ప్రధాన వృత్తిగా మారింది. ఆదివాసీ ల కన్నీళ్లపై రాజకీయ వ్యాపారం చేస్తున్న ఈ స్వార్థ ఆదివాసీ నాయకులు ఉన్నంతకాలం ఆదివాసీ సమాజానికి న్యాయం జరగడం ఒక కలగానే మిగిలిపోతుంది. గిరిజనేతరుల మోచేతి నీళ్లు తాగడం అలవాటై, అధికారాల చుట్టూ తిరుగుతూ స్వప్రయోజనాల కోసం ఆస్తులు కూడబెట్టుకునే ఈ నాయకులు... ఆదివాసీ సమాజాన్ని ముందుకు నడిపించడం కాదు, మరింత వెనక్కి నెట్టేస్తున్నారు. నేటి ఈ స్వార్థ ఆదివాసీ నాయకత్వం కొనసాగితే రేపటి తరాల ఆదివాసీ పిల్లలకు కూడా అవమానాలే వారసత్వంగా మిగిలే ప్రమాదం ఉంది. ఆదివాసీ పేరుతో రాజకీయాలు చేసి, ఆదివాసీ జీవితాలతో వ్యాపారం చేస్తున్న ఆదివాసీ నాయకులకు ఇప్పటికైనా కనువిప్పు కలగాలి. నకిలీ నాయకత్వం అంతం చేసి, నిజమైన ఆదివాసీ నాయకత్వం వెలుగులోకి రావాలి. అదే ఆదివాసీ సమాజ భవిష్యత్తుకు ఏకైక ఆశ.



వూకె రామకృష్ణ దొర
ఆదివాసీ జర్నలిస్ట్ అసోసియేషన్
9866073866

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula
@gmail.com
9010223917
ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008




రాజకీయ వ్యభిచారి కాంగ్రెస్

- కేటీఆర్.. నా జోలికొస్తే నీ బతుకును రోడ్డుకీడుస్తా
- సిరిసిల్ల ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్,
- కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగిన కేంద్ర మంత్రి బండి సంజయ్

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్ / సిరిసిల్ల: ఫిబ్రవరి 4: ఫిరాయింపుల విషయంలో కాంగ్రెస్ పార్టీ బహిరంగంగా రాజకీయ వ్యభిచారం చేస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై స్పష్టమైన ఆధారాలు ఉన్నప్పటికీ, అవేమీ లేవంటూ శాసనసభ స్పీకర్ తీర్పు ఇవ్వడం దుర్మార్గమని మండిపడ్డారు. ''స్పీకర్ సార్... మీరు నిజాయితీపరులు. కానీ మీపై కాంగ్రెస్ తీవ్ర ఒత్తిడి తెస్తోంది. ఫిరాయింపు ఎమ్మెల్యేలు గాంధీభవన్‌లోనే సంసారం చేస్తున్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయాల్లో మీటింగ్‌లు పెడుతున్నారు. వాళ్ల చేతికే బీ-ఫాంలు ఇస్తున్నారు. ఇవన్నీ కళ్లముందే కనిపిస్తున్నా పార్టీ మారలేదంటూ కేసులు కొట్టివేయడం దారుణం'' అని విమర్శించారు. ఇలాంటి తీర్పులతో ప్రజాస్వామ్య వ్యవస్థ అపహాస్యానికి గురవుతోందన్నారు. రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిపై మచ్చ పడేలా వ్యవహరించవద్దని, చరిత్రహీనులుగా మిగిలిపోవద్దని సూచించారు. ఈ సందర్భంగా ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల ప్రజలను ఉద్దేశించి బండి సంజయ్ కీలక పిలుపునిచ్చారు. ''మీ ఓట్ల కోసం మీ వద్దకు వచ్చే ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నారో ప్రశ్నించండి. ఈ ఎన్నికల్లో ఏ పార్టీకి ఓటేయమంటున్నారు? ఏ అభ్యర్థిని గెలిపించాలని కోరుతున్నారు? ఒక పార్టీ నుంచి గెలిచి, మరో పార్టీ కండువా కప్పుకుని మళ్లీ ఓట్లు అడగడం ఎందుకో అడుగడుగునా నిలదీయండి'' అని అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సిరిసిల్లకు వచ్చిన బండి సంజయ్, అంబేద్కర్ సర్కిల్ వద్ద నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, రాష్ట్ర అధికార ప్రతినిధి జె. సంగప్పతో పాటు జిల్లా నేతలు, బీజేపీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులు పాల్గొన్నారు. వేలాదిగా తరలివచ్చిన ప్రజలను ఉద్దేశించి బండి సంజయ్ ఉత్సాహభరితంగా ప్రసంగించారు.

మా వాళ్లు గుణవంతులు.. వాళ్లు ధనవంతులు

కరీంనగర్ మేయర్ పీఠాన్ని బీజేపీకి అప్పగిస్తే వరదల్లా కేంద్ర నిధులు తీసుకొచ్చే బాధ్యత నేనే తీసుకుంటానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హామీ ఇచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను గెలిపిస్తే అభివృద్ధి కాదు, మీ ఇండ్లలోకి వరద నీళ్లు వస్తాయే తప్ప ఇంకేమీ ఉండదని హెచ్చరించారు. 'బీజేపీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులు గుణవంతులు... కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు ధనవంతులు. మా వాళ్లు మీ సమస్యల కోసం పోరాడి జైలుకు పోయారు. వాళ్లు కబ్జాలు, దోపిడీలు చేసి జైలుకు వెళ్లారు. బోత్ ఆర్ నాట్ సేమ్'' అని తనదైన శైలిలో వ్యాఖ్యానించారు. కరీంనగర్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో భాగంగా రాంనగర్ సత్యనారాయణ స్వామి ఆలయం వద్ద 46, 47 డివిజన్ల అభ్యర్థులు అఖిల్ గౌడ్, గాజె రమ శివరాం పక్షాన, అలాగే కమాన్ చౌరస్తా వద్ద 38, 56, 57 డివిజన్ల అభ్యర్థులు దేవసాని సరస్వతి, తాటి ప్రభావతి, కొలిపాక రమ్యశ్రీల పక్షాన నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌ల్లో బండి సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్‌లో జరిగిన అభివృద్ధి పనులన్నీ కేంద్ర ప్రభుత్వ నిధులతోనే జరిగాయని స్పష్టం చేశారు. స్మార్ట్ సిటీ నిధులతో రోడ్లు, హైమాస్ట్ లైట్లు, సెంట్రల్ లైటింగ్, సిగ్నలింగ్ వ్యవస్థలు ఏర్పాటు చేశామన్నారు. టెలిఫోన్ క్వార్టర్స్ రోడ్డు, ఎల్ఎండీ బైపాస్ రోడ్డు ఆధునీకరణకు కేంద్రం రూ.30 కోట్లు ఇచ్చిందని గుర్తు చేశారు. అమృత్-1 పథకం కింద కేంద్రం ఇచ్చిన రూ.132 కోట్లతో కొత్త రిజర్వాయర్ నిర్మించామని తెలిపారు. ''మేయర్ పీఠాన్ని బీజేపీకి అప్పగిస్తే కరీంనగర్‌కు ప్రతిరోజూ తాగునీటి సరఫరా అందిస్తాం. పెండింగ్ పనులన్నీ పూర్తి చేయిస్తా. ఈ డివిజన్లను ఆదర్శంగా తీర్చిదిద్దుతా'' అని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్‌ను ఉద్దేశించి ''భూ రాక్షసుల సమితి'' అని విమర్శించారు. పదేళ్ల పాలనలో ప్రజలను జలగల్లా పీల్చి తిన్నారని, ఇప్పుడు రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో మరింత దోపిడీ జరుగుతోందని ఆరోపించారు. కరీంనగర్ కార్పొరేషన్‌కు మాత్రం ఒక్క పైస కూడా ఇవ్వలేదన్నారు. ''కాంగ్రెస్ గెలిస్తే ఇంటి పన్నులు పెరుగుతాయి, నల్లా బిల్లులు పెరుగుతాయి. బీఆర్ఎస్ గెలిచినా కేంద్రం నిధులు దారి మళ్లిస్తారు. బీజేపీని గెలిపిస్తే పన్నులు పెంచకుండా అభివృద్ధి చేస్తాం'' అని స్పష్టం చేశారు. చివరగా ప్రజలను ఉద్దేశించి, ''ఈ ఎన్నికలు ధనవంతులకు గుణవంతులకు మధ్య పోరాటం. ధనం ఉన్నవారిని గెలిపిస్తే దోపిడీ పెరుగుతుంది. గుణమున్న వారిని గెలిపిస్తే అభివృద్ధి జరుగుతుంది. ఎవరికి ఓటేస్తారో మీరే ఆలోచించి తీర్పు ఇవ్వండి'' అని పిలుపునిచ్చారు.

ఓటరు నమోదు కార్యక్రమం ప్రారంభం



ప్రతిపక్షం, కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 4 : బాచుపల్లిలోని డబుల్ బెడ్రూం సముదాయంలో మంగళవారం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చంద్రగిరి సతీష్ ఆధ్వర్యంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు నమోదు ద్వారా ప్రజల గొంతు మరింత బలపడుతుందని, ఎన్నికల్లో చురుకైన భాగస్వామ్యమే ప్రజాస్వామ్యానికి పునాదిగా నిలుస్తుందని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమని పేర్కొంటూ, ప్రతి అర్హుడైన పౌరుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ ఓటరు నమోదు కార్యక్రమం ద్వారా అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో ఓటు హక్కుపై అవగాహన పెంచుతామని పేర్కొన్నారు. కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో హాజరై తమ వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డబుల్ బెడ్రూం అసోసియేషన్ చైర్మన్లు ఎం.డి. ఫార్జన సలీమ్, రాము, వైస్ ప్రెసిడెంట్ దమయంతి, జనరల్ సెక్రటరీ కేజీయా రాజు, ట్రెసరర్ అజ్మిరి హైమద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం అమెరికా వెళ్తే రాష్ట్రంలో శబ్ద కాలుష్యం తగ్గింది

- రాగానే మళ్ళీ మొదలైంది.
- అక్కాచెల్లెళ్లకు రేవంత్ సర్కార్ బాకీ రూ. 60 వేలు.. అడిగితే మెడలో పేగులేసుకుంటాడట
- బీజేపీకి ఎనిమిది మంది ఎంపీలను గెలిపిస్తే.. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు ఇచ్చింది గుండు సున్నా
- మాజీ మంత్రి హరీశ్ రావు



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 4 : ముఖ్యమంత్రి అమెరికా వెళ్తే రాష్ట్రంలో శబ్ద కాలుష్యం తగ్గిందని, రాగానే మళ్లీ మొదలైందని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. నర్సాపూర్ నియోజకవర్గంలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ సన్నాహక సమావేశానికి మాజీ మంత్రి, హరీష్‌రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్థానిక ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి , కౌన్సిలర్ అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలప్పుడు 100 రోజుల్లో 6 గ్యారంటీలు అమలు చేస్తామని బాండ్ పేపర్లు రాసిచ్చింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చి 700 రోజులు దాటినా ఏ ఒక్క గ్యారంటీ పూర్తిగా అమలు కాలేదన్నారు. కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కుసుం కుమార్ మహిళలకు ఇప్పటికే రూ. 2500 ఇచ్చామని అబద్ధాలు చెబుతున్నారని, ఇప్పటివరకు ఒక్కో మహిళకు రూ. 2500 చొప్పున కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 60,000 బాకీ పడిందన్నారు. అక్రమంగా సంపాదించిన డబ్బు నర్సాపూర్‌కు పంపిస్తున్నారని, ఓటుకు రూ. 5000 పంచాలని చూస్తున్నారన్నారు. ప్రజలు రేవంత్ రెడ్డి ఇచ్చే 5000 తీసుకోండి, కానీ ఓటు మాత్రం కారు గుర్తుకే వేయాలని కోరారు. బీఆర్ఎస్‌ను గెలిపిస్తేనే ప్రభుత్వం మెడలు వంచి నెలనెలా రావాల్సిన రూ. 2500 సాధించుకుంటాం. బీజేపీ దేవుని పేరు చెప్పి ఓట్లు అడగడమే తప్ప పేదలకు పని చేయదని, కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు గుండు సున్నా ఇచ్చారన్నారు. 8 మంది ఎంపీలు, 8 మంది ఎమ్మెల్యేలను గెలిపిస్తే మనకు మొండిచేయి చూపించి.. గుజరాత్, ఏపీలకు నిధుల మూటలు ఇస్తున్నారని ఆరోపించారు. మన సిమెంట్ ఫ్యాక్టరీని తెరవరు, మూసీకి నిధులు ఇవ్వరు. తెలంగాణకు రూపాయి ఇవ్వని బీజేపీకి మనమెందుకు ఓటు వేయాలన్నారు. ఇప్పుడు గెలిచిన కౌన్సిలర్లు 5 ఏళ్లు ఉంటారు, కానీ ఈ ప్రభుత్వం ఉండేది ఇంకా రెండేళ్లే. మళ్ళీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే. అప్పుడు కేసీఆర్ ఉంటారు, నేనుంటాను. నర్సాపూర్ అభివృద్ధిని కొనసాగిస్తాం. అందుకే ఈ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

ఎంపీల సస్పెన్షన్‌పై లోక్‌సభలో రచ్చ

మొదటిపేజీ తరువాయి

రద్దు చేసుకోవలసి వచ్చింది. 8 మంది విపక్ష ఎంపీలను మంగళవారం సస్పెండ్ చేయడం, ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణేకి చెందిన అముద్రిత పుస్తకం నుంచి చైనాకు సంబంధించిన కొన్ని అంశాలను ఉటంకించడానికి ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అనుమతించకపోవడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్‌సహా విపక్ష పార్టీల ఎంపీలు బుధవారం లోక్‌సభలో అలజడి సృష్టించారు. దీంతో సభలో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. మధ్యాహ్నం 12.00 గంటలకు సభను వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. సభ 12.00 గంటలకు ప్రారంభమైంది. సభలో సభ్యుల తీరు మారలేదు. భారత్, అమెరికా ఒప్పందంపై కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ మధ్యాహ్నం 2.00 గంటలకు సభలో సమాధానం ఇస్తారని ప్రకటించిన అనంతరం సభను వాయిదా వేశారు. మళ్లీ సభ ప్రారంభమైన అనంతరం భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందంపై సభలో మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడారు. విపక్ష సభ్యులు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. ప్లకార్డులు ప్రదర్శించారు. దాంతో సాయంత్రం 5.00 గంటలకు సభను వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. వాయిదా అనంతరం సాయంత్రం 5 గంటలకు సభా కార్యకలాపాలు తిరిగి ప్రారంభం కాగానే ప్రధాని మోదీ ఇక ప్రసంగిస్తారని భావిస్తున్న సమయంలో అనూహ్యంగా వర్షా గైక్వాడ్, జ్యోతిమణిసహా విపక్షానికి చెందిన కొందరు మహిళా ఎంపీలు మోదీతోసహా అధికార పక్షానికి చెందిన ఎంపీల సీట్లను అడ్డుకున్నారు. 'ఏది సరైనదో అదే చేయండి' అన్న అక్షరాలు రాసిన పెద్ద బ్యానర్‌ను పట్టుకుని వారు నిరసన తెలిపారు. 8 మంది విపక్ష ఎంపీల సస్పెన్షన్‌ను వారు తీవ్రంగా ఖండించారు. ఇంతలో స్పీకర్ స్థానంలో ఉన్న సంధ్యా రాయ్ సభను వాయిదా వేశారు. కాగా, ప్రధాని మోదీపై మహిళా ఎంపీలు దాడి చేసి ఉండేవారని బీజేపీకి చెందిన మనోజ్ తివారీ ఆ తర్వాత వ్యాఖ్యానించడం గమనార్హం. 'జరిగిన ఘటన చాలా భయంకరమైనది. కాంగ్రెస్ నిస్పృహకు ఇది పరాకాష్ఠ. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం మహిళా ఎంపీలు ప్రధాని మోదీ కుర్చీని చుట్టుముట్టారు. కిరణ్ రిజిజు వెంటనే ఆలోచించబట్టే పరిస్థితి అదుపులోకి వచ్చింది అని మనోజ్ తివారీ వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ ప్రసంగం రద్దు కావడంతో గురువారం దీనిపై చర్చ కొనసాగనున్నది.

దూబే వ్యాఖ్యలపై దుమారం

రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా బుధవారం లోక్‌సభలో బీజేపీ సభ్యుడు నిషికాంత్ దూబే చేసిన అనుచిత వ్యాఖ్యలపై అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చెలరేగింది. మాజీ ప్రధానులు నెహ్రూ, ఇందిరా గాంధీపై సభలో అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినందుకు దూబేపై చర్యలు తీసుకోవాలని విపక్ష ఎంపీలు డిమాండు చేశారు. విపక్ష సభ్యుల నిరసనల మధ్య సభ రేపటికి వాయిదా పడింది.

హాలో మిత్రద్రోహి.. హాయ్ దేశద్రోహి

లోక్‌సభ ప్రాంగణంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ మాజీ ఎంపీ, కేంద్ర మంత్రి రవ్‌నీత్ బిట్టూ మధ్య మాటల యుద్ధం జరిగింది. అతడిని రాహుల్ 'మిత్ర ద్రోహి' అని పిలువగా, బదులుగా అతను దేశ ద్రోహి అంటూ రాహుల్‌ను నిందించారు. పార్లమెంట్ మకర్ ద్వార్ వద్ద బుధవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. కాంగ్రెస్ ఎంపీల సస్పెన్షన్‌ను నిరసిస్తూ రాహుల్, పార్లమెంట్ నుంచి సస్పెండైన 8 మంది ఎంపీలతో కలిసి ఆందోళన చేస్తున్నారు. అదే సమయంలో ఆ వైపుగా వెళ్తున్న బీజేపీ ఎంపీ బిట్టూ 'వారు (సస్పెండైన ఎంపీలు) ఏదో యుద్ధం గెలిచినట్టుగా ఇక్కడ కూర్చున్నారు' అంటూ వ్యాఖ్యానించారు. దానికి సమాధానంగా రాహుల్ స్పందిస్తూ 'విషయం ఏమిటంటే ఇక్కడ ఒక ద్రోహి అటుగా నడుస్తున్నాడు. అతడి ముఖం చూడండి.. ఎలా చూస్తున్నాడో' అంటూ వ్యాఖ్యానించడమే కాక, బిట్టూతో కరచాలనం కోసం తన చేతులు చాచి 'హలో సోదరా.. నా మిత్ర ద్రోహి.. బాధపడకు.. నీవు త్వరలోనే వెనుకకు (కాంగ్రెస్‌కు) వస్తావులే' అని పేర్కొన్నారు. అయితే ఆయనతో కరచాలనం చేయడానికి నిరాకరించిన బిట్టూ రాహుల్‌నే 'దేశ ద్రోహి' అంటూ నిందించారు.



రామచంద్రాపురంలో అభివృద్ధి పనుల ప్రారంభం

- ముఖ్యఅతిథిగా హాజరైన నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 4 : మహా నగర అభ్యున్నతికి ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నామని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం డివిజన్ పరిధిలో రూ.40.70 కోట్ల అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవనికి స్థానిక కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ ఆధ్వర్యంలో పలు ప్రారంభోత్సవాలకు, శంకుస్థాపనలకు డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి, భారతి నగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి లతో కలిసి ముఖ్యఅతిథిగా నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి హాజరయ్యారు. అందులో భాగంగా రామచంద్రాపురం శ్రీనివాస్ నగర్ కాలనీ పరిధిలో ఉన్న సోమేశ్వర ఆలయం వద్ద కమ్యూనిటీ హాల్, రామచంద్రపురంలో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, డివిజన్లో అభివృద్ధి కొరకు నూతన మంజూరు, శ్రీనివాస్ నగర్ లో గాంధీ బాలవిహార్ పార్క్, ఓల్డ్ రామచంద్రాపురంలో మీట్ మార్కెట్, రాయసముద్రం చెరువు సుందరీకరణ హెచ్ఎండిఏ, రాయసముద్రం చెరువులో మురికి నీరు మళ్లించడానికి, రామచంద్రారెడ్డి నగర్ లో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, కాకతీయ నగర్ కాలనీలో థీమ్ పార్క్ (హెచ్ఎండీఏ), కాకతీయ నగర్ కాలనీలో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీల అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ తో కలిసి నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. నగరం నలువైపులా విస్తరిస్తున్నందు వల్ల జనాభాకు అనుగుణంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. గడిచిన ఐదు సంవత్సరాలలో జిహెచ్ఎంసి పరిధిలోని అన్ని డివిజన్లను అభివృద్ధి చేశామని తెలిపారు. రామచంద్రాపురం డివిజన్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడం, పలు శంకుస్థాపనలు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



మున్సిపాలిటీల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

- ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 4 : మున్సిపాలిటీల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం అని పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి అన్నారు. బుధవారం పటాన్ చెరు మండలం ఇంద్రేశం మున్సిపాలిటీలో బీజేపీ 11వ కౌన్సిలర్ అభ్యర్థి పద్మిని, అదేవిధంగా హర్షవర్ధన్ రెడ్డిలకు మద్దతుగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి కౌన్సిలర్ అభ్యర్థులను కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పాటు అయిన ఇంద్రేశం మున్సిపాలిటీ అభివృద్ధి చెందాలంటే బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం నిధులతోనే మున్సిపాలిటీ అభివృద్ధి సాధ్యపడుతుందని గుర్తు చేశారు. గడిచిన సర్పంచ్ ఎన్నికల్లో చాలా చోట్ల బీజేపీ అభ్యర్థులు గెలుపొందడం జరిగిందని, అదేవిధంగా రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ కౌన్సిలర్లు అత్యధిక స్థానంలో గెలుపొంది సత్తా చాటాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు దొందు దొందేనని, బీజేపీ పార్టీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యపడుతుందని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థులు పద్మిని, హర్షవర్ధన్ రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



అభివృద్ధి..సంక్షేమం మా తొలి ప్రాధాన్యత

- పటాన్ చెరు డివిజన్ అభివృద్ధికి సంపూర్ణ సహకారం
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- ఒక కోటి ఇరవై ఒక్క లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన.

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 4 : అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా పరిపాలన కొనసాగిస్తూ ప్రతి ఒక్కరిని అభివృద్ధిలో భాగస్వాములను చేస్తున్నామని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని జేపీ కాలనీ, ఎంజీ రోడ్డు, నందన్ రతన్ ప్రైడ్ కాలనీలలో ఒక కోటి 21 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, వరద నీటి తరలింపు డ్రైన్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరవేగంగా విస్తరిస్తున్న పటాన్ చెరు డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనతో పాటు అర్హులైన ప్రతి ఒకరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. సీసీ రోడ్లు, యుజిడీలు, పార్కులతోపాటు కమ్యూనిటీ హాళ్లు, మల్టీపర్పస్ ఫంక్షన్ హాళ్లు నిర్మిస్తూ ప్రజలకు మెరుగైన పరిపాలన అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, పృథ్వీరాజ్ , వెంకటేష్, పట్టణ పుర పెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'సనాతనం'పై దాడులను సహించం

మొదటిపేజీ తరువాయి

ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడైన తర్వాత మొదటి సారి తెలంగాణలో పర్యటించారు. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మహబూబ్ నగర్‌లో నిర్వహించిన బీజేపీ విజయ సంకల్ప సమ్మేళానికి హాజరయ్యారు. తెలంగాణ అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నానని, తెలంగాణ ఉద్యమంలో పోరాడిన వీరులకు నమస్కరిస్తున్నానని తెలిపారు. కొన్ని వర్గాలను సంతృప్తపరచడానికి కాంగ్రెస్ నేతలు ప్రయత్నం చేస్తున్నారని, ముస్లిం ఓటు బ్యాంకు కోసం కాంగ్రెస్ నేతలు ఆరాటపడుతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలనలో బలహీనవర్గాలకు ఎలాంటి న్యాయం జరగలేదని విమర్శించారు. వక్ఫ్ బోర్డును బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ సర్కారు యత్నిస్తోందని, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాల నిధుల్లో ప్రభుత్వం కోతపెడుతోందని ఆరోపించారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని, ఎన్నికల హామీలను ప్రభుత్వం తుంగలో తొక్కిందని, రైతు భరోసా, రుణమాఫీ, వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని ఆరోపించారు. ఎస్సీలు, ఆదివాసీలు, బీసీలను ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే బీజేపీని గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో కమీషన్ల పేరుతో ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అభివృద్ధి పనులు, బిల్లుల మంజూరుకు ఆర్ఆర్ ట్యాక్స్ కట్టాల్సిన దుస్థితి వచ్చిందని, బీజేపీకి అధికారం అప్పగించి అవినీతి, కమీషన్ల ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలించాలని పిలుపునిచ్చారు.

మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి భారీ విజయం అందించాలి

తెలంగాణకు సముచిత స్థాయిలో కేంద్రం నిధులు మంజూరు చేస్తోందని, తెలంగాణలో రైల్వేకు రూ.5400 కోట్లకు పైగా కేటాయించిందని అన్నారు. తెలంగాణకు మూడు హైస్పీడ్ రైల్ కారిడార్లు కేటాయించిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో రెండు పారిశ్రామిక కారిడార్ల నిర్మాణం జరుగుతోందని, ప్రపంచవ్యాప్తంగా ప్రధాని మోదీ ప్రభుత్వం పట్ల ఆదరణ పెరుగుతోందని తెలిపారు. పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు గెలుపు లక్ష్యంగా పని చేయాలని నితిన్ నబీన్ పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి భారీ విజయం అందించాలని కార్యకర్తలకు, ఓటర్లను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, ఎంపీ డీకె అరుణ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎదురేలేదు. మా విజయాన్నిఎవరూ అడ్డుకోలేరు. 3.17 కోట్ల మందికి సన్నబియ్యం ఇస్తున్నాం. సన్నబియ్యం వచ్చిన వారు కాంగ్రెస్‌కు ఓటేయాలి. ఆర్టీసీలో ఫ్రీగా ప్రయాణం చేస్తున్న వాళ్లంతా మాకు ఓటేస్తే బీజేపీ, బీఆర్ఎస్‌కు డిపాజిట్లు కూడా రావు.

- మిర్యాలగూడ సభలో సీఎం రేవంత్

ప్రాంతీయం

'ఫార్మా' పరిశోధనలో డా.ఆంజనేయులుకు పీహెచ్‌డీ



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 4 : ఫార్మాస్యూటికల్ పరిశోధనను విజయవంతంగా పూర్తిచేసిన హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ పరిశోధక విద్యార్థి పాటంశెట్టి ఆంజనేయులును డాక్టరేట్ వరించింది. 'ఎంచుకున్న ఔషధాల (ఇరినోటెకాన్, సునిటినిబ్) మెరుగైన క్యాన్సర్ నిరోధక సామర్థ్యం కోసం అల్ట్రాసౌండ్‌ఆధారిత నానోబబుల్ ఔషధ పంపిణీకి మార్గదర్శనం' అనే అంశంపై ఆయన అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శివకుమార్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. కొలొరెక్టర్ క్యాన్సర్ చికిత్సలో వైద్యపరంగా ఆమోదించబడిన క్యాన్సర్ నిరోధక మందులు, ఇరినోటెకాన్, సునిటినిబ్‌ల చికిత్సా సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి డెక్స్ట్రాన్‌ఆధారిత, అల్ట్రాసౌండ్‌ప్రతిస్పందించే నానోబబుల్లను అభివృద్ధి చేయడంపై డాక్టర్ ఆంజనేయులు పరిశోధన దృష్టిసారించినట్టు తెలియజేశారు. డాక్టర్ ఆంజనేయులు సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్డీ పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం విశ్వవిద్యాలయం, హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, పలు విభాగాల అధిపతులు, సిబ్బంది పలువురు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



42 డివిజన్లో కాంగ్రెస్ ప్రచారం

ప్రతిపక్షం, మంచిర్యాల, జనవరి 4: మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో 42వ డివిజన్లో బుధవారం చిందం సత్యవతి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇంటింటా ఓటర్లకు కలుస్తూ చేతి గుర్తుకు ఓటు వేయమని తెలిపారు. ఎమ్మెల్యే ప్రేమ సాగర్ రావు ఆధ్వర్యంలో డివిజన్ అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎల్లవేళలా వార్డు సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. నిరంతరం వార్డు ప్రజలతో కలిసి వారి సమస్యలను తెలుసుకొని ముందుకు సాగుతానన్నారు. డివిజన్ ప్రజలు తనను ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి అభివృద్ధిలో ముందు ఉండండి

ప్రతిపక్షం, మంచిర్యాల, ఫిబ్రవరి 4: మంచిర్యాల కార్పరేషన్ పరిధిలో బుధవారం 42, 43, 44 డివిజన్లలో డీసీసీ మాజీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ సుడిగాలి పర్యటన నిర్వహించారు. కార్పొరేషన్ వివిధ డివిజన్లు పర్యటిస్తూ తమ అభ్యర్థులను గెలిపించి అభివృద్ధిలో ముందుండాలని కోరారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు రాష్ట్రంలోనే మంచిర్యాల నియోజకవర్గాన్ని ముందుండే విధంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. అదేవిధంగా జరగబోయే కార్పొరేషన్ లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి నియోజకవర్గం మరింత వేగవంతం చేసేందుకు ఓటర్లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. 42 అభ్యర్థి అయిన చిందం సత్యవతిని, 43వ డివిజన్లో చిలువేరు జ్యోతిని, 44 డివిజన్లో కోమాకుల కిషన్ ను భారీ మెజారితో గెలిపించాలని కోరారు. కార్పొరేషన్ మరింత అభివృద్ధిలో నలిపేందుకు ప్రజలందరూ సహకరించి తమ అభ్యర్థులను గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఎన్నికల వార్డు ఇంచార్జ్ చిత్త సత్యనారాయణ, వార్డు ప్రజలు, అభిమానులు పాల్గొన్నారు.



56వ డివిజన్లో బీఆర్ఎస్ ప్రచారం

ప్రతిపక్షం, మంచిర్యాల, ఫిబ్రవరి 4: మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో 56 డివిజన్లో బీఆర్ఎస్ అభ్యర్థి కుందార రమేష్ బుధవారం ప్రచారాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా ఇంటింట తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేసి తను గెలిపించాలని కోరారు. డివిజన్లో ప్రజలందరికీ అందుబాటులో ఉండి సేవ చేసుకునే భాగ్యం తన కల్పించాలని అన్నారు. వార్డు ప్రజలతో మమేకమై ప్రజల సమస్యలు తీస్తానని తెలిపారు.



52 డివిజన్‌లో కోటగిరి స్వాతి ఇంటింట ప్రచారం

ప్రతిపక్షం, మంచిర్యాల, ఫిబ్రవరి 4: మంచిర్యాల కార్పొరేటర్ పరిధిలో 52వ డివిజన్లో బీజేపీ అభ్యర్థి కోటగిరి స్వాతి బుధవారం ఇంటింటా తన ప్రచారాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వార్డు ప్రజలు ఆశీర్వదిస్తే అభివృద్ధి చేస్తానని అన్నారు. కాంగ్రెస్ పాలన వల్ల తెలంగాణలో ఏ మార్పు రాలేదని వారి బతుకులు మారలేదని అన్నారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ రాష్ట్రానికి చేసింది ఏమి లేదని పేర్కొన్నారు. కేంద్రంలో బీజేపీ పార్టీ ప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో నడుస్తున్న ప్రతి స్కీములో కేంద్ర ప్రభుత్వం వాటా ఉందని తెలిపారు. తనని గెలిపిస్తే వార్డు ప్రజల సమస్యలను అందుబాటులో ఉండి తీరుస్తానని తెలిపారు. ఈనెల 11న జరిగే పోలింగ్లో కమలం పువ్వుకు ఓటు వేసి భారీ మెజార్టీతో తనను గెలిపించాలని వార్డు ప్రజలను కోరారు.





గ్రామీణ క్రీడాకారులను వెలుగులోకి తెచ్చేందుకే సీఎం కప్

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి.
- పటాన్ చెరు లో ఘనంగా ప్రారంభమైన నియోజకవర్గస్థాయి సీఎం కప్ క్రీడలు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 4 : రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలలో గల పాఠశాలల స్థాయిలో ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారిని ప్రోత్సహించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా సీఎం కప్ క్రీడోత్సవాలు నిర్వహిస్తోందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామంలో విద్యార్థి దశ నుండి క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా కార్యక్రమాలు చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు. బుధవారం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన సీఎం కప్ 20252026 పటాన్ చెరు నియోజకవర్గస్థాయి క్రీడలను క్రీడాజ్యోతి వెలిగించి ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి సంవత్సరం వివిధ క్రీడా అంశాలలో మైత్రి మైదానం వేదికగా జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ పరిధిలోని మండల స్థాయి క్రీడల్లో ఎంపికైన 400 మంది విద్యార్థులు నియోజకవర్గస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు సిఐ వినాయక్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, మండల విద్యాశాఖ అధికారులు నాగేశ్వరరావు నాయక్, రాములు, సుధాకర్, విజయ్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఘనంగా సామాజిక న్యాయ దినోత్సవం

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 4 : వివక్ష, అసమానతలకు తావు లేకుండా సమానత్వంతో కూడిన సమాజాన్ని నిర్మించడమే తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవం యొక్క ప్రధాన లక్ష్యమని అడిషనల్ కలెక్టర్ మాధురి పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి వర్గానికి సమాన హక్కులు, సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఫిబ్రవరి 4న తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవాన్ని అధికారికంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాధురి మాట్లాడుతూ, సామాజిక న్యాయం అనేది ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా అందరితో తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవ ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి జగదీష్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి విశాలాక్ష్మి, ఇతర జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



తక్షణమే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు కే.రాజయ్య.
- ఫిబ్రవరి 12న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 4 : మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక,కూలి, ప్రజ, రైతంగ వ్యతిరేక విధానాలను వెంటనే విరమించుకోవాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు కే.రాజయ్య డిమాండ్ చేశారు. పటాన్ చెరు పారిశ్రామిక వాడ లో గల పార్కర్ కార్మికుల గేట్ మీటింగ్ లో రాజయ్య మాట్లాడుతూ ఫిబ్రవరి 12వ తేదీన దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, కూలి, ప్రజ, రైతంగ వ్యతిరేక విధానాలను వెంటనే విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు, ఫిబ్రవరి 12 న జరిగే సమ్మె దేశభక్తి సమ్మెగా ఆయన అభివర్ణించారు. ప్రజల కోసం జరుగుతున్న సమ్మె అని ఆయన అన్నారు. ఈ సమ్మెలో కార్మికులు, ఉద్యోగులు లో. ఈ సమ్మె వివిధ కేంద్ర కార్మిక సంఘాలు మరియు వివిధ ఫెడరేషన్లు, ఇన్సూరెన్స్, బ్యాంకు, ఎంప్లాయిస్ సంఘాల ఆధ్వర్యంలో భారీ ఎత్తున సమ్మె జరగనున్నదని ఆయన అన్నారు, కార్మిక, ఉద్యోగ సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చాయని అన్నారు. మోడీ ప్రభుత్వం తక్షణమే లేబర్ కోడులను రద్దు చేయాలని, అలాగే ఉపాధి హామీ పథకం లో తెచ్చిన మార్పులను ఉపసంహరించుకోవాలని, విత్తన బిల్లును రద్దు చేయాలని, ఇన్సూరెన్స్ రంగంలో 100% ఎఫ్ డి ఐ రద్దు చేయాలని డిమాండ్ చేశారు, సమ్మె సందర్భంగా కార్మికులు వివిధ రూపాలలో పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని, సమ్మె రోజు పెద్ద ఎత్తున కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు పోచయ్య, సాయిలు, రాజు, కృష్ణ,, తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ జాతీయ అధ్యక్షుడిని కలిసిన ఎమ్మెల్సీ అంజిరెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 4 : బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ ను ఎమ్మెల్సీ డా. చిన్న మైల్ అంజిరెడ్డి కలిశారు. ఈ మేరకు బిజెపి జాతీయ అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా తెలంగాణ కు విచ్చేసిన నితిన్ నబిన్ ను బుధవారం హైదరాబాద్ లోని శంషాబాద్ ఇంటర్ నేషనల్ ఎయిర్ ఫోర్ట్ లో స్వాగతించి, ఆయన ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పార్టీ బలోపేతం, మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీ మంచి ఫలితాలు సాధించేలా కృషిచేయాలని సూచించిన్నట్లు అంజిరెడ్డి తెలిపారు.



దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

- ఐఎఫ్టీయూ పిలుపు

ప్రతిపక్షం గుండాల ఫిబ్రవరి 4: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ గుండాల మండలంలోని హమాలి కార్మికుల ఆధ్వర్యంలో గోడపత్రికలు ఆవిష్కరించారు. అనంతరం ఐఎఫ్టీయూ జిల్లా నాయకులు వ్యాసారపు వెంకన్న మాట్లాడుతూ.గత 12 సంవత్సరాల కాలంలో కేంద్ర ప్రభుత్వం ఒక్క ప్రజానుకూల చట్టాన్ని కూడా తీసుకురాలేదని, ప్రజలు అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక హక్కులను కాపాడే చట్టాలను రద్దు చేసి, కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. అలాగే మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని (ఎంజిఎన్ఆర్ఈజీఏ) రద్దు చేయడమే కేంద్ర ప్రభుత్వ గొప్ప విజయంగా భావిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, శ్రమదోపిడిని అరికట్టేందుకు ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ఐఎఫ్టీయూ జిల్లా నాయకులు గడ్డం నాగేష్, మెంతిని నాగేష్, అలాగే తాటి కృష్ణ, చేబోతు రవి, సత్తు ధనరాజ్, గడ్డం లాలయ్య పాల్గొన్నారు.అలాగే గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు చింతా నరసయ్య, చిరంజీవి, విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

రహస్య మార్గాల్లో గుట్కా సరఫరా

- మాఫియా పై చర్యలు ఎప్పుడు..?
- గుండాలలో గుట్కా అమ్మకాల జోరు

ప్రతిపక్షం, గుండాల, ఫిబ్రవరి 4: మండలంలో ప్రభుత్వం నిషేధించిన గుట్కా యథేచ్ఛగా విక్రయమవుతూ ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పుగా మారింది. అధికారికంగా గుట్కాపై నిషేధం ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అమలు కాని పరిస్థితి గుట్కా మాఫియాకు అనుకూలంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామం గ్రామంలో దుకాణాల ద్వారా, రహస్య మార్గాల్లో ఈ నిషేధిత గుట్కా అందుబాటులోకి వస్తుండటంతో, వినియోగదారుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది.ప్రత్యేకంగా యువత, కూలీలు, డ్రైవర్లు వంటి వర్గాలు గుట్కా అలవాటుకు లోనవుతూ తమ ఆరోగ్యాన్ని తామే ప్రమాదంలోకి నెట్టుకుంటున్నారు. దీని ప్రభావంతో క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు గురయ్యే అవకాశం ఉంది.ఈ గుట్కా వలన నోటి క్యాన్సర్,



గొంతు క్యాన్సర్ వంటి వ్యాధులు వచ్చే పరిస్థితి నెలకొంది. కుటుంబ పోషకులు అనారోగ్యానికి గురికావడంతో కుటుంబాల జీవనాధారం దెబ్బతింటోంది.ఇంతటి పరిస్థితి ఉన్నప్పటికీ గుట్కా విక్రయాలపై పర్యవేక్షణ లోపించిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం నిషేధం విధించినా అక్రమ రవాణా ఎలా కొనసాగుతోందన్న ప్రశ్నలు ప్రజల్లో ఉత్పన్నమవుతున్నాయి.ఈ విష సంస్కృతి కొనసాగుతోందన్నదానిపై సమగ్ర విచారణ చేయాలన్న డిమాండ్ పెరుగుతోంది.ప్రజారోగ్యంపై నేరుగా దాడి చేస్తున్న ఈ గుట్కా మాఫియాపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమంగా గుట్కా విక్రయించే దుకాణాలపై దాడులు, బాధ్యులపై కేసులు నమోదు చేయడం, రవాణా మార్గాలను గుర్తించి పూర్తిగా అడ్డుకోవడం వంటి చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు. అదే సమయంలో గుట్కా వల్ల కలిగే దుష్ప్రభావాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.ప్రభుత్వ నిషేధం ఉన్నా మండలంలో కొనసాగుతున్న గుట్కా వ్యాపారం, అమలు వ్యవస్థపై పెద్ద ప్రశ్నగా మారింది. ఇప్పటికైనా సంబంధిత శాఖలు స్పందించి గట్టి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.



తెలుగు సినీ పరిశ్రమకు ప్రభుత్వం పూర్తి ప్రాధాన్యం ఇస్తుంది. దేశవ్యాప్తంగా అన్ని భాషల సినిమా ఇండస్ట్రీలకు హైదరాబాద్‌ను కేంద్రంగా మార్చే దిశగా బ్లూ ప్రింట్ సిద్ధం చేస్తున్నాం. ఈ నెల 6 నుంచి గద్దర్ అవార్డుల స్క్రీనింగ్ ప్రారంభమవుతుంది. ఉగాది పండుగ రోజున అవార్డుల ప్రదానోత్సవం ఉంటుంది.

- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

ప్రాంతీయం

అభ్యర్థుల ఎంపికలో ఎవరి ప్రమేయం లేదు

- ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, ఫిబ్రవరి 4: అభ్యర్థుల ఎంపికలో ఎవరి ప్రమేయం లేదని, ఎలాంటి పైరవీలు జరగలేదని, ఎవరి వద్ద నుంచి డబ్బులు తీసుకోలేదని ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. కరీంనగర్ జిల్లాలో ఆయన పర్యటించారు.కాంగ్రెస్ పార్టీ పట్ల నిబద్ధతతో, ప్రజా సేవా భావంతో పనిచేసిన వారికే పార్టీ టికెట్లు కేటాయించామని తెలిపారు. ప్రజల మనోభావాలకు అనుగుణంగానే అభ్యర్థుల ఎంపిక జరిగిందన్నారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ విజయం రాష్ట్రానికి, ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీకి గొప్ప గుర్తింపును తీసుకొచ్చే విజయమని పేర్కొన్నారు. నాణ్యత గల నాయకులను రాష్ట్రానికి అందించిన జిల్లాగా కరీంనగర్ జిల్లా ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. దేశానికి వెన్నె తెచ్చిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు, జువారి చొక్కా రావు వంటి గొప్ప నేతలు ఈ జిల్లా నుంచే వచ్చారని గుర్తు చేశారు. ‘‘మనం కార్పొరేషన్‌ను గెలుచుకుంటున్నాం అనే మనోధైర్యంతో అభ్యర్థులంతా తమ గెలుపు కోసం కృషి చేయాలి. అన్ని పార్టీల కంటే కాంగ్రెస్ ప్రచారంలో ముందుండాలి. పట్టుదలతో, కసితో గెలవాలనే లక్ష్యసాధన ప్రతి అభ్యర్థిలో ఉండాలి’’ అని సూచించారు.కార్పొరేషన్‌లోని 66 డివిజన్లకు సంబంధించి 340కు పైగా దరఖాస్తులు వచ్చాయని, వాటిలో 66 మందికి మాత్రమే టికెట్లు కేటాయించామని తెలిపారు. టికెట్లు ఆశించిన వారు ఎంతోమంది ఉన్నప్పటికీ, సమర్థులైన వారికి పార్టీ తప్పకుండా న్యాయం చేస్తుందన్నారు.కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ వారిని విస్మరించబోమని స్పష్టం చేస్తూ, జిల్లా పరిషత్, సుడా, సింగిల్ విండో, గ్రంథాలయాలు తదితర నామినేటెడ్ పదవుల్లో అర్హులైన వారికి తప్పకుండా అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.



నేడు ముఖ్యమంత్రి పర్యటన

- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, సీపీ

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, ఫిబ్రవరి 4: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 5న కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం గుమ్లాపూర్ లో బహిరంగ సభకు హాజరు కానున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, జిల్లా అధికారులతో కలిసి బుధవారం ఏర్పాట్లను పరిశీలించారు. చొప్పదండి మండలం గుమ్లాపూర్ పరిధిలోని ప్రాంతాన్ని సీఎం సభాస్థలిగా ఎంపిక చేసిన నేపథ్యంలో కలెక్టర్ , సీ.పీ క్షేత్రస్థాయిలో ఆ ప్రాంతాన్ని సందర్శించి ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. సీఎం పర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. హెలిప్యాడ్, వేదిక తదితర వాటి ఏర్పాట్లను నిర్ణీత గడువు కంటే ముందుగానే పూర్తి చేయాలన్నారు. బహిరంగ సభకు వచ్చే వారు వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు అనువైన స్థలాన్ని ఎంపిక చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి భద్రతకు పకడ్బందీ బందోబస్తును ఏర్పాటు చేయాలని, సీ.ఎం పర్యటన నేపథ్యంలో ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఆయా శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో పని చేయాలని అన్నారు. ముందస్తుగానే ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని సూచించారు.

సీఎం బహిరంగ సభను విజయవంతం చేయండి

- మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, ఫిబ్రవరి 4: ఉమ్మడి కరీంనగర్ జిల్లా లో నిర్వహించే సీఎం రేవంత్ రెడ్డి సభ ను విజయవంతం చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపు నిచ్చారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా మున్సిపల్ కార్పొరేషన్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా చొప్పదండి నియోజకవర్గం గుమ్లాపూర్ గ్రామంలో మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించనున్న బహిరంగ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, డిసిసి అధ్యక్షులు, కార్పొరేషన్ చైర్మన్ లు, ముఖ్య నేతలు హాజరుకానున్నారని తెలిపారు. బహిరంగ సభకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో పాటు మున్సిపల్ కార్పొరేషన్ లలో కాంగ్రెస్ పార్టీ పక్షాన పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ డివిజన్ నుండి పెద్ద ఎత్తున్న ప్రజలను, కార్యకర్తలను బహిరంగ సభకు తరలించి, సీఎం బహిరంగ సభ విజయవంతంకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

నేడు ఎల్లాపూర్ విద్యుత్ వినియోగదారుల సదస్సు

ప్రతిపక్షం, హనుమకొండ, ఫిబ్రవరి 4: ఎల్లప్పుడు విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణంలో గురువారం ఉదయం 10 :30 గంటలకు నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహిస్తున్నట్లు వరంగల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్ పర్సన్ ఎస్‌వీ వేణుగోపాల చారి, శిరీష్ కుమార్ తెలిపారు. ఎల్లాపూర్ విద్యుత్ సబ్ స్టేషన్ లో ఏర్పాటుచేసిన విద్యుత్ వినియోగదారుల కోర్టులో తమ సమస్యలు వివరించి పరిష్కారం పొందాలని కోరారు.



తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, ఫిబ్రవరి 4: శాయంపేట తహసిల్దార్ కార్యాలయాన్ని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎస్. రవి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూభారతి, సాదాబైనామా, జాతీయ రహదారులు, మీ సేవా సర్టిఫికెట్స్, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, తదితర రికార్డులను అదనపు కలెక్టర్ పరిశీలించారు. మండలానికి సంబంధించి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియ ఎంతవరకు పూర్తయిందని తహసిల్దార్ ప్రవీణ్ కుమార్ ను అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సర్టిఫికెట్స్ త్వరితగతిన జారీ చేయాలని తహసిల్దార్ ను ఆదేశించారు. పరకాల ఆర్డీఓ డాక్టర్ కన్నం నారాయణ, ఎంపీడీవో ఫణి చంద్ర, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



కార్పొరేషన్‌పై గులాబీ జెండా ఎగరవేస్తాం

- బీఆర్ఎస్ హయంలో ఎనలేని అభివృద్ధి చేసినం
- నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 4 : మున్సిపల్ కార్పొరేషన్ పై గులాబీ జెండా ఎగరవేస్తామని నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల అన్నారు. బుధవారం రాత్రి నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్ఆర్ చౌరస్తా మున్నూరు కాపు సంఘం వద్ద 7, 8, 26, 27, 50 డివిజన్ల కార్నర్ మీటింగ్ నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాల కాలంలో 50 సంవత్సరాల అభివృద్ధి చేసి చూపించిందన్నారు. హైదరాబాద్ తర్వాత నిజామాబాదులోనే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి చేసి చూపించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటివరకు ఒక్క పని కూడా చేయని పరిస్థితి నెలకొందని, సెంటర్ మీడియన్ పనులు, మధ్యలో మొక్కలు నాటి పచ్చదనంతో పాటు సుందరీ చేసిన ఘనత బీఆర్ఎస్ దేనని అన్నారు. బీఆర్ఎస్ హయంలో దేశంలో తెలంగాణ రాష్ట్రం నెంబర్ వన్ స్థానంలో ఉంటే తెలంగాణలో నిజామాబాద్ నీ నెంబర్ వన్ స్థానానికి తీసుకువచ్చిన ఘనత మాదేనని, బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ప్రతి డివిజన్లో సిసి రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఓటు కోసం వస్తే మీకు కళ్యాణ్ లక్ష్మి, తులం బంగారం ఇస్తే ఓటు వేయండి, మహిళలకు స్కూటీ ఇస్తే వెయ్యండి, పెన్షన్ రూ.4000 ఇస్తే ఓటు వేయండని అన్నారు. నిజామాబాద్ జిల్లాలో నూతన కలెక్టరేట్ తో పాటు, ఐటీ హబ్, నాక్ బిల్డింగ్లను నిర్మించిన ఘనత బిఆర్ఎస్ దన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థులను ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 7 డివిజన్ అభ్యర్థి బగ్గలి అజయ్, 8 డివిజన్ అభ్యర్థి దండు చంద్రశేఖర్, 26వ డివిజన్ అభ్యర్థి సిర్ప రాజు, 27వ డివిజన్ అభ్యర్థి సుధా, 50వ డివిజన్ అభ్యర్థి రంగు అపర్ణ, బిఆర్ఎస్ కార్యకర్తలు నగర ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



అవినీతి రహిత ఇందూరుగా తీర్చిదిద్దుతా

- అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 4: నిజామాబాద్ నగరాన్ని అవినీతి రహిత ఇందూరుగా తీర్చిదిద్దుతానని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు. బుధవారం రాత్రి నగరంలోని 38వ డివిజన్ అరుంధతి నగర్ లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి పోతంకర్ మౌనికకు మద్దతుగా నిర్వహించిన కార్నర్ మీటింగ్ లో అర్బన్ ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గత అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలలో ఏ ఒక్కటి కూడా నెరవేర్చని అసమర్థత ప్రభుత్వం అని ఎమ్మెల్యే విమర్శించారు. మన ఇందూర్ మన మేయర్ అని బీజేపీ పార్టీ చెబుతేనే ఇతర పార్టీలకు గుబులు పుడుతుందని ఆయన అన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒక వర్గానికి భయపడి వారి నోటి నుండి ఇందూరు అని పేరు కూడా పలకడం లేదని తీవ్రంగా విమర్శించారు. ముఖ్యంగా కాంగ్రెస్, మైనార్టీ, ఎంఐఎం పార్టీలు చీకటి ఒప్పందం కుదుర్చుకున్నారని పేర్కొన్నారు. ఇక గత పదేళ్లు పాలించి పెద్దపెద్ద మాటలు చెప్పి ఒక్క నిరుపేదకు కూడా డబుల్ బెడ్ రూమ్ అందివ్వని చేతకాని మాజీ ఎమ్మెల్యే గణేష్ గుప్తా అని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే హయాంలో అవినీతి కమీషన్లకు, కాంట్రాక్టర్లకు ప్రాధాన్యం ఇవ్వడమే తప్ప ఆయన హయాంలో చేసింది ఏమీ లేదని ఎమ్మెల్యే దుయ్యబట్టారు. ఇక కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలలో ఏ ఒక్కటి అమలు చేయని రేవంత్ రెడ్డి ఏ మొహం పెట్టుకుని ఈ నెల 6న జిల్లాకు వస్తున్నారని విమర్శించారు. బరాబర్ ఈ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలని భారతీయ జనతా పార్టీ ఒక ఛాలెంజ్ లా తీసుకొని మెజార్టీ స్థానాల్లో గెలిచి మేయర్ పీఠం తప్పక కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతంకర్ లక్ష్మీనారాయణ, దుబ్బ మండల అధ్యక్షులు గడ్డం రాజు, రంజిత్, విగ్నేష్, ముందదా పవన్, బొబ్బిడి శ్రీను, రాకేష్, బీజేపీ నాయకులు మరియు పెద్ద ఎత్తున 38 వ డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.



ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, ఫిబ్రవరి 4: జిల్లాలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ర్యాండమైజేషన్ విధానంలో రెండవ దశ సిబ్బంది కేటాయింపు పూర్తయింది. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్, ఎన్నికల సాధారణ పరిశీలకులు జి.జితేందర్ రెడ్డి సమక్షంలో ర్యాండమైజేషన్ పూర్తయింది. కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఈ ప్రక్రియ అనంతరం ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకాడే మున్సిపల్ కమిషనర్, ఎన్నికల నోడల్ అధికారులతో సమీక్షించారు. ఎన్నికలు జరిగే పట్టణాల్లో, నగరంలో బ్యాలెట్ బాక్సులు, విధులు నిర్వహించే సిబ్బంది, ఎన్నికల సంబంధించిన ఏర్పాట్లపై చర్చించారు. బ్యాలెట్ బాక్సులు, సిబ్బంది రవాణా ఏర్పాట్లు, పోలింగ్ స్టేషన్లో సౌకర్యాలపై సమీక్షించారు. ఆడిట్ అబ్జర్వర్ ఎం.మనోహర్ పాల్గొన్నారు.



బోధన్ ఏసీపీ కార్యాలయం తనిఖీ

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 4: నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య బుధవారం బోధన్ ఏసీపీ కార్యాలయం లో తనిఖీలు చేశారు. ప్రస్తుతం మున్సిపల్ ఎన్నికలు సజావుగా నిర్వహణకు అన్ని ముందస్తూ ఏర్పాట్లు చేయాలని, పాత నేరస్తులను గుర్తించి బైండోవర్ చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. ప్రతీ పోలింగ్ స్టేషన్ సిబ్బంది కు కనీస వసతులు కల్పించే విధంగా చూడాలని, ఏసీపీ కార్యాలయంలోని రికార్డులు, అండర్ ఇన్వేస్టిగేషన్ కేసులపై విపులంగా తనిఖీలు చేసి ప్రతీ కేసుకి ఒక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఏర్పాటు చేసి నాన్యమైన ధర్యాప్తు చేయాలని సూచించారు. సబ్ డివిజన్లోని అన్నీ పోలీస్ స్టేషన్ పరిధిలో సైబర్ క్రైమ్ అవగాహణ పాఠశాలలు, కళాశాలలలో సోషల్ మీడియా ద్వారా అవగాహణ నిర్వహించాలన్నారు. సబ్ డివిజన్ పరిధిలని అన్ని పోలీస్ స్టేషన్ల పరిసరాల ను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. సబ్ డివిజన్ లోని అన్నీ పోలీస్ స్టేషన్ల సిబ్బంది ఎప్పుడు హెడ్ క్వార్టర్స్ యందు అందుబాటులో ఉండే విధంగా ఉండాలని , ప్రతీ 6 నెలలకు ఒకసారి హెల్త్ చెకప్ చేసుకోవాలని, ద్విచక్రవాహణం నడిపే సమయంలో హెల్మేటు తప్పనిసరిగ్గా ధరించాలని సూచించారు. ఈ సందర్భంగా బోధన్ ఏసీపీ శ్రీనివాస్ , బోధన్ ఎస్.హెచ్.ఓ వెంకట్ నారాయణ, బోధన్ రూరల్ సీఐ డి. విజయ్ బాబు , రుద్రూర్ సీఐ కృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, ఫిబ్రవరి 4: ప్రతి సామాజిక వర్గానికి సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం అని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. బుధవారం తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమారంలో ఉన్న ప్రభుత్వ బీసీ బాలికల కళాశాల వసతి గృహం(ధర్మ సాగర్)లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సామాజిక న్యాయ దినోత్సవాన్ని నిర్వహించగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ సమాజంలోని ప్రతి వర్గానికి సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఆ లక్ష్య సాధనలో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, విద్యా సంస్థలు కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వెనుకబడిన, అణగారిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, విద్యా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలని కలెక్టర్ ససంక్షేమ, విద్యా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలని కలెక్టర్ సూచించారు. బాలికలు ఆర్థికాభివృద్ధిని సాధించాలని అన్నారు. ఆర్థిక స్వాతంత్ర్యం సాధించిన తర్వాతనే బాలికలు వివాహం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులతో సామాజిక న్యాయం, సమానత్వం, సమగ్ర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి నరసింహస్వామి, హసన్ పర్తి తహసిల్దార్ కిరణ్ కుమార్, అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్ సంపూర్ణ, వసతి గృహ వార్డెన్ ప్రియాంక, అధ్యాపకులు, కళాశాల వసతిగృహం విద్యార్థినులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాలను సందర్శించిన జనరల్ అబ్జర్వర్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 4: భీంగల్ మున్సిపాలిటీ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సాధారణ పరిశీలకులు సీహెచ్.సత్యనారాయణ రెడ్డి బుధవారం సందర్శించారు. ఆయా పోలింగ్ స్టేషన్లలో అందుబాటులో ఉన్న సదుపాయాలు పరిశీలించారు. ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ప్రతి పోలింగ్ స్టేషన్ లో మౌలిక వసతులు అందుబాటులో ఉండాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్ లను, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాల్ లను సైతం పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. అంతకుముందు భీంగల్ లో ఎస్.ఎస్.టీ బృందాలు నిర్వహిస్తున్న తనిఖీల ప్రక్రియను పరిశీలించారు. అబ్జర్వర్ వెంట మున్సిపల్ కమిషనర్ గంగాధర్, సంబంధిత అధికారులు ఉన్నారు.



“పార్టీ టికెట్ ఒక్కరికే వస్తుందని, అందరూ ఐక్యంగా విజయానికి పనిచేయాలి. అభ్యర్థులు అందరినీ కలుపుకొని వెళ్లాలి. ప్రతి ఓటూ ముఖ్యమే. ఇంటింటికీ తిరిగి ఓట్లడగాలి. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఆనవాళ్లు కనిపించకుండా చేయాలి. గెలుస్తామన్న నమ్మకంతో ఇక్కడ ప్రచారాన్ని ప్రారంభించానని వివరించారు.

- మిర్యాలగూడలో సీఎం రేవంత్

ప్రాంతీయం



ప్రభుత్వ పాఠశాలల్లో ప్రహరీ గోడల, మరుగుదొడ్ల నిర్మాణం

యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి

- **జిల్లా కలెక్టర్ కె. హైమావతి**

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, ఫిబ్రవరి 4: జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రహరీ గోడల నిర్మాణం, అవసరమైన చోట్ల మరుగుదొడ్ల నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు.బుధవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కింద జిల్లాలో కొనసాగుతున్న పనులు, ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలో చేపట్టిన అంగన్వాడీ భవనాలు, గ్రామ పంచాయతీ భవనాలు, సబ్ సెంటర్లు, మహిళా సమాఖ్య భవనాలు, ఫుడ్ గ్రెయిన్ స్టోరేజ్ గోదాములు, పాఠశాలల ప్రహరీ గోడలు, మరుగుదొడ్ల నిర్మాణాలపై చర్చించారు. పాఠశాలల భద్రత, పరిశుభ్రత దృష్ట్యా ఈ పనులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు.మంజూరైన ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పనులను త్వరితగతిన పూర్తి చేసి నిధులను సద్వినియోగం చేసుకోవాలని, స్థలం ఉండి పనులు ప్రారంభం కాని చోట్ల వెంటనే పనులు మొదలు పెట్టాలని తెలిపారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ప్రతి వారం పురోగతి సాధించి, ఈ నెలాఖరులోగా పనులు పూర్తిచేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో డీఆర్డీఓ జయదేవ్ ఆర్య, పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను గెలిపిస్తే నగరాన్ని దోపిడీ చేస్తారు

- **హిందుత్వం మా డీఎన్ఏ లోనే ఉంది**
- **ఎంపీ అర్వింద్ సంచలన వ్యాఖ్యలు**



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 4 : నగరంలో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న ఓ అభ్యర్థిని గెలిపిస్తే నగరాన్ని దోచుకుంటారని ఎంపీ అర్వింద్ అన్నారు. బుధవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ మేయర్ అభ్యర్థి శమంత నరేందర్ రెడ్డి అని ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. దీనిపై స్పందిస్తూ 2009 నుంచి ఓ హోటల్ కు సంబంధించిన రూ.8.16 కోట్ల భారీ ఆస్తి పన్నును నరేందర్ రెడ్డి కట్టలేదన్నారు. కేవలం ఎన్నికల కోసం ఆ బకాయిలు కట్టారన్నారు. మున్సిపల్ అధికారులను మేనేజ్ చేసుకుంటూ ఇన్ని రోజులు పన్ను కట్టలేదని విమర్శించారు. ఆయన ఇన్ని రోజులు డబ్బులు లేక కాదని నిజాయితీ లేక డబ్బులు కట్టలేదన్నారు. ఇప్పుడు ఎన్నికల్లో పోటీ చేయడానికి ఒకేసారి రూ.8.16 కోట్ల బకాయిలు చెల్లించారన్నారు. అంత డబ్బు ఒకేసారి ఎలా వచ్చిందని ప్రశ్నించారు. అలాంటి వారు నగర మేయర్ అయితే నిలువు దోపిడీ చేస్తారని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి 17 ఏళ్లుగా కట్టని బకాయిలను 17 గంటల్లో ఎలా కట్టారని ప్రశ్నించారు. నరేందర్ రెడ్డికి నైతికత, బాధ్యత లేదని విమర్శించారు. ఇలాంటి వారిని ఓటుతో శిక్షించాలన్నారు. 19వ డివిజన్‌లో కాంగ్రెస్ కు డిపాజిట్ రాకుండా చేయాలని ఆయన కోరారు. 59 వార్డుల్లో కాంగ్రెస్‌కు డిపాజిట్ ఇచ్చిన సరే కానీ.. 19వ వార్డులో మాత్రం ఇవ్వొద్దని ఆయన నగర ప్రజలను కోరారు. ఎన్నికలప్పుడు బీజేపీకి హిందుత్వం, ఇందూరు గుర్తుకు వస్తాయని కాంగ్రెస్ విమర్శలు చేయడంపై ఎంపీ అర్వింద్ కౌంటర్ ఇచ్చారు. హిందుత్వం తమ డీఎన్ఏ లోనే ఉందని అన్నారు. అది తమ జీవన విధానం అని చెప్పారు. హిందుత్వం కోసం తాము రాజకీయాలు చేయమన్నారు. కాంగ్రెస్ అవినీతి కోసం రాజకీయాలు చేస్తోందన్నారు. నిజామాబాద్ కాంగ్రెస్ లో పరిణితి చెందిన నాయకుడు ఎవరైనా ఉన్నారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ మేయర్ అభ్యర్థి ఎవరని అర్వింద్ ప్రశ్నించారు.

నగరాన్ని అభివృద్ధి చేస్తాం

కాంగ్రెస్ హిందూ వ్యతిరేక పార్టీ కావడంతోనే తాను బీజేపీలో చేరానన్నారు. తన తండ్రి డీఎస్ ను అవమానించి పార్టీ నుంచి బయటకు పంపారన్నారు. తాము గెలిస్తే నగర అభివృద్ధి కోసం పని చేస్తామని స్పష్టం చేశారు. ప్రతి రూపాయిని ప్రజల సమస్యల పరిష్కారానికి ఖర్చు చేస్తామన్నారు. బీజేపీలో అవినీతి ఆరోపణలు ఉన్న వారికి టికెట్లు ఇవ్వలేదని ఎంపీ వెల్లడించారు. 18 మంది సిట్టింగ్‌లకు టికెట్లు ఇవ్వలేదని చెప్పారు. తమ మేయర్ అభ్యర్థిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నిర్ణయిస్తారన్నారు. తాము గెలిస్తే అందరి దగ్గర ఆస్తి పన్ను బకాయిలు వసూలు చేస్తామన్నారు. ప్రముఖ హోటళ్లను సైతం వదిలిపెట్టమని స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నాచగిరిలో బ్రహ్మోత్సవాల టెండర్ల నిర్వహణ

ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 4: వర్గల్ మండలం నాచారం గుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కార్యాలయంలో బుధవారం కొబ్బరికాయలు పూజా సామాగ్రి అమ్ముకొనే హక్కు మరియు బ్రహ్మోత్సవములు 2026 నకు సంబంధించిన తక్కువ ధరకు వివిధ అంశములకు టెండర్లు కార్యనిర్వాణాధికారి రంగాచారి ఆధ్వర్యంలో సిద్దిపేట డివిజన్ దేవాలయం ఎండోమెంట్ అధికారి విజయలక్ష్మి పర్యవేక్షణలో నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు కొత్తపల్లి శ్రీనివాస్, నాయకం శ్రీనివాస్ మరియు చందా నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



నితిన్ నబిన్‌కు స్వాగతం పలిన మెదక్ ఎంపీ

ప్రతిపక్షం, చేగుంట, ఫిబ్రవరి 4: భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులుగా ఎన్నికైన నితిన్ నబిన్ హైదరాబాద్ కు విచ్చేసిన సందర్భంగా మెదక్ ఎంపీ మాధవినేని రఘునందన్ రావు ఘన స్వాగతం పలికారు. తొలిసారిగా తెలంగాణ రాష్ట్రానికి విచ్చేసిన సందర్భంగా శంషాబాద్ విమానాశ్రయంలో భాజాపా నేతలతో కలిసి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులతోపాటు మెదక్ జిల్లాకు చెందిన భాజపా నాయకులు పాల్గొన్నారు.



ఎన్నికల ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ సమీక్ష

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 4: మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత అధికారులతో బుధవారం సమీక్ష జరిపారు. నగర పాలక సంస్థ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, డిస్ట్రిబ్యూషన్, పోలింగ్ ఏర్పాట్ల గురించి కమిషనర్ దిలీప్ కుమార్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో బ్యాలెట్ పేపర్లు, పోస్టల్ బ్యాలెట్ ముద్రణ గురించి ఆరా తీశారు. గోప్యతను పాటిస్తూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ముద్రణ జరిపించాలని, పోలీసు భద్రత మధ్యన స్ట్రాంగ్ రూమ్ లకు తరలించి జాగ్రత్తగా భద్రపరచాలని ఆదేశించారు. బ్యాలెట్ పత్రాల ముద్రణ పూర్తయిన మీదట వివరాలు ఎక్కడ కూడా బయటకు వెల్లడి కాకుండా చూడాలని, ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులు ముద్రణ అనంతరం సాఫ్ట్ కాపీలను పూర్తిస్థాయిలో హార్డ్ డిస్క్ నుండి కూడా తొలగించేలా పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ విషయంలో నిబంధనలను ఉల్లంఘించే వారిపై ఎన్నికల సంఘం క్రిమినల్ చర్యలు చేపడుతుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని బ్యాలెట్ పత్రాల ముద్రణ విషయంలో ఎంతో అప్రమత్తతో వ్యవహరించాలని అన్నారు. కాగా, పోలింగ్ కేంద్రాలలో కనీస సదుపాయాలను మరోమారు క్షేత్రస్థాయిలో సరిచూసుకోవాలని సూచించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు అదనంగా పోలింగ్ సిబ్బందిని కేటాయిస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల పరిధిలోని పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్ జరిపిస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు. పోలింగ్ ముగిసిన వెంటనే గట్టి బందోబస్తు మధ్యన బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ సెంటర్ కు తరలించేలా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు సూచించారు. ఎలాంటి తప్పిదాలు, లోటుపాట్లకు తావులేకుండా, ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమీక్షలో డీ.ఆర్.డీ.ఓ సాయాగౌడ్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.





చిన్నారులపై వీధి కుక్కల దాడి

- **స్కూలుకు వెళ్తున్న విద్యార్థికి, ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారికి తీవ్ర గాయాలు**

ప్రతిపక్షం, దౌల్తాబాద్ ఫిబ్రవరి 4: పాఠశాలకు వెళుతున్న విద్యార్థిపై, ఇంటి ఆడుకుంటున్న చిన్నారిపై వీధి కుక్కలు దాడి చేయడంతో తీవ్ర గాయాలైన సంఘటన దౌల్తాబాద్ మండలంలోని కోనాపూర్, గోవిందపూర్ గ్రామాల్లో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. బాధ్యత కుటుంబ సభ్యులు, 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. దౌల్తాబాద్ మండల పరిధిలోని కోనాపూర్ గ్రామానికి చెందిన మైలు గారిచంద్రయ్య కొడుకు మైలు గారి మనోజ్ (12)దౌల్తాబాద్ మండల కేంద్రంలోని జడ్పీ బాలుర పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. మనోజ్ దౌల్తాబాద్ కు వెళ్లి పాఠశాల బస్సు మిస్ అవ్వడంతో కోనాపూర్ నుంచి నడుచుకుంటూ దౌల్తాబాద్ జడ్పీ బాలుర పాఠశాలకు వస్తున్న క్రమంలో మనోజ్ పై ఒక్కసారిగా వీధి కుక్క దాడి చేయడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108 టెక్నీషియన్ భాను ప్రకాష్, పైలెట్ నరసింహులు సంఘటన స్థలానికి చేరుకొని బాధితుని 108 అంబులెన్స్ లో గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గోవిందపూర్ లో చిన్నారిపై వీధి కుక్క దాడి

ఇంటి ముందర ఆడుకుంటున్న చిన్నారిపై వీధి కుక్క దాడి చేయడంతో చిన్నారికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. గోవిందపూర్ గ్రామానికి చెందిన ఉప్పల కృష్ణ కూతురు అద్విక (3) చిన్నారి ఇంటి ముందర ఆడుకుంటుండగా ఒక్కసారిగా వీధి కుక్క దాడి చేయడంతో చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న 108 టెక్నీషియన్ భాను ప్రకాష్ పైలట్ నర్సింలు సంఘటన స్థలానికి చేరుకొని చిన్నారి అద్వికను గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. వీధి కుక్క దాడిలో గాయాలైన బాధిత తల్లిదండ్రులు మాట్లాడుతూ. గ్రామాల్లో వీధి కుక్కల సంచారం చాలా ఎక్కువైందని దీంతో ప్రజలు బయటికి వెళ్లాలన్న గ్రామస్తులు జంకుతున్నారన్నారు. సంబంధిత అధికారులు గ్రామాల్లో కుక్కలను షెల్టర్ హోమ్లకు తరలించాలని కోరారు.



మున్సిపాలిటీ ఎన్నికల్లో ఓటు విలువ తగ్గుతోందా?

- **గజ్వేల్ ప్రగతి ఫౌండేషన్**

ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 4: త్వరలో జరగనున్న మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో ఓటు విలువ, పట్టణ భవిష్యత్తుపై ప్రగతి ఫౌండేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. పట్టణ అభివృద్ధికి స్పష్టమైన మ్యానిఫెస్టోలు లేకుండా, నీరు, రోడ్లు, పారిశుద్ధ్యం, విద్య, ఆరోగ్యం, యువత ఉపాధి, మహిళల భద్రత వంటి అంశాలపై చర్చ లేకపోవడం బాధాకరమని పేర్కొంది. అభివృద్ధి రాజకీయాల స్థానంలో మద్యం, చికెన్ బిర్యానీ ద్వారా ఓట్లు కొనుగోలు చేసే ప్రయత్నాలు ప్రజాస్వామ్యానికి హానికరమని, మైనర్ పిల్లలను కూడా ఈ అలవాట్ల వైపు లాగడం అత్యంత దురదృష్టకరమని విమర్శించింది. ఇవి ఒక్కరోజు ఆనందాన్ని ఇవ్వవచ్చని, కానీ కుటుంబాల శాంతి, యువత భవిష్యత్తు, పట్టణ అభివృద్ధిని నాశనం చేస్తాయని తెలిపింది. ఓటు అమ్ముకునే వస్తువు కాదని, అది ప్రతి పౌరుని హక్కు, బాధ్యత అని స్పష్టం చేసింది. మద్యం ఆధారిత రాజకీయాలు కాకుండా, అభివృద్ధి, విలువలతో కూడిన నాయకత్వం కావాలని పిలుపునిచ్చింది. ఈ ఎన్నికల్లో ఓటును బిర్యానీకి కాదు, పిల్లల భవిష్యత్తుకు వేయాలని ప్రజలకు సూచించింది.



ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణే ధ్యేయం

- **గజ్వేల్ ఏసీపీ నర్సింలు**

ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 4: జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో గజ్వేల్ పట్టణంలో శాంతిభద్రతలను పరిరక్షించేందుకు మరియు ఓటర్లలో ధైర్యాన్ని నింపేందుకు గజ్వేల్ ఏసిపి నర్సింలు నేతృత్వంలో పోలీసులు భారీ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. మార్చ్ స్థానిక పోలీస్ స్టేషన్ నుండి ప్రారంభమై, మెయిన్ రోడ్డు, పల్లెపాడు, వేములగట్టు మరియు ఆర్ అండ్ ఆర్ కాలనీ మీదుగా కొనసాగింది. ఈ కవాతులో సివిల్ పోలీసులు, రిజర్వ్ పోలీస్ బలగాలు మరియు సాయుధ దళాలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాయి. ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూస్తామని, ప్రజలు భయం లేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఏసిపి నర్సింలు సూచించారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమించే వారిపై, ఓటర్లను ప్రలోభపెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణంలో ఇప్పటికే నిఘాను పెంచామని, ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ట్రైనీ ఐపిఎస్ అయేషా ఫాతిమా, గజ్వేల్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, ఇన్స్పెక్టర్లు లతీఫ్ , ముత్యం రాజు , ఎస్ఐలు , గజ్వేల్ డివిజన్ పోలీస్ బృందం పాల్గొన్నారు.





పార్లమెంట్ సమావేశాల సమయంలో ప్రతిపక్షాల గొంతు నొక్కడం ప్రభుత్వానికి పరిపాటిగా మారింది. ప్రభుత్వం భయపడుతుంది కాబట్టే ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని సభలో మాట్లాడనివ్వడం లేదు. పార్లమెంటు అనేది ప్రజాస్వామ్య దేవాలయం, అక్కడ తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తే అభ్యంతరం ఏంటి.

- కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ.

'రామరాజు' భక్త రామదాసుకు వారసుడు

- **భద్రాచల దేవస్థాన ఏఈవో శ్రవణ్ కుమార్**

ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 4: భద్రాచలంలో సీతారాముల కళ్యాణంలో గోటితో ఒలిచిన వడ్లనే వాడడం ఆనవాయితీ, ఈ గోటి తలంబ్రాల కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణ వాస్తవ్యుడు శ్రీరామకోటి భక్త సమాజం ధార్మిక సంస్థకు 4వ సారి చోటు కల్పించారు. బుధవారం నాడు 3క్వింటాల్ల వడ్లకు ప్రత్యేక పూజలు జరిపి రామకోటి రామారాజును ఘనంగా సన్మానించారు భద్రాచల దేవస్థాన ఏఈవో శ్రవణ్ కుమార్. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 30 సంవత్సరాలనుండి రామ నామాన్ని ప్రతి భక్తునిచే కొట్లాది సంఖ్యలో రామ నామాలను లిఖింపజెపించడంలో కృషి, పట్టుదల అమోఘం అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, గ్రామాన తిరిగి లక్షల మంది భక్తులచే రామానమ స్మరణ చేయించి గోటితో వడ్లను ఒలిపించి భక్తితో 3సార్లు కల్యానానికి అందించారన్నారు. గోటి తలంబ్రాలు అందజేసే బృహత్తర కార్యక్రమం చేబట్టి పలువురుకు ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ప్రతినిధులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ లో చేరిన పాల్దా సర్పంచ్, బీఆర్ఎస్ నాయకులు



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 4 : నిజామాబాద్ రూరల్ మండలం పాల్దా గ్రామ సర్పంచ్, ఉప సర్పంచులు ఖానాపూర్ బీఆర్ఎస్ నాయకులు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సమక్షంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ లో చేరారు. నిజామాబాదు నగరంలోని రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిజామాబాద్ మండలం పాల్దా గ్రామ సర్పంచ్ మున్నూరు ప్రభాకర్, ఉప సర్పంచ్ మల్లారం రమేష్ లు ఖానాపూర్ గ్రామ బీఆర్ఎస్ నాయకులు మోహన్ కాంగ్రెస్ కండువా కప్పుకొని పార్టీ లో చేరారు. ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ పాల్దా గ్రామం అంటేనే వ్యవసాయం, రాజకీయమన్నారు.గత పాలకుల చేతిలో పాల్దా గ్రామం, ఖానాపూర్ డివిజన్ లు పాలనకు దూరమైపోయాయని, సీఎం ప్రజపాలనకు ఆకార్షితులై కాంగ్రెస్ పార్టీ లో చేరారని అన్నారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు వారి పేరు పైనే ఇచ్చి కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చెయ్యాలని సంకల్పంతో ఉన్నారని, 11న జరగబోయే సాధారణ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలో కాంగ్రెస్ ని భారీ మెజారిటీతో గెలిపియ్యాలని కోరారు. పాల్దా గ్రామంలో ఖానాపూర్ కాలూర్ డివిజన్ లో ఇంకా ఎన్నో అభివృద్ధి పనులు చేసేందుకు తాను ఎప్పుడు సిద్ధంగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమం లో పీ సీ సీ డెలిగేటు శేఖర్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు రాజలింగం, భాగరెడ్డి, నిజామాబాదు రూరల్ మండల సర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షులు తీర్మాన్పల్లి సర్పంచ్ కౌలాస్ మోహన్, కొండూర్ సర్పంచ్ సంతోష్, కాలూర్, ఖానాపూర్ డివిజన్ అభ్యర్థి అగ్గు భోజన్న, కాంగ్రెస్ నాయకులు జనార్దన్, రమేష్ పాల్గొన్నారు.

ప్రాంతీయం





ఏడుపాయల జాతరకు భారీ ఏర్పాట్లు

- సమీక్ష సమావేశం నిర్వహించిన కలెక్టర్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 4 : తెలంగాణలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వన దుర్గ మాత ఆలయ జాతర ఏర్పాట్లకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేయడం జరుగుతుందని భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజా తెలిపారు. బుధవారం ఏడుపాయల వన దుర్గ మాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మహాశివరాత్రి జాతర ఆధ్యాత్మిక శోభతో ఘనంగా నిర్వహించేందుకు కట్టుదిట్టంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో జాతర ఏర్పాట్లపై సమీక్షించారు. ఫిబ్రవరి 15 నుంచి 17 వరకు 3 రోజుల పాటు ఏడుపాయల జాతర వేడుకలను అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తున్నట్లు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కల్గకుండా జాతర నిర్వహించాల్సి ఉంటుందని, నిర్దేశించుకున్న పనులను జాతర సమయానికి సన్నద్ధమయ్యే విధంగా వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఏడుపాయల అమ్మవారి క్షేత్రంలో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించే జాతర ఆధ్యాత్మికంగా, దైవికంగా నిబంధనలు పాటిస్తూ, ఎక్కడ ఎలాంటి లోపాలు జరగకుండా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఏడుపాయల ఆలయంలో జరిగే పూజలలో ఎలాంటి లోపాలు ఉండకుండా చూడాలని, శాస్త్రపరంగా అమ్మవారి పూజలు ఘనంగా జరగాలని, భక్తులకు త్వరగా దర్శనం లభించే విధంగా చర్యలు తీసుకోవాలని, జాతర నిర్వహణకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. జాతర సందర్భంగా ఎక్కువ బస్సు సర్వీసులు నడపాలని, జాతరకు ఎక్కువ భక్తులు వచ్చే అవకాశం ఉందని, భక్తుల రద్దీ ఆధారంగా డిపో మేనేజర్లు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ అవసరమైన రోడ్లలో అదనపు సర్వీసులు నడపాలని సూచించారు. భక్తులకు త్రాగునీటి ఇబ్బందులు కలక్కుండా ఎక్కడికక్కడ త్రాగునీటి సదుపాయాలను ఏర్పాటు చేయాలని అన్నారు. వైద్య క్యాంపులు ఏర్పాటు చేయాలని, నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, ముఖ్యమైన ప్రదేశాలలో అన్ని పందిళ్ల వద్ద మంటలు ఆర్పే ఫైర్ యంత్రాలను ఏర్పాటు చేయాలని అన్నారు. మత్స్య శాఖ ఆధ్వర్యంలో 150మంది గజ ఈతగాళ్లు 2 ఫైర్ డిపార్ట్మెంట్ ద్వారా అగ్నిమాపక వాహనాలు, ఒక ద్విచక్ర వాహనం అందుబాటులో ఉంచుతున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ద్వారా 5 ప్రదేశాలలో క్యాంప్ లు, నాలుగు 108 అంబులెన్సు లు,లక్ష వో ఆర్ ఎస్ ప్యాకెట్ లు, మందులు, అంత్యవసర మందులు,28 మంది డాక్టర్లు, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ 4, 80 మంది ఆయుష్ డాక్టర్లు, ఏఎన్ఎంలు 100, ఇతర వైద్య సిబ్బంది మొత్తం 300 మంది పనిచేస్తారని తెలిపారు. ఆర్టీసీ ద్వారా ప్రతి రోజు వివిధ రూట్లలో 140 బస్సులు మూడు రోజుల పాటు మొత్తం 420 బస్సులు నడుస్తాయని తెలిపారు. టేకుల గడ్డ బస్టాండ్ నుండి 10 ఉచిత మినీ బస్సులు తిరుగుతాయి తెలిపారు. ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో 9 సంచార బృందాలు, 2 చెక్ పోస్టులు, మిషన్ భగీరథ, ఆర్డబ్ల్యూఎస్ శాఖల సమన్వయంతో 144 నల్లాలు, 45 మంది మానిటరింగ్ చేస్తారని,400 మంది కార్మికులు,498 మరుగు దొడ్లు, వాటర్ ట్యాంకర్లు 40, ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా పంచాయతీ శాఖ ద్వారా 18 మంది సెక్టార్ అధికారులు,180 మంది పంచాయతీ కార్యదర్శులు,640 మంది మల్టీ పర్పస్ కార్మికులు,రెండు షిఫ్టులో పని చేయనున్నారు .13 తేదీ నుంచి 18 వ తేదీ వరకు పనులు చేయనున్నారు. డస్ట్ బిన్స్, బ్లీచింగ్ పౌడర్, పాగింగ్ చేయనున్నారు.

జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు 04 డీఎస్పీలు, 23 మంది సీఐలు, 80మంది ఎస్సైలు, 45మంది ఏఎస్సైలు, 96మంది హెడ్ కానిస్టేబుళ్ళు, 250 మంది కానిస్టేబుళ్లు, 84 మంది మహిళా కానిస్టేబుళ్లు, 234 మంది హోంగార్డులు, 14మంది మహిళా హోంగార్డులు మొత్తం 829 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, మెదక్ ఆర్డీవో రమాదేవి, నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి , డీఎస్పీ ప్రసన్నకుమార్ .జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిపిఓ యాదయ్య, నాగ్సన్పల్లి సర్పంచ్ సుశీల, ఆలయ కార్య నిర్వహణ అధికారి, వీరేశం, తాసిల్దార్ సతీష్ కుమార్, కొల్చారం తాసిల్దార్ శ్రీనివాస చారి, వివిధ శాఖల జిల్లా అధికారులు ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నసాగర్ డీ–13 కాల్వ ద్వారా నీళ్లు వదలాలి

- మంత్రి వివేక్‌కు రైతుల విన్నపం
- చెరువులకు నీరు ఇవ్వాలని కోరిన సర్పంచులు, రైతులు
- అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన మంత్రి



ప్రతిపక్షం, దౌల్తాబాద్, ఫిబ్రవరి 4: యాసంగి సాగు పంటలను కాపాడేందుకు మల్లన్నసాగర్ నుంచి డీ-13 కాలువ ద్వారా చెరువులకు సాగునీరు విడుదల చేయాలని దొమ్మాట, గాజులపల్లి, సూరంపల్లి, జంగాపల్లి,అల్మాస్ పల్లి గ్రామాల సర్పంచ్ లు, రైతులు కలిసి బుధవారం మధ్యాహ్నం రామంపేటలో ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి తో సర్పంచ్ లు రైతులు,మాట్లాడుతూ. సాగునీరు లేక వరి, మొక్కజొన్న, కూరగాయల పంటలు ఎండిపోతున్నాయని మంత్రికి వివరించారు. మల్లన్నసాగర్ నుంచి డీ-13 కాలువ ద్వారా తమ తమ గ్రామాల చెరువుల్లోకి తక్షణమే నీరు ఇవ్వాలని విన్నవించారు. ఇప్పటికే చెరువులు, కుంటలు అడుగంటిపోవడంతో పాటు భూగర్భ జలాలు తగ్గిపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతుల సమస్యను శ్రద్ధగా విన్న మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి స్పందిస్తూ, రేపు ఉదయం 6 గంటలకు చెన్నూరు వెళ్తున్న సందర్భంగా మధ్య మార్గంలో సిద్దిపేటలో కలవాలని దొమ్మట గాజులపల్లి జంగంపల్లి అల్మాస్పూర్ సూరంపల్లి ముత్యంపేట సర్పంచ్ ల కు రైతులకు, సూచించారు. అక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రైతులకు నీటి సమస్యపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని భరోసా కల్పించారు. మంత్రి ఇచ్చిన హామీతో రైతుల్లో కొంత ఆశాభావం వ్యక్తమైంది. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్ లు, రైతులు ఉన్నారు.



కాంగ్రెస్ పార్టీతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యం

- పదో వార్డులో కాంగ్రెస్ నేత మహదేవుని శ్రీనివాస్ ఎన్నికల ప్రచారం

ప్రతిపక్షం, చేర్యాల, ఫిబ్రవరి 4: కాంగ్రెస్ పార్టీతోనే సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని కొమురవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహదేవుని శ్రీనివాస్ అన్నారు. మున్సిపల్ ఎన్నికలలో భాగంగా చేర్యాల మున్సిపాలిటీలోని 10వ వార్డ్ కౌన్సిలర్ గా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి తుమ్మలపల్లి లీల సంజీవులు కు మద్దతుగా ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం మహదేవుని శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లు, అర్హులు అందరికీ కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం, పేద కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సౌకర్యం వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. అలాగే పదవ వార్డులో మురుగు కాలువలు, రోడ్లు, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి సమస్యను గుర్తించి జనగామ నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీ కొమ్మూరి ప్రతాపరెడ్డి సహకారంతో కాల పరిమితిలో పూర్తిగా పరిష్కరిస్తామని ప్రజలకు స్పష్టమైన హామీ ఇవ్వడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి లీల సంజీవులు ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగంపల్లి శ్రీనివాస్, లింగంపల్లి కనకరాజు, బత్తిని నర్సింలు గౌడ్, సార్ల లింగం, బొచ్చు ఎల్లయ్య యాదవ్, ఏర్పుల రాజు, ఉప్పల వంశీ కృష్ణ,ఈగ కనకరాజు, గుండా మహేష్, ముత్యం కరుణాకర్, రుద్రారం సిద్ధులు, సత్యనారాయణ, నర్సింలు, శ్రవణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థులకు గెలిపించండి

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, జనగామ, ఫిబ్రవరి 4: జనగామ పట్టణ పరిధిలోని 24, 25, 26వ మున్సిపల్ వార్డుల్లో జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) తరపున పోటీ చేస్తున్న మున్సిపల్ కౌన్సిలర్లకు ఓటు వేసి గెలిపించాలని పట్టణ ప్రజలను కోరారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి, పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కష్టాల పాలవుతాం

- మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగరవేయడం ఖాయం
- మెదక్ లో బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం
- బతుకమ్మ ఆడిన మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డి



ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 4: గత ఎన్నికల్లో కాంగ్రెస్ కు ఓటు వేసి కష్టాలు తెచ్చుకున్నామని, మున్సిపల్ ఎన్నికల్లో ఆ తప్పిదం చేయకుండా బీఆర్ఎస్ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే, జిల్లా పార్టీ అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. బుధవారం మెదక్ మున్సిపల్ పరిధిలోని 1,2,3,4 వార్డులో అభ్యర్థులు చెప్యాల రాజవ్వ సంజీవ్, ఎరుకల ఎల్లయ్య, కొట్టాల లలితమ్మ విశ్వం, ధర్మశెట్టి స్వరూపలతో కలిసి ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు.అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు ఎరువులు సకాలంలో అందజేస్తూ ఇబ్బందులు లేకుండా చూసారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యూరియా కోసం రైతులు బారులు తిరు తున్నారని చెప్పారు.మిషన్ భగీరథ పథకం కింద ఇంటింటికి నీరు సరఫరా చేసి మహిళల ఇబ్బందులను తీర్చాలని గుర్తు చేశారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం హయంలో నీటి సమస్య తీవ్రంగా ఉన్న పట్టించుకునేవారు లేకుండా పోయారని ఆరోపించారు.కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలను నెరవేర్చడంలో విఫలమైందని అన్నారు.కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను నేడు ప్రజలు గుర్తు చేసుకుంటూ బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటేస్తామని అంటున్నారని వెల్లడించారు. ఏ ఇంటికి వెళ్లినా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు రూ. 2 వేల పింఛన్లు రూ.4 వేలు చేస్తానని ఇవ్వలేదని, ఇండ్లు ఇస్తామని ఇవ్వలేదని, స్కూటీలు రాలేదని, తులం బంగారం ఇవ్వలేదని, మహిళలకు రూ.2,500 ఇస్తామని ఇవ్వలేదని,రూ.5 లక్షల విద్యా గ్యారెంటీ ఇవ్వలేదని, నిరుద్యోగ భృతి రాలేదని ప్రజలు అంటున్నారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పి, ప్రజలను మోసం చేసి, మభ్యపెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖచ్చితంగా ఈ మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగరవేయడం ఖాయమని తెలిపారు.ఎమ్మెల్యే సొంత నిధులతో అభివృద్ధి చేస్తున్నామని, అనాథలను ఆదుకుంటున్నామని ప్రచారం చేశారని , అభివృద్ధి ఎక్కడ జరిగింది, ఎవరిని ఆదుకున్నారని ప్రశ్నించారు. కేసులు పెడతామని భయభ్రాంతులకు కూడా చేస్తే ఇక్కడ భయపడే వారు ఎవరు లేరని చెప్పారు.ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్తు ఉపాధ్యక్షురాలు యం.లావణ్య రెడ్డి,మాజీ కౌన్సిలర్లు కొట్టాల. విశ్వం,భీమారి. కిషోర్,వార్డ్ ఇంచార్జిలు హవేళి ఘనాపూర్ సర్పంచ్ మ్యాకల.సాయిలు ,ఉప్ప సర్పంచ్ వడ్ల రాజు,వార్డు ఇంచార్జ్లు సుదర్శన్,రవీందర్, మోహన్ నాయక్,నాగరాజు, రామచంద్ర రెడ్డి శ్రీహరి ,పట్టణ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు .



మున్సిపల్ ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ సిబ్బంది కేటాయింపు

- ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, ఫిబ్రవరి 4: సాధారణ మున్సిపల్ ఎన్నికలు -2026 నిర్వహణలో భాగంగా జిల్లాలోని చేర్యాల, హుస్నాబాద్, దుబ్బాక, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలకు సంబంధించిన పోలింగ్ మరియు కౌంటింగ్ సిబ్బందిని ర్యాండమైజేషన్ పద్ధతిలో కేటాయించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కే. హైమవతి తెలిపారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఆన్లైన్ ద్వారా రెండో విడత ర్యాండమైజేషన్ నిర్వహించి, పోలింగ్ ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్, ఇతర పోలింగ్ సిబ్బందిని నియమించారు. ఇందులో చేర్యాల మున్సిపాలిటీకి 122 మంది, హుస్నాబాద్‌కు 200 మంది, దుబ్బాకకు 205 మంది, గజ్వేల్-ప్రజ్ఞాపూర్‌కు 364 మంది సిబ్బందిని కేటాయించారు. అలాగే ప్రతి మున్సిపాలిటీకి 20 శాతం అదనపు (రిజర్వ్) పోలింగ్ అధికారులను కూడా నియమించారు. ఈ సిబ్బందికి ఈ నెల 7న ఐడిఓసి సమావేశ మందిరంలో పోలింగ్ విధానంపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ నెల 13న నిర్వహించనున్న ఓట్ల లెక్కింపుకు సంబంధించిన కౌంటింగ్ సిబ్బందిని కూడా ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. చేర్యాల, హుస్నాబాద్, దుబ్బాక మున్సిపాలిటీలకు తలా 26 మంది చొప్పున, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీకి 40 మంది కౌంటింగ్ సిబ్బందిని నియమించగా, వీరితో పాటు 20 శాతం అదనపు (రిజర్వ్) సిబ్బందిని కూడా కేటాయించారు. కౌంటింగ్ సిబ్బందికి ఈ నెల 9న ఐడిఓసి సమావేశ మందిరంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు.ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియను మున్సిపల్ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం ఆన్లైన్ ద్వారా పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో రాజ్ కుమార్, డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్యా, డీఈవో శ్రీనివాస్ రెడ్డి, మాస్టర్ ట్రైనర్ రామస్వామి, ఎన్నికల విభాగం అధికారులు ఈడియం ఆనంద్, టెక్నికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మెట్టుపల్లి పంట పొలాలకు కాలువల ద్వారా నీళ్లు

- హరీష్ రావుకు గ్రామస్తుల కృతజ్ఞతలు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, ఫిబ్రవరి 4: చిన్నకోడూరు మండలం మెట్టుపల్లి గ్రామానికి కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన రంగనాయక సాగర్ నుంచి కాలువల ద్వారా పంట పొలాలకు నీళ్లు అందడంతో గ్రామంలో హర్షాతిరేకాలు వెల్లివిరిశాయి. ఈ సందర్భంగా గ్రామస్తులు తెలంగాణ మాజీ మంత్రి హరీష్ రావు చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు.ఇటీవల రంగనాయక సాగర్ నుంచి మెట్టుపల్లి గ్రామానికి నీళ్లు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తూ రైతులు, గ్రామస్తులు చిన్నకోడూరు పర్యటనకు వెళ్లిన సందర్భంగా హరీష్ రావు ని కలిసి సమస్యను వివరించారు. వెంటనే స్పందించిన హరీష్ రావు అదే రోజు ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దాంతో సలంద్రి ద్వారా మెట్టుపల్లి గ్రామానికి కాలువల ద్వారా పంట పొలాలకు నీళ్లు చేరాయి. నీళ్లు రావడంతో ఆనందం వ్యక్తం చేసిన గ్రామస్తులు, రైతులు "మేము అడిగిన వెంటనే స్పందించి నీళ్లు వచ్చేలా కృషి చేసిన మీకు ఎంత చేసినా తక్కువే. మీ ఋణం ఎలా తీర్చుకోవాలో తెలియడం లేదు" అంటూ హరీష్ రావుకి, అలాగే కాళేశ్వరం ప్రాజెక్టు రూపకర్త కెసిఆర్ కి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు కాముని శ్రీనివాస్, మెట్టుపల్లి సర్పంచ్ తిరుపతి రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కనక రాజు, మాజీ వైస్ ఎంపీపీ పాపయ్య, చిన్నకోడూరు సర్పంచ్ ఇట్టబోయిన శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఉమేష్, శంకర్, సీనియర్ నాయకులు జంగిటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




సమాచారం ఇవ్వడంలో అధికారులు అలసత్వం వీడాలి

- ప్రతి పౌరుడు సమాచార హక్కు చట్టాన్ని వినియోగించుకోవాలి
- మెదక్ ఉమ్మడి జిల్లా కార్య నిర్వాహక అధ్యక్షునిగా మన్నె కుమార్
- ఆర్టీఐపీసీ జాతీయ అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, ఫిబ్రవరి 4: ప్రభుత్వ అధికారుల్లో పాలకులలో జవాబుదారితనం పడిపోయిందని అవినీతిపరులను కాపాడానికే సకాలంలో సమాచారం ఇవ్వడం లేదని సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. బుధవారం సిద్దిపేటకు చెందిన మన్నే కుమార్ ని ఉమ్మడి మెదక్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షునిగా నియమించిన సందర్భంగా జాతీయ అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం దరఖాస్తులపైన అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని దరఖాస్తుదారులను వేధిస్తున్నారని మండిపడ్డారు. చివరికి కోర్టు మెట్లు ఎక్కే పరిస్థితి వస్తుందని ఈ ధోరణి అధికారులల్లో పోవాలంటే భారత పౌరులు ప్రతి ఒక్కరూ సమాచార హక్కు చట్టం పైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. జిల్లా నుండి మొదలుకొని గ్రామ పంచాయతీల వరకు సమాచారం సేకరించి ప్రజాధనంలో అవినీతి జరిగినట్లయితే అవినీతి అధికారులను ఎండగట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నూతన ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు మన్నే కుమార్, తీగుళ్ల శ్రీనివాస్ రెడ్డి, రాగిరి రాజు, జోగారి రాజు, ఆర్ స్వామి, రవి తదితరులు ఉన్నారు.

మెడికల్ టూరిజం హబ్‌ను రాష్ట్రానికి కేటాయించాలి

- లోక్ సత్తా పార్టీ డిమాండ్



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 4: ఉచితాల ప్రస్తావన లేకుండా, ఆడంబరాలకు పోకుండా, ప్రలోభాలకు గురిచేయకుండా ఆర్థిక అభివృద్ధి సాధనే లక్ష్యంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన 2026 27 వార్షిక బడ్జెట్ లో ప్రకటించిన విధంగా దేశంలో ఏర్పాటు చేయనున్న ఐదు మెడికల్ టూరిజం హబ్ లలో ఒకటి రాష్ట్రానికి కేటాయించాలని లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మనపల్లి శ్రీనివాసు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఫార్మ రంగంలో గణనీయమైన అభివృద్ధిని సాధించి ఫార్మ రాజధానిగా గుర్తింపు పొందిన హైద్రాబాద్ మెడికల్ టూరిజం హబ్ తో వైద్య పరిశోధన వినూతన ఆవిష్కరణలు జరిగి రాష్ట్రంలో ప్రజారోగ్యం మెరుగుపడుతుందని యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన అన్నారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు రాజకీయాలకు అతీతంగా సమన్వయంతో కృషిచేయాలని తుమ్మనపల్లి కోరారు.

“



భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం వల్ల వ్యవసాయం, పాడి వంటి రంగాలకు పూర్తి రక్షణ లభిస్తుంది. ముఖ్యంగా ఈ ట్రేడ్ డీల్ వల్ల భారత వస్తువులపై అమెరికా సుంకాలు గతంలో ఉన్న 50 శాతం నుంచి ఏకంగా 18 శాతానికి తగ్గుతాయి. ఇతర పోటీ దేశాలతో పోలిస్తే భారత్‌పై యూఎస్ విధించిన సుంకాలు తక్కువగానే ఉన్నాయి.

- కేంద్ర మంత్రి పీయూశ్ గోయెల్

ప్రాంతీయం



మహిళా డిగ్రీ కళాశాలలో క్యాన్సర్‌పై అవగాహన

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, ఫిబ్రవరి 4: సిద్దిపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నేడు మహిళా సాధికారత విభాగం, జంతు శాస్త్ర విభాగం మరియు హెల్త్ అండ్ హైజీన్ విభాగాల ఆధ్వర్యంలో విద్యార్థులకు క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దశమి హాస్పిటల్ గైనకాలజిస్ట్ డాక్టర్ వి. సుప్రియ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తిస్తే ప్రాణాలను కాపాడుకునే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. విద్యార్థులు అడిగిన వ్యక్తిగత ఆరోగ్య సమస్యలకు ఆమె వ్యక్తిగతంగా సమాధానాలు ఇచ్చి, తగిన పరిష్కార మార్గాలను సూచించారు.కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. జీవన్ కుమార్ మాట్లాడుతూ, ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపల్ , జంతు శాస్త్ర విభాగాధిపతి సహచార్యులు డాక్టర్‌తో పాటు శ్వేత మేడం, కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ స్రవంతి, డాక్టర్ సామ సువర్ణా దేవి, కిషోర్, హరి ప్రసాద్, స్వప్న, ఇందిరా, తిరుపతి, సంతోష్, మూర్తి, బోధన మరియు బోధనేతర సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



ట్రస్మా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 4: సిద్దిపేట జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం (TRSMA)సిద్దిపేట ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీ సాయంత్రం జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ టోర్నమెంట్ లో జిల్లావ్యాప్తంగా సుమారు 120 పాఠశాలల కరెస్పాండెంట్లు పాల్గొనసున్నారు.టోర్నమెంట్ నిర్వహణకు సంబంధించి క్రికెట్ స్టేడియాన్ని కేటాయించాలని కోరుతూ డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ వెంకట్ నర్సయ్యను ట్రస్మ నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ట్రస్మ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు అడ్ల శ్రీనివాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మోతుకు నరేష్‌కుమార్, కార్యదర్శి విద్యాసాగర్, ట్రెజరర్ నాగరాజు, వైస్ ప్రెసిడెంట్ రామకృష్ణారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మహిళా సమాఖ్య భవనానికి శంకుస్థాపన

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 4 : గ్రామంలో పది లక్షల రూపాయలతో గ్రామ మహిళా సమాఖ్య భవన నిర్మాణ పనులకు భూమి పూజ జరిగింది. పది లక్షల రూపాయలతో గ్రామ ప్రాథమిక పాఠశాల పహార కూడా నిర్మాణానికి , జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి ఆరు లక్షల రూపాయలతో శంకుస్థాపనలు చేశారు. మాక్త భూపతిపూర్ గ్రామ సర్పంచ్ కొమ్ము పవన్ కుమార్ అభివృద్ధి కార్యక్రమాల వివరాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సహకారంతో గ్రామ అభివృద్ధికి చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ పనులన్నింటికీ గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, అధికారులతో కలిసి మార్కింగ్ వేసి ముగ్గు పోసి భూమి పూజ నిర్వహించడం జరిగిందని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ రాజ్ ఏ ఈ శ్రీకాంత్, ఐకెపి సి సి శ్రీనివాస్ రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి నారాయణ, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



స్టార్ హెల్త్ ఆధ్వర్యంలో బస్టాండ్ పునర్నిర్మాణం

ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 4: మండలంలోని ప్రజ్ఞాపూర్ గ్రామం లో జగదేవపూర్ వెళ్ళే చౌరస్తా వద్ద స్టార్ హెల్త్ మిత్రుల సౌజన్యంతో, లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ, లయన్స్ క్లబ్ ఆఫ్ మహతి పర్యవేక్షణలో బస్టాండ్ పునర్నిర్మాణం చేసి బుధవారం స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ బిజినెస్ హెడ్ బాలాజీ, శ్రీనివాస్, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ అమర్నాథ్ రావు, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్ పవన్ చేతుల మీదుగా ప్రారంభించారు ఈ సందర్భంగా డిపో మేనేజర్ పవన్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు సేవాగుణం కలిగి ఉండాలని స్టార్ హెల్త్ సౌజన్యంతో ఇక్కడ బస్టాండ్ పునర్నిర్మానం చేయడం అభినందనీయమని అన్నారు, లయన్ అమర్నాథ్ రావు మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవ అని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా లయన్స్ క్లబ్ సభ్యులు రాధాకృష్ణ మిత్రులు, స్టార్ హెల్త్ వారి సౌజన్యంతో ప్రయాణికులకు సౌకర్యవంతంగా బస్టాండ్ ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ సంజయ్ గుప్తా, ఉప్పల మెట్టయ్య లయన్ సంగునూరి సత్యనారాయణ, డాక్టర్ కుమార స్వామి, రాంపనిదర్ రావు, నేతి శ్రీనివాస్, మల్లేశం గౌడ్,సంతోష్,నాగేందర్, లయన్స్ క్లబ్ ఆఫ్ మహతి డాక్టర్ శైలజ,సుజాత,స్రవంతి, లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




మెదక్ అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ గెలవాలి

- బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యం
- మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మంత్రి వివేక్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 4 : మెదక్ పట్టణం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ జెండా మున్సిపల్ పై ఎగరాలని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. బుధవారం మెదక్ మున్సిపల్ పరిధిలోని 14వ వార్డులో వార్డులో అభ్యర్థి దొంతి లక్ష్మీ ముత్యం గౌడ్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర నాయకుడు మైనంపల్లి హనుమంతరావు ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ తదితరులు పాల్గొన్నారు. గత పది సంవత్సరాల పాలనలో మెదక్ పట్టణ అభివృద్ధి శూన్యమని ఇచ్చిన హామీలను మర్చిపోయి తన స్వలాభం కోసం బిఆర్ఎస్ నాయకులు పనిచేశారు ఆయన తెలిపారు. డబుల్ బెడ్ రూమ్ పథకం ద్వారా కార్యకర్తలకు మేలు జరిగిందని పేద ప్రజలను మాత్రం మరిచిపోయారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాలలో పట్టణాలలో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడం జరిగిందని రెండో దఫాలో సైతం ఇస్తామని ఆయన తెలిపారు. పేద ప్రజలకు కోసం రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యం ఇవ్వడం జరిగిందని పేద ప్రజల కోసమే కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని ఆయన తెలిపారు దేశ రాష్ట్రంలో భగీరథ పేరుతో 65 వేల కోట్ల రూపాయలను బిఆర్ఎస్ నాయకులు మింగారని ఆయన ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అర్హులైన వారందరికీ పెన్షన్లు ఇవ్వడం జరుగుతుందని. బ్రదర్ నియోజకవర్గంలో 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణం కొనసాగుతుందని. ప్రతి మహిళకు ఫ్రీ బస్సు సౌకర్యం కల్పించడం జరిగిందని. మెదక్ జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజ్ నిర్మాణంతోపాటు అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే అభివృద్ధి వేగంగా కొనసాగుతుందని భారత రాష్ట్ర సమితికి ఓటు వేస్తే అభివృద్ధి శూన్యమని ఆయన తెలిపారు ఈ సందర్భంగా కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ. మెదక్ నియోజకవర్గం లో 200 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అభివృద్ధి కొనసాగాలంటే మెదక్ మున్సిపల్ పై కాంగ్రెస్ జెండా ఎగరాలని దీనికోసం ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడి పని చేయాలని కష్టపడ్డ వారికి కాంగ్రెస్ పార్టీ గుర్తిస్తుందని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని అతిపెద్ద దేవాలయంగా ఏడుపాయల వడ దుర్గామాత ఆలయానికి ముఖ్యమంత్రి హోదాలో ఎవరు రాలేదని కేవలం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో వచ్చి 35 కోట్ల రూపాయలను ఇవ్వడం జరిగిందని ఏడుపాయలలో అభివృద్ధి జరుగుతుందని భయపడతారు గత ప్రభుత్వం ఏడుపాయల అభివృద్ధి కోసం పేపర్లో మాత్రమే కనబడేదని అభివృద్ధి మాత్రం శూన్యమని ఆయన ఆరోపించారు. అభివృద్ధి పనులు చేయడం జరిగిందని 29 కోట్ల 30 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని. ఆయన తెలిపారు. రాష్ట్రంలో నిధులన్నీ సిద్దిపేట సిరిసిల్ల గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధి చేయడం జరిగిందని రాష్ట్రంలో ఎందుకు అభివృద్ధి చేయలేదని ఆయన తెలిపారు మెదక్ లో హరీష్‌రావు మాటలు చెల్లవని ఆయన అన్నారు. మెదక్ అభివృద్ధిని అడ్డుకోవడం కోసం హరీష్ రావు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాడని హరీష్ రావును మెదక్ రానీయకుంట మెదక్ అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థులకు దిశా నిర్దేశం చేసిన మంత్రి వివేక్ మెదక్ మున్సిపల్ కాంగ్రెస్ అభ్యర్థులకు మంత్రి వివేక్ వెంకటస్వామి దిశా నిర్దేశం చేశారు అభ్యర్థులతో ఆయన మాట్లాడుతూ నిత్యం వార్డులలో తిరుగుతూ ఉదయం సాయంత్రం ప్రజలతో మమేకం కావాలని ప్రభుత్వ సంక్షేమ పథకాలను వారికి వివరించి ఓటు వేయాలని అడగాలని ప్రతి ఒక్క ఓటరు దగ్గరికి అభ్యర్థి వెళ్లి కలవాలని ఆయన సూచించారు అభ్యర్థి వెంట కార్యకర్తలు నిత్యం పనిచేయాలని పనిచేసే కార్యకర్తలకు గుర్తిస్తుందని వారికి సమోచిత స్థానం పార్టీలో కల్పించడం జరుగుతుందని ఆయన తెలిపారు. మెదక్ మున్సిపల్ పై కాంగ్రెస్ జెండా ఎగరాలంటే కార్యకర్తలు నాయకులు కష్టపడి పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిల్ అభ్యర్థులపాటు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ పట్టణ అధ్యక్షులు గంగాధర్. యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పరశురామ్ గౌడ్.బొజ్జ పవన్ తదితరులు పాల్గొన్నారు



నిరుపేద కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, ఫిబ్రవరి 4: చిన్నకోడూరు మండలం చిన్నకోడూరు గ్రామానికి చెందిన జేరిపోతుల ఎల్లవ్వ గుండె ఆపరేషన్ నిమిత్తం హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా చిన్నకోడూరు మండల కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ అధ్యక్షులు బంక చిరంజీవి యాదవ్ సహకారంతో రూ.3,50,000 ఎల్‌వోసీని అందజేశారు. తక్షణ స్పందనతో సహకరించిన రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ , సిద్దిపేట జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షులు, ఆర్టీఏ మెంబర్ సూర్య వర్మ లకు ఎల్లవ్వ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సందీప్ రెడ్డి,చిన్నకోడూరు గ్రామ సేవాదళ్ అధ్యక్షులు జేరుపోతుల రాజేందర్, సికింద్లాపూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు కూన సంతోష్,నాయకులు ప్రవిత్ తదితరులు.

యూరియా బుకింగ్ యాప్ ద్వారా పారదర్శక పంపిణీ

- జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి



ప్రతిపక్షం బ్యూరో, సిద్ధిపేట, పిబ్రవరి 4: సిద్ధిపేట జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో యూరియా బుకింగ్ యాప్‌ను విజయవంతంగా అమలు చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి స్వరూప రాణి తెలిపారు. ఈ యాప్ ద్వారా రైతులకు అవసరానికి అనుగుణంగా, పారదర్శకంగా మరియు సమయానికి యూరియా ఎరువుల పంపిణీ జరుగుతోందని పేర్కొన్నారు.యాప్‌లో నమోదైన వివరాల ప్రకారం, పీపిబి రైతులు 9,136 మంది 9,140 బుకింగ్స్ చేసి మొత్తం 29,732 యూరియా బస్తాలు బుక్ చేయగా, ఇప్పటివరకు 20,829 బస్తాలు కొనుగోలు చేశారు.ఎన్‌డీఎస్ (NDS - Non Digitally Signed) రైతులు 18 మంది 18 బుకింగ్స్ ద్వారా 59 బస్తాలు బుక్ చేయగా, 41 బస్తాలు కొనుగోలు చేశారు.33 మంది కౌలుదారుల రైతులు 137 యూరియా బస్తాలు బుక్ చేయగా, అందులో 114 బస్తాలు ఇప్పటికే కొనుగోలు చేయబడినట్లు అధికారులు వెల్లడించారు.యూరియా బుకింగ్ యాప్ ద్వారా ఎరువుల అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టడంతో పాటు పంట అవసరాలకు అనుగుణంగా సమాన పంపిణీ సాధ్యమవుతోందని తెలిపారు. కౌలుదారుల రైతులకు కూడా ప్రాధాన్యత ఇస్తూ, మండల మరియు జిల్లా స్థాయిలో రియల్‌టైమ్ పర్యవేక్షణ జరుగుతోందన్నారు. అందువల్ల రైతులు అధికారిక యూరియా బుకింగ్ యాప్ ద్వారానే బుకింగ్ చేయాలని, ఫీల్డ్ స్థాయి సిబ్బందితో సహకరిస్తూ డిజిటల్ విధానాన్ని వినియోగించి వ్యవసాయ కార్యకలాపాలను సజావుగా నిర్వహించాలని కోరారు.

ప్రచారంలో దూసుకుపోతున్న కాంగ్రెస్ అభ్యర్థి రాగి అశోక్



ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 3: మెదక్ మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ 5వ వార్డు అభ్యర్థి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాగి అశోక్. ప్రచారంలో దూసుకెళ్తున్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెదక్ అభివృద్ధి చెందాలంటే మెదక్ మున్సిపాల్ పై కాంగ్రెస్ జెండా ఎగరాలని వారు తెలిపారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయని. ప్రభుత్వం చేసిన పథకాలను ప్రజలకు వివరించి ఓట్లు అడుగుతున్నామని ప్రజల నుండి మంచి స్పందన రావడం జరుగుతుందని మెదక్ అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ జెండా ఎగరాలని వారు తెలిపారు వార్డులలో వివిధ సమస్యలను పరిష్కరిస్తామని ముఖ్యంగా తాగునీటి కొరతను తీర్చడమే కాకుండా వీధిలైట్లు మురికి కాలువలను శుభ్రం చేయడం జరుగుతుందని వారు తెలిపారు వార్డులలో వివిధ సమస్యలను పరిష్కరించడంలో ముందుంటావని రాగి అశోక్ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సహకారంతో వార్డును అభివృద్ధి పరుస్తానని ఆయన తెలిపారు ప్రచారంలో యువజన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




యాసంగి సాగుకు మల్లన్నసాగర్ కెనాల్ ద్వారా నీళ్లు వదలాలి

- లేని పక్షంలో భారీ ఎత్తున ధర్నా చేస్తాం
- వేసిన పంటలు, వరి మొక్కజొన్న కూరగాయలు ఎండిపోతున్నాయి
- గాజులపల్లి, దొమ్మాట, జంగపల్లి, సూరంపల్లి గ్రామాల రైతుల హెచ్చరిక

ప్రతిపక్షం, దౌల్తాబాద్, ఫిబ్రవరి 4: యాసంగి సాగు పంటలకు మల్లన్నసాగర్ ద్వారా కెనాల్ కు తక్షణమే నీటిని విడుదల చేయాలని బుధవారం గాజులపల్లి, దొమ్మాట, సూరంపల్లి, ముత్యంపేట జంగంపల్లి, గ్రామాల సర్పంచ్ లు రైతులు కలిసి సూరంపల్లి కెనాల్ వద్ద ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సాగునీరు అందక ఈ యాసంగిలో సాగుచేసిన పంటలు వరి, మొక్కజొన్న, ఇతర కూరగాయల పంటలు ఎండిపోతున్నాయని, వర్షం కాలంలో నిండిన చెరువులు, కుంటలు, పూర్తిగా అడుగంటి పోయాయని, బోరు బావుల నుంచి నీళ్లు తగ్గి పోతున్నాయన్నారు. దీంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని వారు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కెనాల్ ద్వారా నీరు వదలకపోతే పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాలు చేపడతామని రైతులు హెచ్చరించారు. మల్లన్న సాగర్ నుంచి సూరంపల్లి, దొమ్మాట గాజులపల్లి, జంగపల్లి మీదుగా వెళ్లే కెనాల్ లో నీరు పారాలని,ఇప్పటికే సాగు ఖర్చులు పెరిగి అప్పుల భారంతో ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. నీటి కొరత కారణంగా పంటలు దెబ్బతింటే ఆర్థికంగా పూర్తిగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, సంబంధిత జిల్లా ఇన్చార్జ్ మంత్రి గడ్డం వివేక్,ఇరిగేషన్ అధికారులు తక్షణ చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలని వారు కోరారు.లేదంటే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున నిరసనలు, ధర్నాలు వస్తారోకలు నిర్వహిస్తామని రైతులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్ లు గంగాధరి స్వప్న స్వామి,తొడంగి సునీత స్వామి, ఈదన్నగారి అంజయ్య, పంజ స్వామి,నరసింహా రెడ్డి, ఆయా గ్రామాల రైతులు రైతులు పాల్గొన్నారు.




మోదీకి సభకు వస్తే నేను నేరుగా వెళ్లి ఆయనకు నరవణె రాసిన పుస్తకాన్ని ఇస్తాను. తద్వారా ఆ పుస్తకాన్ని చదివి మోదీ నిజాలను తెలుసుకుంటారు. ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ నరవణె రాసిన బుక్ లద్దాఖ్‌లో జరిగిన ఘటనలను వివరిస్తుంది. దీనిని ముఖ్యంగా దేశంలోని యువత చదవాలి. కైలాష్ రిడ్జ్ ప్రాంతంలో చైనా దళాలు, వారి ట్యాంకుల మోహరింపు గురించి ఈ బుక్‌లో నరవణె హైలెట్ చేశారు.

- లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ

నరవణే పుస్తకం ప్రధానికి అందజేస్తా

- కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ నరవణే రాసిన పుస్తకం వివాదం చెలరేగిన వేళ ప్రధాని నరేంద్ర మోదీకి స్వయంగా ఆ బుక్‌ను అందజేస్తానని కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ వెల్లడించారు. 2020లో భారత్‌చైనా సరిహద్దు వివాదం సమయంలో ప్రధాని మోదీ తన బాధ్యతను సరిగ్గా నిర్వర్తించలేదని మండిపడ్డారు. డోక్లాం ప్రతిష్టంభన బాధ్యతను అప్పటి ఆర్మీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణెపైకి నెట్టేశారని విమర్శించారు. పార్లమెంట్ వెలుపల మీడియాతో రాహుల్ మీడియాతో మాట్లాడారు. ఈ క్రమంలో మోదీ సర్కార్‌పై విమర్శలు గుప్పించారు. ఆ సమయంలో రాహుల్ ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణె రాసిన బుక్‌ను చేతిలో పట్టుకున్నారు. చైనా దురాక్రమణపై భారత సైన్యం మాజీ అధిపతి ఎంఎం నరవణె రాసిన బుక్‌ను ప్రధాని మోదీకి అందజేయడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ఆ పుస్తకంలోని విషయాలు లద్దాఖ్ సంక్షోభ సమయంలో ప్రభుత్వ ప్రతిస్పందన గురించి నిజాలను వెల్లడిస్తాయన్నారు. "ఈ బుక్ అసలు లేదని, స్పీకర్, కేంద్ర ప్రభుత్వం, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ చెప్పారు. దేశంలోని ప్రతి యువకుడు ఈ పుస్తకం ఉందని గమనించాలి. లద్దాఖ్‌లో ఏం జరిగిందో నరవణె పూర్తి వివరాలను ఈ బుక్‌లో రాశారు. ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణే రాసిన బుక్ భారత్‌లో ప్రచురించడానికి ప్రభుత్వం అనుమతించడం లేదు. ఈ బుక్ విదేశాల్లో ప్రచురితమైంది." అని రాహుల్ స్పష్టం చేశారు.



విశ్వ వీక్షణం



మణిపూర్ ముఖ్యమంత్రిగా ఖేమ్‌చంద్ సింగ్ ప్రమాణం


ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, ఇంఫాల్, ఫిబ్రవరి 4: మణిపూర్ నూతన ముఖ్యమంత్రిగా యుమ్నమ్ ఖేమ్‌చంద్ సింగ్ ప్రమాణస్వీకారం చేశారు. మాజీ మంత్రి, కుకీ నాయకురాలు నెమ్చా కిప్ గెన్, నాగాలకు చెందిన లోసి దిఖోలు కొత్త ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రులు ప్రమాణం చేశారు. వీరితో పాటు కొంతౌజం గోవిందాస్ సింగ్, ఖురైజం లోకెన్ సింగ్ కూడా మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ మేరకు లోక్‌భవన్‌లో మణిపూర్ గవర్నర్ అజయ్ కుమార్ బల్లా వారి చేత ప్రమాణస్వీకారం చేయించారు. నెమ్చా కిప్ గెన్ వర్చువల్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. మణిపూర్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఖేమ్‌చంద్ సింగ్‌కు అభినందనలు తెలిపారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. ''మణిపూర్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన యుమ్నమ్ ఖేమ్‌చంద్ సింగ్‌కు అభినందనలు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన నెమ్చా కిప్‌జెన్, లోసీ డిఖోలకు, అలాగే మణిపూర్ ప్రభుత్వంలో మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన కొంతౌజం గోవిందాస్ సింగ్, ఖురైజం లోకెన్ సింగ్‌లకు కూడా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. వారంతా మణిపూర్‌లోని నా సోదరీసోదరుల కోసం అభివృద్ధిని, శ్రేయస్సును మరింత ముందుకు తీసుకెళ్లడానికి శ్రద్ధగా కృషి చేస్తారని నేను విశ్వసిస్తున్నాను.'' అని ప్రధాని ట్వీట్ చేశారు. అంతకుముందు మణిపూర్ ఎన్‌డీఏ శాసనసభాపక్ష నేతగా ఖేమ్‌చంద్ ఎన్నికయ్యారు. ఢిల్లీలోని మణిపూర్ భవన్‌లో రాష్ట్ర ఎన్డీయే భాగస్వామ్య పక్షాల భేటీ జరిగింది. మైతేయ్ వర్గానికి చెందిన ఖేమ్‌చంద్ సింగ్ 2017, 2022లో వరుసగా రెండు సార్లు సింగ్జమేయి అసెంబ్లీ నియోజక వర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. తైక్వాండోలో ప్రావీణ్యమున్న ఖేమ్‌చంద్, 2017 నుంచి 2022 వరకు మణిపూర్ అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేశారు. 2022 అసెంబ్లీ ఎన్నికల తరువాత బీరెన్ సింగ్ తన మంత్రివర్గంలోకి ఖేమ్‌చంద్‌ను తీసుకున్నారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, మున్సిపల్ పరిపాలన, గృహ నిర్మాణం, విద్య సహా పలు కీలక శాఖల మంత్రిగా పనిచేశారు.

ఉపముఖ్యమంత్రిగా కుకీ మహిళా నేత

కాగా, మణిపూర్ కొత్త ప్రభుత్వంలో కుకీ మహిళా నాయకురాలు, మాజీ మంత్రి నెమ్చా కిప్గెన్ ఉపముఖ్యమంత్రి అయ్యారు. అటు నాగాలకు చెందిన మరో ఎమ్మెల్యే లోసి దిఖోను మరో డిప్యూటీ సీఎంగా ఎంపిక చేశారు. బీజేపీ ఇక్కడ చాలా వ్యూహాత్మకంగా ఒక మైతేయ్ తెగ నుంచి ముఖ్యమంత్రిని, కుకీ తెగ, నాగాల నుంచి డిప్యూటీ సీఎంలను ఎంపిక చేసినట్లు సమాచారం.

మణిపూర్‌లో ముగిసిన రాష్ట్రపతిపాలన

మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన ముగిసింది. ఈ మేరకు రాష్ట్రపతి పాలన ఎత్తివేస్తూ కేంద్ర హోం శాఖ గెజిట్ విడుదల చేసింది. ఆర్టికల్ 356 (2) ప్రకారం రాష్ట్రపతి తీసుకున్న ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని వివరించింది. మణిపూర్ నూతన సీఎంగా యుమ్నమ్ ఖేమ్‌చంద్ సింగ్ ప్రమాణస్వీకారం చేయనున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము.



మళ్లీ నిఫా కలకలం

కొన్ని రోజుల నుంచి ఇండియాలో మళ్లీ వైరస్ కలకలం రేగుతోంది. పశ్చిమ బెంగాల్‌లో నిపా వైరస్ వ్యాప్తి (Nipah virus outbreak)ని నియంత్రించడానికి ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటోంది. ఇప్పటివరకు అక్కడ ఐదు కేసులు కన్‌ఫర్మ్ అయ్యాయి. సోకిన వారిలో కొందరు హెల్త్‌కేర్ వర్కర్స్ ఉన్నారు. రోగులతో కాంటాక్ట్‌లో అంటే కలిసిన వారిలో దాదాపు 100 మందిని హోమ్ క్వారంటైన్‌లో ఉంచారు. మరో 100 నుంచి 200 మంది కాంటాక్ట్స్‌ని అధికారులు ట్రాక్ చేస్తున్నారు. కోల్‌కతా, చుట్టుపక్కల ఉన్న ఆసుపత్రులలో రోగులకు ట్రీట్‌మెంట్ ఇస్తున్నారు. ఒక రోగి పరిస్థితి విషమంగా ఉంది.

ఎయిర్‌పోర్ట్ స్క్రీనింగ్స్

ఈ మహమ్మారి కారణంగా అనేక ఆసియా దేశాలు పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చే ప్రయాణికులకు ఎయిర్‌పోర్ట్ హెల్త్ చెక్స్‌ని టైట్ చేశాయి. థాయిలాండ్, నేపాల్, తైవాన్ లక్షణాలు ఉన్న ప్రయాణికులకు టెంపరేచర్ స్క్రీనింగ్, హెల్త్ అడ్వైసరీస్, క్వారంటైన్ ప్రవేశపెట్టాయి. కోల్‌కతా నుంచి వచ్చే డైరెక్ట్ ఫ్లైట్స్‌కి థాయిలాండ్ క్లీనింగ్, డిసీజ్ కంట్రోల్ చర్యలను బలోపేతం చేసింది. నిపాను టాప్ లెవల్ నోటిఫైయబుల్ వ్యాధిగా గుర్తించాలని తైవాన్ యోచిస్తోంది. దీంతో కేసులు డిటెక్ట్ అయితే ఫాస్ట్ రెస్పాన్స్ ఉంటుంది, స్ట్రిక్ట్ మానిటరింగ్ జరుగుతుంది. నిఫా వైరస్ WHO ప్రకారం...నిఫా అనేది జంతువుల నుంచి మనుషులకు వ్యాపించే జూనోటిక్ వైరస్. ఇది కొన్నిసార్లు ఆహారం, పానీయాల ద్వారా వ్యాపిస్తుంది. కాబట్టి నిఫా వైరస్ ఎంత ప్రమాదకరమైనదో, ఒక వ్యక్తికోలుకోవడానికి ఎంత సమయం పడుతుందో, దానికి ఎలా చికిత్స చేయాలో తెలుసుకుందాం.


నిఫా వైరస్ అంటే ఏంటి?

నిఫా వైరస్ జంతువుల నుంచి మనుషులకు సోకుతుంది. అలాగే వైరస్ సోకిన వ్యక్తి నుంచి మరో వ్యక్తికి కూడా వ్యాపిస్తుంది.ఇదిఅంటువ్యాధిప్రాణాంతక వైరస్. ప్రస్తుతం వ్యాక్సిన్ లేదా స్పెసిఫిక్ ట్రీట్మెంట్ లేదు. ఈ వైరస్ ప్రధానంగా ఫ్రూట్ బ్యాట్స్ (గబ్బిలాల) నుంచి మానవులకు కలుషితమైన ఆహారం ద్వారా వ్యాపిస్తుంది. ఒకరి నుంచి మరొకరికి వేగంగా సోకుతుంది. మరణాల రేటు ఎక్కువగా ఉంటుంది. కేసుని ఎంత త్వరగా గుర్తిస్తారు, ఎంత ట్రీట్మెంట్ అందుతుందనే దానిపై ఆధారపడి 40 శాతం నుంచి 75 శాతం మంది ప్రాణాలు కోల్పోతారు.

లక్షణాలు

నిఫా వైరస్ ప్రారంభ లక్షణాలు సాధారణ అనారోగ్యాలుగానే కనిపిస్తాయి. అందుకే ముందుగా గుర్తింపు కాస్త కష్టమవుతుంది. జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పి, వాంతులు, గొంతు నొప్పి వంటివి కనిపిస్తాయి. శ్వాస సమస్యలు లేదా న్యుమోనియా ఉంటాయి. తీవ్రమైన సందర్భాల్లో మెదడు వాపు, కన్ఫ్యూజన్, మూర్ఛలు లేదా కోమాలోకి వెళ్లే ఛాన్స్ ఉంది. లక్షణాలు సాధారణంగా 4 నుంచి 14 రోజుల్లో కనిపిస్తాయి. కానీ కొన్ని సందర్భాల్లో, అవి 45 రోజుల వరకు పట్టవచ్చు. బతికి ఉన్నవారు మూర్ఛ లేదా ప్రవర్తనలో మార్పులు వంటి దీర్ఘకాలిక ప్రభావాలను అనుభవించవచ్చు..కొన్నిసార్లు లక్షణాలు కనిపించకపోవచ్చు. సరైన చికిత్స విధానం, టీకా సదుపాయం లేదు కాబట్టి ఇది ప్రాణాంతకం కావచ్చు







డా. కౌశల్ గోవర్ధన
ఎం.బి.బి.ఎస్, (ఎం.డి, ఇంటర్నల్ మెడిసిన్)
7702417779
వైస్ చైర్మన్, శ్రీ రామానుజ సేవా ట్రస్ట్
డా.ధనుంజయ హాస్పిటల్, హైదరాబాద్

నిఫా వైరస్ నివారణ చర్యలు

నిఫా వైరస్ నివారించాలంటే.. చెట్టు నుంచి పడిపోయిన, సగం లేదా కుళ్లిన పండ్లను తినవద్దు లేదా ముట్టుకోవద్దు. జబ్బుపడిన జంతువులతో.. ముఖ్యంగా పందులకు దూరంగా ఉండాలి. పరిశుభ్రతను పాటించండి. ముఖ్యంగా తరచుగా చేతులు కడుక్కోండి. వైరస్ సోకిన జంతువులు లేదా వ్యక్తుల చుట్టూ ఉంటే తగిన దుస్తులు ధరించండి. వైరస్ సోకిన వ్యక్తిని ఒంటరిగా ఉంచండి.

జాగ్రత్తలు


రోగులు రోజుకు కనీసం 2 నుంచి 3 లీటర్ల నీరు తాగాలి. రోగులకు తగినంత విశ్రాంతి అవసరం. వికారం, వాంతులు నియంత్రించడానికి మందులు వెంటనే తీసుకోవాలి. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఉన్నవారికి ఇన్‌హేలర్లు లేదా నెబ్యులైజర్లు సిఫార్సు చేస్తారు. మూర్ఛలకు యాంటీకన్వల్సెంట్లను సూచిస్తారు. నిఫా వైరస్‌కు మోనోక్లోనల్ యాంటీబాడీ చికిత్సను కూడా ఇస్తారు...ఈ వైరస్‌కు చికిత్స లేదు కాబట్టి నివారణే ప్రధాన మార్గం. కాబట్టి అధికారులు సూచించే నియంత్రణ మార్గాలు ఫాలో అవుతూ ఉండాలి. అలాగే ఏ కారణంగానైనా వైరస్ వ్యాపించడం, లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సేవలు తీసుకోండి. చికిత్సతో లక్షణాలు కంట్రోల్ చేసుకోవచ్చు.

గమనిక

పైన చెప్పిన సూచనలు సమాచార ప్రయోజనాల కోసం మాత్రమే ఉద్దేశించబడింది. వృత్తిపరమైన వైద్య సలహా, రోగ నిర్ధారణ లేదా చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. మీవైద్య పరిస్థితికి సంబంధించి మీకు ఏవైనా ప్రశ్నలు ఉంటే, ఎల్లప్పుడూ మీ వ్యక్తిగత వైద్యుడిని సంప్రదించాలి.

వైరస్ ఎలా వ్యాపిస్తుంది?

సంక్రమణకు గురైన గబ్బిలాలు, పందులు లేదా కలుషితమైన పండ్లు, ముడి ఖర్జూర రసం ద్వారా జంతువుల నుంచి మానవులకు వ్యాపిస్తుంది. బాడీ ఫ్లూయిడ్స్‌తో క్లోజ్ కాంటాక్ట్ ఉన్న వారికి సోకుతుంది. హెల్త్ కేర్ వర్కర్స్‌కి ఎక్కువ రిస్కు ఉంటుంది. అందుకే క్రమం తప్పకుండా చేతులు కడుక్కోండి, మంచి పరిశుభ్రతను పాటించండి. ఫ్రూట్ బ్యాట్స్, అనారోగ్య జంతువులు లేదా కలుషితమైన ఆహారానికి దూరంగా ఉండండి. పండ్లను బాగా కడగాలి. చిలకలు, గబ్బిలాలు తిన్న లేదా దెబ్బతిన్నట్లు కనిపించే పండ్లను తినకండి. అనారోగ్య వ్యక్తులు లేదా జంతువుల దగ్గరకు వెళ్తే చేతికి గ్లౌజులు వేసుకోండి. వైరస్ సోకిన వ్యక్తుల దగ్గరకు వెళ్లకండి.



బలూచ్ రెబల్స్ దగ్గర ఆధునిక ఆయుధాలు

- అలాంటివి పాక్ సైన్యం వద్ద కూడా లేవు
- పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్

ఇస్లామాబాద్, ఫిబ్రవరి 4: పాకిస్తాన్ సైన్యంకంటే బలూచ్ రెబల్స్ దగ్గరే ఆధునిక, ప్రభావవంతమైన ఆయుధాలున్నాయని పాక్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్ అన్నారు. బలూచ్ ప్రాంతంలో పాకిస్తాన్ ఆర్మీ క్రమంగా పట్టుకోల్పోతోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై ఆసిఫ్ మాట్లాడుతూ అక్కడి పరిస్థితుల్ని వివరించారు. ''బలూచ్ రెబల్స్ వద్ద 2 మిలియన్ డాలర్ల విలువైన రైఫిల్స్ ఉన్నాయి. అవి పాక్ సైన్యం వద్ద కూడా లేవు. ఒక్కోటి రూ.4.5 లక్షల విలువ గల థర్మల్ వెపన్స్ కూడా వారివద్ద ఉన్నాయి. కొన్ని అమెరికన్ ఆయుధాలు కూడా కలిగి ఉన్నారు. ఒక్కొక్కరి దగ్గర 20 వేల డాలర్ల విలువైన గేర్ ఉంది. ఇలాంటి ఆయుధాలు వారికి ఎక్కడినుంచి వస్తున్నాయి..? ఇలాంటి ఉగ్రవాద సంస్థల నాయకులు ఆఫ్ఘనిస్తాన్‌లో ఉన్నారు. క్రిమినల్స్‌తో సంబంధాలున్న వారితో మేం చర్చలు జరపబోం. బీఎల్ఏ పేరు మీద దాడులు జరుగుతున్నాయి. ఈ సంస్థకు ఇండియాతో సంబంధం ఉంది. బెలూచ్ రెబల్స్ దాడులు ఆపకపోతే తీవ్రపరిణామాలు ఉంటాయి'' అని ఖవాజా హెచ్చరించారు. పాకిస్తాన్ సైన్యానికి, బలూచిస్తాన్ తిరుగుబాటుదారులకు మధ్య కొన్నేళ్లుగా యుద్ధం నడుస్తున్న సంగతి తెలిసిందే. గత నెల 31న పాక్ ఆర్మీకి, బలూచ్ రెబల్స్‌కు మధ్య భీకర యుద్ధం జరిగింది. పాక్ భద్రతా దళాలపై బీఎల్ఏ భీకర మెరుపు దాడులు చేసింది. ఆత్మాహుతి దాడులకూ పాల్పడింది. దీంతో పాక్ ఆర్మీ కూడా స్పందించింది. ఈ ఘర్షణలో ఇరువైపులా ప్రాణాలు కోల్పోయారు. 100 మందికిపైగా పాక్ భద్రతా సిబ్బంది మరణించగా, 170 మంది వరకు బలూచ్ రెబల్స్ మరణించినట్లు తెలుస్తోంది.






ఎస్ఐఆర్ వల్ల 150 మంది చనిపోయారు

- సిజేఐ జస్టిస్ సూర్యకాంత్ కు ఫిర్యాదుచేసిన మమత

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిలీ, ఫిబ్రవరి 4: కేంద్ర ఎన్నికల సంఘం పశ్చిమ బెంగాల్‌లో చేపట్టిన 'ఎస్ఐఆర్' వల్ల 150 మంది తమ రాష్ట్ర ప్రజలు ప్రాణాలు కోల్పోయారని సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. ఈ అంశంపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌కు ఫిర్యాదు చేశారు. సర్ విషయంలో ఫిర్యాదు చేసేందుకు మమతా బెనర్జీ మూడు రోజులుగా ఢిల్లీలోనే ఉన్నారు. సోమవారం సీఈసీని కలవగా.. బుధవారం చీఫ్ జస్టిస్ సూర్యకాంత్‌ను కలిశారు. ఈ అంశంపై వివరించేందుకు సమయం కావాలని మమత.. సీజేఐని కోరారు. ఆయన మమతకు 15 నిమిషాల సమయం ఇచ్చారు. ఈ సందర్భంగా పశ్చిమ బెంగాల్‌లో సర్ వల్ల కలుగుతున్న ఇబ్బందుల్ని వివరించారు. ఈ అంశంపై ఇప్పటికే సుప్రీంకోర్టులో ఉన్న పిటిషన్లను కూడా త్వరగా విచారించాలని కోరారు. అనంతరం మమతా బెనర్జీ మీడియాతో మాట్లాడారు. సీఈసీ, కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. సర్ ఒత్తిడి తట్టుకోలేక పశ్చిమ బెంగాల్‌లో 150 మంది మరణించినట్లు చెప్పారు. వీరిలో ఒక ఎన్నికల అధికారి కూడా ఉన్నట్లు తెలిపారు. మమత మాట్లాడుతూ ''పశ్చిమ బెంగాల్‌లో మాత్రమే సర్ ఎందుకు..? అసోం, ఇతర ఈశాన్య రాష్ట్రాలు కనిపించడం లేదా..? ఎన్నికల సంఘం పశ్చిమ బెంగాల్ రాష్ట్రంపై మాత్రమే బుల్డోజర్ ప్రయోగిస్తోంది. ఇతర రాష్ట్రాల్లో అనుమతించిన పత్రాల్ని బెంగాల్‌లో అంగీకరించడం లేదు. ఈ అంశంలో కోర్టులు జోక్యం చేసుకుని, మా రాష్ట్ర ప్రజలకు రక్షణ కల్పించాలి. ప్రజాస్వామ్య హక్కుల్ని కాపాడాలి. నాలుగు గోడల మధ్య న్యాయం ఏడుస్తోంది. మాకు ఎక్కడా న్యాయం జరగడం లేదు. ఎన్నికల సంఘానికి ఇప్పటికి ఆరుసార్లు లేఖలు రాసాం. కానీ, ఒక్కసారి కూడా సరైన సమాధానం రాలేదు'' అని అన్నారు. ఈ అంశంపై ఈసీకి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. 'సర్'ను నోబెల్ అవార్డ్ గ్రహీత అమర్త్య సేన్, బెంగాల్ కవి జోయ్ గోస్వామి వంటి ప్రముఖులు కూడా వ్యతిరేకించారు.








రాణించిన ఇషాన్, తిలక్

- దక్షిణాఫ్రికాపై భారత్ ఘన విజయం

టీ20 ప్రపంచకప్‌లో అసలు పోరుకు ముందు భారత్ అదరగొట్టింది. సొంతగడ్డపై డిఫెండింగ్ చాంపియన్ హోదాలో టైటిల్ నిలబెట్టుకోవాలన్న పట్టుదలతో ఉన్న టీమ్ఇండియా..దక్షిణాఫ్రికాతో వామప్ మ్యాచ్‌లో సమష్టి ప్రదర్శనతో ఆకట్టుకుంది. బుధవారం జరిగిన పోరులో భారత్ 30 పరుగుల తేడాతో సఫారీలపై ఘన విజయం సాధించింది. తద్వారా మెగాటోర్నీకి ముందు మెరుగైన ప్రదర్శన కనబరిచింది. తన సూపర్‌ఫామ్‌ను కొనసాగిస్తూ ఇషాన్‌కిషన్(20 బంతుల్లో 53, 2ఫోర్లు, 7సిక్స్‌లు) ధనాధన్ అర్ధసెంచరీకి తోడు తిలక్‌వర్మ (19 బంతుల్లో 45, 3ఫోర్లు, 3సిక్స్‌లు) బ్యాటింగ్‌తో టీమ్ఇండియా తొలుత 20 ఓవర్లలో 240/5 స్కోరు చేసింది. వీరిద్దరికి తోడు అక్షర్‌పటేల్(35 నాటౌట్), కెప్టెన్ సూర్యకుమార్‌యాదవ్(30), హార్దిక్ పాండ్యా(30) రాణించడంతో భారత్‌కు భారీ స్కోరు సాధ్యమైంది. దేశవాళీ ఫామ్‌ను దిగ్విజయంగా కొనసాగిస్తూ జార్ఖండ్ డైనమైట్ ఇషాన్ కిషన్..సఫారీలపై పిడుగులా విరుచుకుపడ్డాడు.మరోవైపు గాయం నుంచి కోలుకున్న హైదరాబాదీ తిలక్‌వర్మ తన ట్రేడ్‌మార్క్ షాట్లతో అభిమానులను అలరించాడు. యాన్సెన్, బాచ్, నోకియా, ఎంఫకే ఒక్కో వికెట్ తీశారు. లక్ష్యఛేదనకు దిగిన దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 210/7 స్కోరుకు పరిమితమైంది. స్టబ్స్(45 నాటౌట్), రికల్టన్(44) ఆకట్టుకున్నారు. ఆఖర్లో స్టబ్స్.దూబేను లక్ష్యంగా చేసుకుంటూ సిక్స్‌లతో హోరెత్తించాడు.

ఫైనల్ కు చేరిన యువ భారత్

అండర్ 19 వరల్డ్ కప్‌లో భారత్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఆఫ్ఘనిస్తాన్‌పై బుధవారం జరిగిన సెమీ ఫైనల్ మ్యాచులో భారత్ ఘన విజయం నమోదు చేసింది. అరోన్ జార్జి సెంచరీతో చెలరేగగా.. వైభవ్ సూర్యవంశీ దూకుడైన అర్ధసెంచరీతో భారీ విజయ లక్ష్యాన్ని ఇండియా సునాయాసంగా ఛేధించింది. హరారే వేదికగా జరిగిన మ్యాచులో మొదట ఆఫ్ఘనిస్తాన్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 50 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 310 పరుగులు చేసింది. ఆఫ్ఘన్ బ్యాటర్లలో ఇద్దరు సెంచరీలు సాధించారు. ఫైజల్ షినోజోదా 110 పరుగులు (93 బంతుల్లో 15 ఫోర్లు), ఉజైరుల్లా 101 పరుగులు, నాటౌట్ (86 బంతుల్లో 12 ఫోర్లు, 2 సిక్సర్లు)తో ఆకట్టుకున్నారు. తర్వాత ఉస్మాన్ సాదత్ 39 పరుగులు, ఖలీద్ అహ్మద్జాయ్ 31 పరుగులు సాధించారు. ఇండియన్ బౌలర్లలో కనిష్క్ చౌహాన్, దీపేశ్ చెరో రెండు వికెట్లు సాధించారు. అనంతరం 311 పరుగుల భారీ లక్ష్యంతో భారత్ బ్యాటింగ్ ఆరంభించింది. ఓపెనర్ అరోన్ జార్జ్ 115 పరుగులు (104 బంతుల్లో 15 ఫోర్లు, 2 సిక్సర్లు)తో చెలరేగిపోయాడు. తర్వాత వైభవ్ సూర్యవంశీ 62 పరుగులు (33 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్సర్లు)తో విధ్వంసం సృష్టించాడు. ఆ తర్వాత కెప్టెన్ ఆయుష్ మాత్రే కూడా 62 పరుగులు (59 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లు)తో అదరగొట్టాడు. అలాగే విహాన్ మల్హోత్రా కూడా 38 పరుగులతో రాణించారు. భారత బ్యాటర్లు సమష్టిగా రాణించడంతో 41.1 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేధించింది. ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఈ నెల 6, శుక్రవారం ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఇండియా, ఇంగ్లండ్ మధ్య ఈ తుదిపోరు ఉంటుంది.



భారత్‌తో మ్యాచ్ ఆడేది లేదు

- పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్

టీ20 ప్రపంచకప్‌లో చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్ మధ్య మ్యాచ్ జరిగే అవకాశాలు రోజురోజుకు సన్నగిల్లుతున్నాయి. మెగాటోర్నీలో టీమ్ఇండియాతో తాము మ్యాచ్ ఆడేది లేదంటూ పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ బుధవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. క్యాబినెట్ మీటింగ్ తర్వాత ఆయన మాట్లాడుతూ బహిష్కరణకు గురైన బంగ్లాదేశ్‌కు మద్దతుగా ఈనెల 15న కొలంబోలో భారత్‌తో జరిగే మ్యాచ్‌లో ఆడబోమని షరీఫ్ కుండబద్దలు కొట్టారు. 'టీ20 ప్రపంచకప్‌లో భారత్‌తో ఆడకపోవడంపై మేము పూర్తి స్పష్టతతో ఉన్నాం. క్రీడల్లో రాజకీయాలను తీసుకురావద్దు. ఈ విషయంలో బంగ్లాకు మద్దతుగా నిలుస్తాం. ఇది సరైన నిర్ణయంగా మేము భావిస్తున్నాం'అని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే ఇప్పటి వరకు ఈ విషయమై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) నుంచి ఐసీసీకి ఎలాంటి అధికారిక సమాచారం రాలేదు.



జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ టోర్నీలో మెరిసిన మీరా

జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో స్టార్ లిఫ్టర్ మీరాబాయి చాను సత్తాచాటింది. మహిళల 48కిలోల విభాగంలో బరిలోకి దిగిన మీరాబాయి..తన పేరిటే ఉన్న మూడు జాతీయ రికార్డులను తిరగరాసింది. ఇప్పటికే పలు ప్రతిష్టాత్మక టోర్నీల్లో పతకాలు కొల్లగొట్టిన మీరా తాజాగా జాతీయస్థాయిలోనూ తనకు తిరుగులేదని చాటిచెప్పింది. తాను పోటీకి దిగిన 48కిలోల కేటగిరీలో స్నాచ్‌లో 89కిలోలు ఎత్తిన క్లీన్ అండ్ జర్క్‌లో 116కిలోలతో మొత్తంగా 205కిలోలతో కొత్త జాతీయ రికార్డులను తన పేరిట లిఖించుకుంది. ఈ ప్రదర్శన తన ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసిందని మీరా పేర్కొంది.



నేడే డబ్ల్యూపీఎల్ ఫైనల్

నెల రోజులుగా క్రికెట్ అభిమానులను అలరిస్తున్న ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) చివరి అంకానికి చేరింది. ఆరంభం నుంచి వరుస విజయాలతో అందరికంటే ముందుగా ఫైనల్ బెర్తును ఖాయం చేసుకున్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)ను టోర్నీ చరిత్రలో రికార్డు స్థాయిలో వరుసగా నాలుగోసారి ఫైనల్ చేరిన ఢిల్లీ క్యాపిటల్స్ ఢీకొననుంది. ఆర్‌సీబీ ఇదివరకే 2024లో ఇదే ఢిల్లీని ఓడించి టైటిల్ నెగ్గి ఈ సీజన్‌లోనూ అదే మ్యాజిక్‌తో రెండో ట్రోఫీని ఖాతాలో వేసుకోవాలని భావిస్తున్నది. మరోవైపు మూడుసార్లు ఫైనల్ చేరినా రన్నరప్‌తో సరిపెట్టుకున్న ఢిల్లీ.. కొత్త సారథి జెమీమా రోడ్రిగ్స్ సారథ్యంలో ఈసారైనా ఆ గండాన్ని అధిగమించాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతున్నది. మరి బెంగళూరుకు 'డబుల్' ఆనందం దక్కుతుందో? లేక క్యాపిటల్స్ కల నెరవేరుతుందో? చూడాలి.




ఏప్రిల్ 30.. 'పెద్ది' రిలీజ్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, బుచ్చి బాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న అత్యంత ప్రతిష్టాత్మక యాక్షన్ డ్రామా 'పెద్ది' ప్రొడక్షన్ చివరి దశలో ఉంది. మార్చి 27న విడుదల చేయాలని భావించిన ఈ సినిమాను వేసవి సెలవుల్ని దృష్టిలో పెట్టుకుని ఏప్రిల్ 30కి మార్చారు. ఈ అదనపు సమయంతో మేకర్స్ భారీ స్థాయిలో ప్రమోషన్స్‌కు సిద్ధమవుతున్నారు. రిలీజ్ డేట్ పోస్టర్‌లో రామ్ చరణ్ మాస్ లుక్‌లో అదరగొట్టారు. పొడవైన జుట్టు, రగ్గడ్ గడ్డం, నోస్ రింగ్‌తో ఆయన లుక్ ఇంటెన్స్ గా కనిపిస్తోంది. ఈ చిత్రం ఇప్పటికే ప్రమోషనల్ కంటెంట్‌తో సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఫస్ట్ గ్లింప్స్, ఫస్ట్‌లుక్ పోస్టర్లు, ఏ ఆర్ రెహమాన్ స్వరపరిచిన చార్ట్‌బస్టర్ సింగిల్ 'చికిరి చికిరి' అన్ని ప్లాట్‌ఫామ్‌లలో అద్భుతమైన స్పందనను అందుకున్నాయి. ఈ సినిమాలో కథానాయికగా జాన్వీ కపూర్ నటిస్తుండగా, శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ, బోమన్ ఇరానీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. రామ్ చరణ్ ఈ సినిమాలో మునుపెన్నడూ చూడని విభిన్నమైన పాత్రలో కనిపించనున్నారు. ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండగా, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ ఆర్ రత్నవేలు డీఓపీ, జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఎడిటర్, అవినాష్ కొల్లా తన అద్భుతమైన ప్రొడక్షన్ డిజైన్‌తో పెద్దికి అద్భుతమైన వరల్డ్ బిల్డింగ్ చేశారు. 'పెద్ది' చిత్రం అన్ని దక్షిణ భారత భాషలు, హిందీలో పాన్‌ఇండియా స్థాయిలో విడుదల కానుంది.

మార్చి 26 'ఉస్తాద్ భగత్ సింగ్' విడుదల

పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా కల్ట్ కెప్టెన్ హరీశ్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతోన్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. తెలుగు సినీ ప్రియులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ చిత్రాన్ని 2026 మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల చేయనున్నట్లు తాజాగా చిత్ర బృందం ప్రకటించింది. 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులకు ప్రత్యేక విందుగా నిలవడంతో పాటు, అన్ని వయసుల ప్రేక్షకులను అలరించేలా వినోదభరితంగా ఈ చిత్రాన్ని మలుస్తున్నారు. ఇప్పటికే విడుదలైన తొలి గీతం 'దేఖ్‌లేంగే సాలా'లో పవన్ కళ్యాణ్ కనిపించిన తీరు కట్టిపడేసింది. లుక్, ఎనర్జీ, స్టెప్పులు పరంగా వింటేజ్ పవర్‌స్టార్ ను ఆవిష్కరించింది ఈ పాట. అభిమాని నుంచి దర్శకుడిగా మారిన హరీశ్ శంకర్, పవన్ కళ్యాణ్ తో రూపొందించిన గత చిత్రం 'గబ్బర్ సింగ్'తో ఎంతటి సంచలనాలు సృష్టించారో తెలిసిందే. ఇప్పుడు 'ఉస్తాద్ భగత్ సింగ్'తో అంతకుమించిన సంచలనాలు సృష్టించడానికి సిద్ధమవుతున్నారు. కుటుంబాలతో కలిసి ప్రేక్షకులు థియేటర్లకు తరలి వెళ్లి, పవర్‌ప్యాక్డ్ వినోదాన్ని ఆస్వాదించేలా 'ఉస్తాద్ భగత్ సింగ్' రూపుదిద్దుకుంటోంది. పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ సినిమా వస్తుందంటే ఆ సందడే వేరు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో పండుగ వాతావరణం నెలకొంటుంది. మార్చి 26న అసలుసిసలైన పవర్‌స్టార్ వేడుకకు సిద్ధంగా ఉండండి.





'బైకర్' మూవీలో బుల్లెట్ సునీల్‌గా రాజశేఖర్

పవర్ ఫుల్ రీస్టార్ట్ గ్లింప్స్ రిలీజ్

చార్మింగ్ స్టార్ శర్వా అప్ కమింగ్ మూవీ 'బైకర్'. అభిలాష్‌రెడ్డి కంకర దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ నిర్మిస్తోంది. రాజశేఖర్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం నుంచి రాజశేఖర్ పాత్రను బుల్లెట్ సునీల్ గా పరిచయం చేస్తూ రీస్టార్ట్ గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు. గ్లింప్స్ పవర్ ఫుల్ వాయిస్ ఓవర్‌తో మొదలవుతుంది. మాజీ మోటోక్రాస్ రేసర్ సునీల్ – 'బుల్లెట్ సునీల్'గా పాపులర్. 18 ఇండియన్ ఛాంపియన్‌షిప్స్, 57 సౌత్ జోన్ టైటిల్స్, 100కు పైగా రేస్ విజయాలతో అద్భుతమైన ట్రాక్ రికార్డ్ తనది. అయినా అతడి ప్రయాణం అక్కడితో ఆగిపోలేదు. "ఇండియన్ రేసర్లు ఓడిపోయేవాళ్లే" అన్న భావన అతడిని కలచివేస్తుంది. ఆ అభిప్రాయాన్ని చెరిపేసి, రేసింగ్ సర్క్యూట్‌లో భారతదేశానికి ఉన్న నిజమైన శక్తిని ప్రపంచానికి నిరూపించాలని నిశ్చయించుకుంటాడు. గత విజయాలు గురించి ఆలోచించకుండా, సునీల్ తన అనుభవాన్ని మళ్ళీ పోరాటంలోకి మళ్లిస్తాడు. ఆ పాత్రకు రాజశేఖర్ ఇచ్చిన ఇంటెన్సిటీ, తపన, ఎమోషనల్ డెప్త్ ఆ ప్రయాణాన్ని మరింత ప్రభావవంతంగా నిలబెట్టాయి. రాజశేఖర్ ఫియర్స్‌గా, మాగ్నెటిక్‌గా కనిపిస్తూ ప్రతి ఫ్రేమ్‌కు వెయిట్ తీసుకొచ్చారు. దర్శకుడు అభిలాష్ రెడ్డి కంకర క్రియేట్ చేసిన హైఇంపాక్ట్ క్యారెక్టర్‌కు ఈ గ్లింప్స్ ఒక పవర్ ఫుల్ టీజర్‌లా నిలుస్తుంది.



చంద్రబాబును కలిసిన 'నటకిరీటి' రాజేంద్ర ప్రసాద్

ప్రముఖ సినీ నటులు, 'నటకిరీటి' డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ మంగళవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవలే రాజేంద్ర ప్రసాద్ కు భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మక 'పద్మశ్రీ' అవార్డును ప్రకటించిన నేపథ్యంలో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజేంద్ర ప్రసాద్ ని సాదరంగా ఆహ్వానించి, ఘనంగా సత్కరించారు. నాలుగు దశాబ్దాలుగా వెండితెరపై వైవిధ్యమైన పాత్రలతో కోట్లాది మంది ప్రేక్షకులను అలరించడమే కాకుండా, తెలుగు సినిమా ఖ్యాతిని పెంచినందుకు గాను ఆయనకు ఈ పురస్కారం లభించడం పట్ల ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారు.

ఓటీటీలో 'మన శంకర వర ప్రసాద్ గారు'

మెగాస్టార్ చిరంజీవి, హిట్ మెషిన్ అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో వచ్చిన ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'మన శంకర వర ప్రసాద్ గారు' బాక్సాఫీస్ వద్ద సెన్సేషనల్ హిట్‌గా నిలిచింది. ఈ ఏడాది సంక్రాంతి కానుకగా విడుదలైన ఈ చిత్రం, ప్రపంచవ్యాప్తంగా ఏకంగా రూ. 350కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను రాబట్టి టాలీవుడ్‌లో 'రీజనల్ ఇండస్ట్రీ హిట్'గా నిలిచింది. మెగాస్టార్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా ఇది సరికొత్త చరిత్ర సృష్టించింది. నయనతార హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో విక్టరీ వెంకటేష్ అతిథి పాత్రలో మెరవడం విశేషం. థియేటర్లలో కాసుల వర్షం కురిపించిన ఈ చిత్రం ఇప్పుడు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో సందడి చేసేందుకు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ సంస్థ జీ5 ఈ సినిమా డిజిటల్ హక్కులను సొంతం చేసుకుంది. ఇక ఇప్పుడు ఈ చిత్రం ఫిబ్రవరి 11 నుంచి స్ట్రీమింగ్ కానుంది. కేవలం తెలుగులోనే కాకుండా హిందీ, తమిళ్, కన్నడ, మలయాళం, మరాఠీ మరియు బెంగాలీ వంటి మొత్తం ఏడు భాషల్లో ఈ చిత్రం అందుబాటులోకి రానుండటం గమనార్హం. థియేటర్లో విడుదలైన నాలుగు వారాలకే ఈ మూవీ ఓటీటీలోకి వస్తోంది. షైన్ స్క్రీన్స్ మరియు గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్లపై సాహు గారపాటి, సుష్మిత కొణిదెల సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. ఈ సినిమాకు ఓటీటీలో కూడా సాలిడ్ రెస్పాన్స్ రావడం ఖాయమని చిత్ర యూనిట్ భావిస్తోంది.



Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200